

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



గ్రూప్-1 మెయిన్స్ ఎంపిక సబబే

స్పష్టం చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

జీవో 29పై దాఖలైన పిటిషన్ల కొట్టివేత

గ్రూప్-1 పోస్టుల భర్తీకి తొలగిన అడ్డంకి

14

శుక్రవారం | 27-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) :22 సంచిక (Issue) : 269 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి రా. 2.27 తదుపరి త్రయోదశి, నక్షత్రం: విశాఖ రా. 8.28 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా.12.45-2.28, దుర్ముహూర్తం: ఉ.8.58-9.42, మ.12.38-1.22, అమృతఘడియలు: ఉ.10.48-12.34, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.47, సూర్యాస్తమయం: 5.45 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆర్థిక మార్గదర్శి అస్తమయం

ప్రస్తుత మీడియా, ఆ మాటకొస్తే పార్లమెంటులోని విపక్షాల కన్నా.. చరిత్ర నా పట్ల దయతో వ్యవహరిస్తుందని నిజాయతీగా నమ్ముతున్నా. ప్రభుత్వ వ్యవస్థలోని విషయాలన్నీ బయటకు చెప్పలేను కానీ, సంకీర్ణ రాజకీయాల అనివార్యతలను దృష్టిలో పెట్టుకొని, ఏ పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో సరిగ్గా అలాగే వ్యవహరించా.

- 2014 జనవరి 3న ప్రధానమంత్రిగా తన చివరి విలేకరుల సమావేశంలో మన్మోహన్‌సింగ్





1932 - 2024

దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్ కన్నుమూత

ఆర్థిక సంస్కరణలు.. జీడీపీ వృద్ధిలో ఉరకలు

దివాలా స్థాయి నుంచి.. దేశాన్ని గట్టెక్కించిన ఆర్థికవేత్త మన్మోహన్

అగ్నిపరీక్షలో.. మన్మోహన్‌కు పీవీ దన్ను!

భారత్‌ను గట్టెక్కించిన 'ఆర్థిక' బంధం

దేశ గతిని మార్చిన 1991 బడ్జెట్

నెల రోజుల్లోనే తయారు చేసిన మన్మోహన్ 12

దేశ నిజమైన వాస్తుశిల్పుల్లో ఒకరు 13

సీఎం రేవంత్ రెడ్డి

ఆయన మాటలు గట్టిగా వినిపించవు! 'మౌనమే' ఘనంగా పని చేస్తుంది!

అంతుపట్టని ఆయన ఆలోచనల లోతు... దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టింది!

ఆయన సాహసోపేత సంస్కరణల ఫలితం... నేడు ఘనంగా కనిపిస్తోంది!

పాఠాలు చెప్పే అధ్యాపకుడి నుంచి దేశాన్ని పాలించిన ప్రధానమంత్రి దాకా ప్రతి దశలో, ప్రతి పనిలో ఆయన పేరు చెరగని ముద్రలా నిలిచిపోయింది!

నేటి తరం రాజకీయాల్లో 'మిస్టర్ క్లీన్'... రేపటి తరానికి ఆదర్శం... విద్యావేత్త, ఆర్థిక వేత్త, సంస్కరణల రూప శిల్పి... నిగర్వి, నిష్కళంకుడు, నిరాడంబరుడు... మన్మోహన్ సింగ్ జీవన ప్రస్థానం ముగిసింది!

ఎవరేమన్నా... ఎవరెన్ని విమర్శలు చేసినా... 'మౌనం'గా పని చేసుకుంటూ వెళ్లిన మన్మోహన్ సింగ్ అంతే మౌనంగా తన జీవన ప్రస్థానానికి వీడ్కోలు పలికారు! కొన్నాళ్లుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో తుది శ్వాస వదిలారు. ఆయన అనుకోకుండా దేశ ఆర్థిక మంత్రి అయ్యారు! అంతే ఆకస్మికంగా, అనూహ్యంగా ప్రధానిగా బాధ్యతలూ చేపట్టారు! 92ఏళ్ల జీవితం.. దేశ విభజన తర్వాత పాకిస్థాన్ నుంచి భారత్‌లో వలస జీవనం... ఎన్నెన్నో మలుపులు, మెరుపులు! డాక్టర్ మన్మోహన్‌సింగ్ సేవలను భారతదేశ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరు.

వృద్ధాప్య సమస్యలతో మాజీ ప్రధాని తుదిశ్వాస

గురువారం రాత్రి 9:51 గంటలకు ఎయిమ్స్‌లో మృతి

హుటాహుటిన ఆస్పత్రికి సోనియాగాంధీ, ప్రియాంక

బెళగావి నుంచి ఢిల్లీకి చేరుకున్న రాహుల్ గాంధీ, ఖర్గే

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సంతాపం

అధికారిక లాంఛనాలతో మన్మోహన్ అంత్యక్రియలు

ఏడు రోజులు సంతాపదినాలుగా ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయ యవనికపై ఒక శకం ముగిసింది! కుదేలైన భారత ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మంత్రిగా గాడిలో పెట్టిన సంస్కరణల రూపశిల్పి.. ప్రధానిగా ప్రగతిపథంలో పరుగులు తీయించిన ఆర్థిక వేత్త ఇక లేరు!! మౌనమే భాషగా ఉంటూనే రెండు పర్యాయాలు.. దేశాన్ని సమర్థంగా పరిపాలించిన రాజనీతిజ్ఞుడు.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. గత కొన్ని నెలలుగా వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం సాయంత్రం తన నివాసంలో అపస్మారక స్థితికి చేరుకున్నారు. రాత్రి 8.06 గంటల సమయంలో కుటుంబసభ్యులు

మిగతా 12వ పేజీలో...

మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఓ గొప్ప నాయకుడిని కోల్పోయింది. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన గొప్ప ఆర్థికవేత్తగా ఎదిగారు. దేశ ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు విశేష కృషి చేశారు

- నరేంద్ర మోదీ

దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిని దేశం కోల్పోయింది. ఆయన ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయి.

- మల్లికార్జున ఖర్గే

గురువును, మార్గదర్శకుడిని కోల్పోయాను. అపార జ్ఞానం, సమగ్రతతో ఆయన దేశాన్ని నడిపించారు

- రాహుల్ గాంధీ

నో బెనిఫిట్!

ఇకపై సినిమా బెనిఫిట్ షోలకు అనుమతించం

నాకు ఎవరిపైనా ఇష్టాయిష్టాల్లేవ్

సీఎంగా చట్టాన్ని అమలు చేస్తా

సీఎం రేవంత్



సినీ ప్రముఖులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి, దిల్‌రాజు, అల్లుఅరవింద్, రాఘవేంద్రరావు



సమావేశంలో సీఎం రేవంత్‌కు శాలువా కప్పుతున్న హీరో నాగార్జున

అసెంబ్లీలో చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నా.. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం.. పద్ధతిగా ఉండండి

సీఎం పేరు చెప్పనందుకే కేసు అని ప్రచారం చేస్తారా?.. ఎప్పుడో ఆ స్థాయి దాటాం.. మీరెందుకు ఖండించలే?

బౌన్సర్లు పోలీసులను అడ్డుకుంటే వారితోపాటు సెలబ్రిటీలపైనా కేసులు.. అభిమానులనూ మీరే నియంత్రించాలి

సామాజిక బాధ్యతను సినీ పరిశ్రమ గుర్తుపెట్టుకోవాలి.. డ్రగ్స్, గంజాయి నిరోధానికి ప్రచారం చేయాలి

పర్యావరణం, ఆలయ పర్యాటక ప్రచార బాధ్యతా మీదే.. ఇండస్ట్రీ సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం

టాలీవుడ్ ప్రతినిధులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి.. గురుకులాలకు సినీపరిశ్రమ నుంచి సెస్ వసూలు యోచన: భట్టి

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇకపై సినిమా బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని.. అసెంబ్లీలో ఈమేరకు తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సినీ పెద్దలకు తేల్చిచెప్పారు. అయితే.. చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని, పరిశ్రమ కూడా సామాజిక బాధ్యత నిర్వర్తించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అల్లు అర్జున్ కేసు విషయాన్ని ప్రస్తావించిన సీఎం.. బన్నీ తన పేరును మర్చిపోవడం వల్ల కేసు పెట్టారంటూ తప్పుడు ప్రచారం చేశారని, తాను ఆ స్థాయిని ఎప్పుడో దాటివచ్చేశానని పేర్కొన్నారు. 'ఆ తప్పుడు ప్రచారాన్ని మీరెందుకు ఖండించలేదు?' అని ఇండస్ట్రీ పెద్దలను రేవంత్ సూటిగా ప్రశ్నించినట్టు తెలిసింది. పరిశ్రమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేస్తున్నామని. పరిశ్రమ తరఫున కూడా ఒక కమిటీని

మిగతా 2వ పేజీలో...

అంతర్జాతీయ స్థాయికి టాలీవుడ్

ప్రభుత్వం, సినీ పరిశ్రమ కలిసి పనిచేయాలని సీఎం సూచించారు

దీనిపై చర్చించి ప్రభుత్వానికి నివేదిస్తాం

ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు

రేవంత్ ప్రభుత్వం టాలీవుడ్‌ను టార్గెట్ చేసింది

బీజేపీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ

2



బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యాం!

టిబెట్‌లో భారత సరిహద్దుకు సమీపంలో..


విద్యుదుత్పత్తి సామర్థ్యం 300 బిలియన్ కిలోవాట్ అవర్స్.. భారత్‌కు ముప్పే!

నీటిని మళ్లిస్తే ఈశాన్య రాష్ట్రాల్లో నీటిఎద్దడి

యుద్ధం పరిస్థితులు వస్తే డ్యామ్‌ను చైనా 'వాటర్ బాంబ్'గా వాడే ప్రమాదం?

బీజింగ్, డిసెంబరు 26: చైనా ప్రపంచంలోనే అతి పెద్ద జలవిద్యుత్తు డ్యామ్‌ను నిర్మించేందుకు సిద్ధమైంది. త్రీగోర్జెస్ డ్యామ్ కంటే మూడు రెట్లు పెద్దదైన ఈ డ్యామ్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. టిబెట్ ప్రాంతంలో భారత సరిహద్దుకు సమీపంలో ఈ డ్యామ్‌ను నిర్మించనుంది. టిబెట్ తూర్పు అంచులో ఉన్న యార్లంగ్ జాంగ్బో నది దిగువ భాగంలో ఈ ఆనకట్టను నిర్మించనున్నట్లు చైనా

మిగతా 13వ పేజీలో...



ఎస్సై సాయికుమార్

కామారెడ్డిలో మూకుమ్మడి ఆత్మహత్యలు?

మృతుల్లో బిక్కనూరు ఎస్సై, మహిళా కానిస్టేబుల్, మరో యువకుడు

అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువులో ఘటన

తొలుత కానిస్టేబుల్, యువకుడి మృతదేహాలు చెరువు నుంచి వెలికితీత

తాజాగా ఎస్సై మృతదేహం కూడా..

మృతికి గల కారణాలపై దర్యాప్తు 3



కానిస్టేబుల్ శ్రుతి



నిఖిల్

పాక్ సరిహద్దు దిశగా తాలిబాన్ ఫైటర్లు

అత్యాధునిక ఆయుధాలతో 15 వేల మందికి పైగా..

అఫ్ఘాన్‌లో పాక్ వైమానిక దాడులతో పెరిగిన ఉద్రిక్తతలు

ప్రతీకారం తీర్చుకుంటామని తాలిబాన్ ప్రభుత్వం హెచ్చరిక

ఇప్పటికే పాకిస్థాన్‌లో తెహ్రీక్ ఎ తాలిబాన్‌తో కలకలం 13



కర్ణాటకలోని బెళగావిలో సీడబ్ల్యూసీ సమావేశంలో ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ తదితరులు

జనగణనలో కులగణన

దేశవ్యాప్తంగా కులగణన కోసం కాంగ్రెస్ పోరాడాలి

సీడబ్ల్యూసీ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి.. సీఎం రేవంత్‌రెడ్డి సూచన

ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించిన సీడబ్ల్యూసీ

జనాభా ప్రకారం పునర్విభజన జరిగితే దక్షిణాదికి అన్యాయమన్న సీఎం

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జన గణనలో కులగణన కూడా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. కులగణనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. బెళగావిలో గురువారం జరిగిన సీడబ్ల్యూసీ సదస్సులో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కులగణన చేపట్టడం ద్వారా తెలంగాణ దేశానికే మార్గదర్శిగా మారిందని

మిగతా 3వ పేజీలో...

రాజ్యాంగానికి ముప్పు

ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రాజెక్టే అది..

అమిత్‌షా రాజీనామా చేయాల్సిందే

కాంగ్రెస్ 'నవ సత్యాగ్రహ బైఠక్' రాజకీయ తీర్మానం 13

బెళగావిలో వర్కింగ్ కమిటీ సమావేశం

రూ.10వేల కోట్లు వచ్చినయ్!

టీజీఐఐసీకి రుణం ఇచ్చిన ఐసీఐసీఐ



సంస్థ ఖాతాలో జమ అయిన సొమ్ము

400 ఎకరాల తనఖాతో రుణ సేకరణ

10 ఏళ్లలో తిరిగి చెల్లించనున్న టీజీఐఐసీ

ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా రుణం పొందేందుకు భూమిని బదిలీ చేసిన సర్కార్

రైతు భరోసా, రైతు కూలీలకు 12వేల భృతికి ఈ నిధులను వినియోగించనున్న ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ)కు ఐసీఐసీఐ బ్యాంకు రూ.10వేల కోట్ల అప్పును మంజూరు చేసింది. ఈ మేరకు రుణం తాలూకు సొమ్ము ఇటీవలే టీజీఐఐసీ బ్యాంకు ఖాతాలో పడినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. టీజీఐఐసీ నుంచి ఈ నిధులు ప్రభుత్వానికి బదిలీ అయ్యాక.. సంక్షేమ పథకాలకు ఉపయోగించుకోనుంది. ముఖ్యంగా రైతు భరోసా, రైతు కూలీలకు రూ.12వేల భృతి పథకాలకు వినియోగించవచ్చని తెలుస్తోంది. వడ్డీతో కలిపి మొత్తం రుణాన్ని సొంతంగా చెల్లిస్తానన్న షరతుతో టీజీఐఐసీ ఈ రుణాన్ని తీసుకుంది. ఇందుకోసం 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి ప్రభుత్వం బదిలీ

మిగతా 14వ పేజీలో...

నో బెనిఫిట్!





ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌తో భేటీ అయిన సినీ ప్రముఖులు; సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దిల్ రాజు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. గురువారం హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో పలువురు సినిమా ప్రముఖులు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర డీజీపీ జితేందర్ ఉన్నారు. పరిశ్రమ సమస్యలతోపాటు పలు అంశాలపై సినీ ప్రముఖులు తమ అభిప్రాయాలను రేవంత్‌కు తెలిపారు. అనంతరం మాట్లాడిన ముఖ్యమంత్రి.. తమ ప్రభుత్వం పరిశ్రమకు ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సినిమా స్టూడియోలకు స్థలాలు, పరిశ్రమవారికి నివాస స్థలాలు, ఫిల్మ్‌నగర్, చిత్రపురి కాలనీ, కార్మికులకు ఇండ్లు, ఇతర సౌకర్యాలను గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలే అందించాయని గుర్తుచేశారు. అదే సహకారాన్ని, ఆ వారసత్వాన్ని తాము కూడా కొనసాగిస్తామని భరోసానిచ్చారు. తెలుగు సినిమా పరిశ్రమకు ప్రపంచవ్యాప్తంగా ఒక బ్రాండ్ క్రియేట్ చేయాలని నిర్ణయం తీసుకున్నామని, పరిశ్రమ బాగుండాలని కోరుకుంటున్నామని అన్నారు. ఐటీ, ఫార్మా రంగాలు ఎంత ముఖ్యమో.. సినీ రంగం కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమని తెలిపారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమకు ప్రభుత్వం తరఫున అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి 'గద్దర్' పేరిట అవార్డులను ఇచ్చేలా కొత్త ఒరవడిని తీసుకొచ్చామని.. ప్రభుత్వానికి, పరిశ్రమకు అనుసంధాకర్తగా ఉండేందుకు దిల్‌రాజును ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించామని గుర్తుచేశారు. దేశంలోని కాస్మోపాలిటన్ నగరాల్లో హైదరాబాద్ ఉత్తమమైనదని.. ఇక నుంచి హాలీవుడ్, బాలీవుడ్ వాళ్లు కూడా హైదరాబాద్‌కు వచ్చేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఇందుకోసం త్వరలో హైదరాబాద్‌లో పెద్ద సదస్సు ఏర్పాటుచేసి ఇతర సినిమా పరిశ్రమలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేయాలని.. గంజాయి, డ్రగ్స్ నిరోధంతో పాటు సామాజిక అంశాలపైనా సినిమా పరిశ్రమ ప్రచారం చేయాలని సూచించారు. "సినిమా వాళ్లు ఫంక్షన్లు చేసుకోవచ్చు మాకు ఏమీ అభ్యంతరం లేదు, అన్ని అనుమతులూ ఇస్తాం. కానీ అభిమానులను నియంత్రించే వ్యవహారాన్ని నిర్వాహకులు, సెలబ్రిటీలే చూసుకోవాలి. బౌన్సర్లు పోలీసు అధికారులనే అడ్డుకుంటున్నారు. దానిని ఎట్టి పరిస్థితుల్లో సహించం. అలా అడ్డుకుంటే బౌన్సర్లతో పాటు.. సెలబ్రిటీలపైనా కేసులు పెడతాం" అని కూడా సీఎం అన్నట్టు సమాచారం.

అది నా బాధ్యత

సినీ పరిశ్రమ అభివృద్ధికి మొదటి తరంలో నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్), మర్రి చెన్నారెడ్డి, రెండో తరంలో చంద్రబాబు, వైఎస్ సహకరించారని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు మూడో తరంలో ఉన్న తమ ప్రభుత్వం కూడా అదే సహకారాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సినీ కార్మికుల సంక్షేమానికి ప్రభాకర్‌రెడ్డి చేసిన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు. ఇండస్ట్రీలో చిరంజీవి కష్టపడి కిందిస్థాయి నుంచి ఎదుగుతూ మెగాస్టార్ స్థాయికి చేరారని, తాను కూడా కిందిస్థాయి నుంచి సీఎం స్థాయి వరకు ఎదిగానని అన్నారు. ఎవరి లక్ష్యాలు, గమ్యాలు వారికి ఉన్నాయి కాబట్టే ఇక్కడవరకు చేరుకోగలిగామని, ఎవరి స్టైల్ వారికి ఉంటుందని వ్యాఖ్యానించారు. సినిమా వారికి రాజకీయాలతో సంబంధంలేదని, ఆ సంగతి తాము చూసుకుంటామని సీఎం ఒక దశలో కొంత ఘాటుగా చెప్పినట్టు తెలిసింది. ముఖ్యమంత్రిగా చట్టాన్ని అమలుచేయాల్సిన బాధ్యత తనపై ఉందని.. అందరినీ సమానంగా చూడడమే తప్ప, ఎవరిపైనా తనకు వ్యక్తిగత ఇష్టాయిష్టాలు లేవని ఈ భేటీలో ఆయన స్పష్టం చేశారు. ఒక్క తెలుగుకే పరిమితం కాకుండా అన్ని భాషల సినిమాల నిర్మాణానికి ఇక్కడ అవకాశం ఉండేలా అందరం కలిసి అభివృద్ధి చేద్దామన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో, ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సినీ పరిశ్రమకు పిలుపునిచ్చారు.

ఆ ప్రచారానికి ఆస్కారం ఇవ్వొద్దు

అల్లు అర్జున్, రామ్‌చరణ్, రానా చిన్నప్పటి నుంచి తనకు తెలుసని.. ఇప్పుడు సూపర్‌స్టార్లుగా ఎదిగిన ఆ ముగ్గుర్నీ చూస్తుంటే సంతోషంతోపాటు గర్వంగా కూడా ఉందని సీఎం పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 8 సినిమాలకు ప్రత్యేక జీవోలు ఇచ్చిందని, 'పుష్ప' సినిమాకు పోలీసు భద్రత ఇచ్చామని గుర్తుచేశారు. అయినా.. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్య దూరం పెరిగిందనే ప్రచారం జరుగుతోందని.. అలాంటి ప్రచారానికి ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు. ఇలాంటి ప్రచారం వల్ల ప్రభుత్వానికంటే పరిశ్రమకే ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాగా.. సినిమాలకు పెద్దగా లాభాలు లేకపోయినా నిర్మాతలు ఇండస్ట్రీపై ప్రేమతో చిత్రాలు తీస్తున్నారని, రాష్ట్రంలో 300కు పైగా సింగిల్ థియేటర్లు మూతపడ్డాయని సినీ ప్రముఖులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పెద్ద మనసు చేసుకోవాలి

వేల కోట్ల రూపాయలు వెచ్చించి సినిమాలు తీస్తున్నారు. కాబట్టి, పెద్ద సినిమాల విషయంలో మీరు కొంచెం పెద్ద మనసు చేసుకోవాలి. మొదటి వారం కొంచెం వెసులుబాటు కల్పించాలి. సంధ్య థియేటర్ దగ్గర చోటుచేసుకున్న ఘటన ఎంతగానో కలచివేసింది.

- మురళీమోహన్, నిర్మాత

మళ్లీ జరగకుండా చూసుకుంటాం

'పుష్ప-2' విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ దగ్గర అనుకోని ఘటన జరిగింది. అలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. సినిమాలకు హైదరాబాద్ వాతావరణం బాగుంటుంది. ముంబై నుంచి కూడా ఇక్కడకు వస్తున్నారు. దీన్ని మరింత బలోపేతం చేసేలా చూస్తాం.

- అల్లు అరవింద్, నిర్మాత

స్టూడియోల్లో పెద్దగా లాభాలు లేవు

నిర్మాతలు బాగుంటేనే మేం బాగుంటాం. స్టూడియోల్లో పెద్దగా లాభాలు రావట్లేదు. అక్కినేని నాగేశ్వరరావు హయాంలో ఇక్కడ స్టూడియోలు ఏర్పాటయ్యాయి. ఇప్పుడు ప్రపంచ సినిమా రంగానికి హైదరాబాద్ రాజధాని కావాలనేదే మా కోరిక.

- నాగార్జున, నటుడు

బాలల చిత్రోత్సవం నిర్వహించాలి

తెలంగాణలో సినిమా చిత్రీకరణకు అవకాశాలు బాగున్నాయి. గత సీఎంలందరూ పరిశ్రమను బాగా చూసుకున్నారు. ప్రస్తుత సర్కారూ మాకు ప్రోత్సాహాన్నిస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏటా బాలల చిత్రోత్సవాన్ని నిర్వహించాలని కోరుతున్నాం.

- రాఘవేంద్రరావు, దర్శకుడు

అమెజాన్, నెట్‌ఫ్లిక్స్‌కు కేరాఫ్‌గా మారాలి

సినీపరిశ్రమ.. రాజకీయాలకు చాలా దూరంగా ఉంటోంది. గత ప్రభుత్వాల సహాయంతోనే అప్పట్లో సినీ పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చింది. హైదరాబాద్‌ను అంతర్జాతీయస్థాయిలో చిత్రాలకు గమ్యస్థానంగా చేయాలన్నదే మా లక్ష్యం. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ లాంటి చాలా ఏజెన్సీలకు హైదరాబాద్ కేరాఫ్ చిరునామాగా మారాలి.

- డి.సురేష్‌బాబు, నిర్మాత

మరింత బలోపేతం అవుతాం..

మాజీసీఎం మర్రి చెన్నారెడ్డి సహా ఆ సమయంలో ఎంతో మంది అందించిన సహకారం వలనే చెన్నై నుంచి సినీ ఇండస్ట్రీ హైదరాబాద్‌కు వచ్చింది. ఇక్కడ అవకాశాలు బాగున్నాయి. బాలీవుడ్ వాళ్లు కూడా వస్తున్నారు. పరిశ్రమను మరింత బలోపేతం చేసే దిశగా ముందుకెళ్తాం.

- త్రివిక్రమ్, దర్శకుడు

సమీకృత గురుకులాలకు పరిశ్రమ నుంచి సెస్: డిప్యూటీ సీఎం భట్టి



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాలకు సినీ పరిశ్రమ నుంచి కొంత సుంకాన్ని తీసుకోవాలనే యోచనలో ఉన్నామని, ఇందుకు పరిశ్రమ సహకరించాలని.. ఈ సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే, డ్రగ్స్, గంజాయి వంటి వాటిపై పరిశ్రమ ప్రచారం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం 'రైజింగ్ తెలంగాణ' నినాదంతో ముందుకెళ్తోందన్న భట్టి.. ఇప్పటికే ఫ్యూచర్ సిటీ, స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటుచేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. సినీపరిశ్రమకు ఏదైనా మేలు జరిగిందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనేనని.. ఆ కోవలోనే తమ ప్రభుత్వం కూడా సహకరిస్తుందని తెలిపారు.

సినిమాటోగ్రఫీ వద్దు అన్నా: మంత్రి కోమటిరెడ్డి



ప్రభుత్వం సినీ పరిశ్రమను అభివృద్ధి చేసే ఉద్దేశంతోనే ఉందని.. వేరే ఉద్దేశాలేవీ లేవని ఈ భేటీలో పాల్గొన్న సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. మంత్రివర్గ కూర్పులో భాగంగా తనకు ఆర్ అండ్ బీతో పాటు సినిమాటోగ్రఫీ శాఖను ఇస్తున్నట్టు సీఎం రేవంత్ చెప్పినప్పుడు.. తనకు సినిమాటోగ్రఫీ వద్దని చెప్పానని, వీలైతే క్రీడల శాఖను ఇవ్వాలని కోరానని.. కానీ అది సాధ్యపడలేదని చెప్పి సమావేశంలో ఆయన నవ్వులు పూయించారు.

తేడా వస్తే కేసులే: డీజీపీ జితేందర్



సినిమా వాళ్లు నిర్వహించుకునే ఫంక్షన్లకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవని ఈ సమావేశంలో పాల్గొన్న డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. అయితే బౌన్సర్ల సంస్కృతి సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక్కోసారి బౌన్సర్లు పోలీసులను కూడా నిలువరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తేడా వస్తే బౌన్సర్లపైనే కాక నిర్వాహకులపైనా కేసులు, చర్యలు ఉంటాయని డీజీపీ హెచ్చరించారు.

రేవంత్ ప్రభుత్వం టాలీవుడ్‌ను టార్గెట్ చేసింది

» బీజేపీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ

న్యూఢిల్లీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలుగు చలన చిత్ర పరిశ్రమ(టాలీవుడ్)ను టార్గెట్ చేసిందని బీజేపీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ ఆరోపించారు. టాలీవుడ్ నటులు, నిర్మాతలను నియంత్రించేందుకు, వారి నుంచి బలవంతంగా డబ్బును వసూలు చేసేందుకు సీఎం రేవంత్ చేసిన ప్రయత్నాలను వారు అడ్డుకోవడంతోనే రాష్ట్రప్రభుత్వం వారిని లక్ష్యంగా చేసుకున్నట్టు కనిపిస్తోందని అన్నారు. నాగార్జునకు చెందిన కన్వెన్షన్ కూల్చివేతతో ఈ వివాదం మొదలైందని, ఆయన మాజీ కోడలు, నటి సమంతపై ఓ మహిళా మంత్రి వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారని, మోహన్‌బాబు కుమారుడిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారనే ప్రచారం జరిగిందని తెలిపారు. తాజాగా నటుడు అల్లు అర్జున్ చిక్కుల్లో పడ్డారని అన్నారు. టాలీవుడ్ సినీ ముఖ్యులు, ఫైనాన్షియర్లు సీఎంను కలవడానికి సిద్ధపడటంతో ఆయన ఒత్తిడి ఫలించినట్టు సంకేతాలు అందుతున్నాయన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా చెప్పుకోదగ్గ విజయాలేమీ సాధించని రేవంత్ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందని అమిత్ మాలవీయ విమర్శించారు.

ఐదు రోజులుగా శ్రీ తేజకు జ్వరం

» బాలుడి ఆరోగ్య వివరాలను తెలిపిన కిమ్స్ వైద్యులు

» పార్టీ నేతలతో కలసి హరీశ్‌రావు పరామర్శ..



హైదరాబాద్ సిటీ/బోయిన్‌పల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ ఐదు రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతున్నాడని వైద్యులు తెలిపారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై గురువారం కిమ్స్ వైద్యులు హెల్త్ బులెటిన్‌ను విడుదల చేశారు. జ్వరం మినహా బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వెంటిలేటర్ సాయం లేకుండా శ్వాస తీసుకుంటున్నాడని వారు వివరించారు. శ్రీతేజ నాడీ సంబంధిత సమస్యను ఎదుర్కొంటున్నాడని వైద్యులు తెలిపారు.

పది రోజులకు సీఎం స్పందించారు: హరీశ్

సంధ్య థియేటర్ ఘటన జరిగిన పది రోజులకు సీఎం, మంత్రులు స్పందించారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజను హరీశ్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నేతల బృందం పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పింది. శ్రీతేజ కోలుకుని మళ్లీ మామూలు మనిషిలా బయటకు రావాలని కోరుకుంటున్నామని హరీశ్ అన్నారు. గురుకులాల్లో చనిపోతున్న పిల్లల కుటుంబాలను రేవంత్, ఆయన మంత్రివర్గం ఎందుకు పరామర్శించట్లేదని నిలదీశారు. సినీ పరిశ్రమతో ప్రభుత్వం చర్చల గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో అందరికీ తెలుసని, ప్రేమానురాగాలతో మనసులు గెలవాలి కానీ భయాందోళనలు సృష్టించి కాదని వ్యాఖ్యానించారు.

మాజీ ఎంపీ మందా జగన్నాథం పరిస్థితి విషమం

నాగర్‌కర్నూల్/హైదరాబాద్ సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మందా జగన్నాథం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఆయన గుండె, మూత్రపిండాలు, ఊపిరితిత్తుల సమస్యలతో హైదరాబాద్ నిమ్స్‌లోని ఆర్ఐసీయూ విభాగంలో మూడు రోజులుగా చికిత్స పొందుతున్నారు. 12 గంటలు గడిస్తే తప్ప ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పలేమని నిమ్స్ వైద్యులు గురువారం బులెటిన్‌లో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మూడు పర్యాయాలు నాగర్‌కర్నూల్ ఎంపీగా, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగానూ ఆయన వ్యవహరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ నేతలతో కలసి నిమ్స్‌లో మందాను పరామర్శించారు.

మీ సేవ పేరుతో నకిలీ వెబ్‌సైట్

హైదరాబాద్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇంతవరకు ప్రైవేటు సంస్థల వెబ్‌సైట్లకు నకిలీవి సృష్టించి దోచుకుంటున్న సైబర్ మోసగాళ్లు ఇప్పుడు ప్రభుత్వం వెబ్‌సైట్లపై దృష్టి పెట్టారు. ఐటీ శాఖ పరిధిలోని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (మీ సేవ) అధికారిక వెబ్‌సైట్‌ను పోలిన నకిలీది సృష్టించి భారీగా దండుకున్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేరుతో నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు సృష్టించారు. ఈ వ్యవహారం గురువారం ప్రభుత్వం దృష్టికి రావడంతో చర్యలు చేపట్టింది. ఆ నకిలీ వెబ్‌సైట్‌ను ఐటీ శాఖ బ్లాక్ చేయించింది. అయితే ఈ వ్యవహారం కొద్ది రోజులుగా సాగుతుండటంతో ఇప్పటికే మోసగాళ్లు రూ.కోట్లలో వసూలు చేసినట్టు తెలిసింది. మీ సేవ అధికారిక వెబ్‌సైట్ meeseva.telangana.gov.in పేరుతో ఉంది. meesevatelangana.in పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీది సృష్టించారు. కొత్తగా మీసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామంటూ కలెక్టర్ అనుదీప్ పేరుతో నకిలీ ఉత్తర్వులు సృష్టించి అందులో ఉంచారు. అది చూసి అనేక మంది ఆశావహులు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేశారు. ఈ విషయాన్ని తెలంగాణ మీ సేవ ఆపరేటర్ల సమాఖ్య కలెక్టర్‌తో పాటు ఐటీ శాఖ దృష్టికి తీసుకెళ్లింది. ఐటీ శాఖతో పాటు కలెక్టర్ కూడా సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేశారు. మీసేవ కేంద్రాలకు సంబంధించి తాను ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదని ఆయన మీడియాతో పేర్కొన్నారు.

గద్దర్ జయంతి రోజు గద్దర్ అవార్డులు ఇవ్వాలి

» కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి స్థలమివ్వాలి: కంచ ఐలయ్య

పంజాగుట్ట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి రోజు గద్దర్ అవార్డులు ఇవ్వాలని, కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెపర్డ్ కోరారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని, వాటిని తాము స్వాగతిస్తున్నామన్నారు. కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఆవరణలో ఆమె విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వైస్ చాన్స్‌లర్‌కు రాసిన లేఖను ఆయన ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సాంస్కృతిక, విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం సినీపరిశ్రమకు ఇచ్చే నంది అవార్డుల స్థానంలో గద్దర్ పేరుతో అవార్డులు ప్రకటించడం, కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు, వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు, కేంద్ర ప్రభుత్వం ములుగులో సమ్మక్క సారలమ్మ పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పైన ప్రతిష్ఠించాలని, కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో స్థలం కేటాయిస్తే తామే ఆరడుగుల కాంస్య విగ్రహాన్ని యూనివర్సిటీకి అందజేస్తామని తెలిపారు. గద్దర్ జయంతి రోజైన జనవరి 31న ఆయన పేరుతో సినిమా అవార్డులు ఇవ్వాలన్నారు.

బాలల దినోత్సవాన్ని నవంబరు 14న జరపడమేంటి?

» పాఠ్యాంశంగా 'వీర్ బాల్ దివస్': కిషన్‌రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో బాలల దినోత్సవాన్ని నెహ్రూ పుట్టినరోజైన నవంబరు 14న జరపడం సరైంది కాదని, మూడున్నర శతాబ్దాల క్రితం ధర్మం కోసం గురుగోవింద్ సింగ్ పిల్లలు బాబా జోరావర్‌సింగ్, బాబా ఫతేసింగ్ ప్రాణత్యాగం చేసిన డిసెంబరు 26న నిర్వహించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి బాబా జోరావర్‌సింగ్, బాబా ఫతేసింగ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రధాని మోదీ సూచనల మేరకు డిసెంబరు 26ను వీర్ బాల్ దివస్‌గా కేంద్రం గుర్తించి, దేశంలోని ప్రతి పాఠశాలలో దీన్ని నిర్వహించాలని ఆదేశాలిచ్చిందని తెలిపారు. వీర్ బాల్ దివస్‌ను పాఠ్యాంశంగా చేర్చాలనే అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లి అమలుకు కృషి చేస్తామని చెప్పారు. సికింద్రాబాద్ నుంచి గోల్డెన్ టెంపుల్ వరకు ప్రత్యేక రైలు ఏర్పాటు అంశాన్ని కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళతానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

ప్లాట్లలోకి చెరువులొచ్చాయ్..!

హైడ్రాకు భిన్నమైన ఫిర్యాదులు.. ఇటీవల ఈ తరహా ఫిర్యాదుల ట్రెండ్.. అలుగులు, తూములు మాయం!!

» చెరువుల్లో పెరిగిన నీటి నిల్వ విస్తీర్ణం

» ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై అయోమయం

» హైడ్రాను ఆశ్రయిస్తున్న యజమానులు

» రికార్డులు, ఉపగ్రహ చిత్రాలను పరిశీలిస్తున్న హైడ్రా

» సమగ్ర పరిశీలన అనంతరం తుది నిర్ణయం: రంగనాథ్

» ప్రతి సోమవారం ఫిర్యాదుల స్వీకరణ



అన్ని రికార్డులు పరిశీలిస్తాం: రంగనాథ్

ప్లాట్లలో చెరువుల నీళ్లు రావడంపై దృష్టిసారించాం. 1973 నుంచి అందుబాటులో ఉన్న సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ఆర్ఎస్‌సీ, ఎన్ఆర్ఎస్ఏ, నీటిపారుదల, రెవెన్యూ శాఖల వద్ద ఉన్న రికార్డులు, మ్యాపులు, ఉపగ్రహ చిత్రాల ఆధారంగా పరిశీలన జరుపుతాం. సామర్థ్యానికి మించి చెరువుల్లో నీరు నిలవడంపై నిజానిజాలను క్షేత్రస్థాయిలో గుర్తిస్తాం. సమగ్ర పరిశీలన తర్వాత మాకు వచ్చిన ఫిర్యాదులపై ఓ నిర్ణయం తీసుకుంటాం. అన్ని రికార్డులను పరిశీలించాక.. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను నిర్ధారిస్తాం.

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): "అయ్యా.. మా ప్లాట్లలోకి చెరువులొస్తున్నాయి." అంటూ హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)కు భిన్నమైన ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నిన్నమొన్నటి వరకు చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు రాగా.. ఇప్పుడు చెరువులే తమ ప్లాట్లను ఆక్రమిస్తున్నాయంటూ బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. చెరువుల విస్తీర్ణం పెరిగి.. ఎన్నడూ లేని విధంగా తమ ప్లాట్లను ముంచెత్తుతున్నాయని యజమానులు తమ ఫిర్యాదుల్లో పేర్కొంటున్నారు. ప్లాట్లలోకి నీళ్లు వస్తుండడంతో.. తాము బఫర్‌జోన్ లేదా ఎఫ్‌టీఎల్‌లో ఉన్నామని హైడ్రా భావించే ప్రమాదమున్నట్టు ప్లాట్ల యజమానులు భయభ్రాంతులకు గురవుతున్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, పటాన్‌చెరు, రామచంద్రాపురం, ఎల్బీనగర్, హయత్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ఈ తరహా ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కొన్నాళ్ల క్రితం అమీన్‌పూర్ చెరువుకు సంబంధించి ఇదే తరహా ఫిర్యాదు అందినట్టు పేర్కొన్నారు.

అలుగులు, తూములను మూసేయడంతో..

హైడ్రా పరిధిలో(గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు.. ఔటర్ రింగ్ రోడ్డు వరకు) 540 చెరువులున్నాయి. వీటిల్లో 185 జీహెచ్ఎంసీ పరిధిలో.. మిగతా 355 గ్రేటర్ హైదరాబాద్‌కు అవల ఉన్నాయి. ఈ చెరువుల్లో చాలా వరకు ఆక్రమణలకు గురైనట్లు హైడ్రా ఇప్పటికే గుర్తించింది. 1973 నుంచి అందుబాటులో ఉన్న సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ఆర్ఎస్‌సీ, ఎన్ఆర్ఎస్ఏ, నీటిపారుదల శాఖ, రెవెన్యూ విలేజ్ మ్యాపుల ఆధారంగా ఆక్రమణలపై ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అభివృద్ధి.. విస్తరణ క్రమంలో చాలా చెరువుల అలుగులు, తూములను మూసివేశారు. ఒక చెరువు నుంచి మరో చెరువుకు వరద నీరు వెళ్లేందుకు అనుసంధానంగా ఉన్న కాల్వలు/నాలాలు కూడా కనుమరుగయ్యాయి. కొన్నిచోట్ల వాటిని మట్టితో పూడ్చిపెట్టగా.. మరికొన్ని చోట్ల దారి మళ్లించారు. చెరువుల్లో నిర్ణీత స్థాయిలో వర్షపు నీరు చేరాక.. అదనపు నీరు దిగువకు వెళ్లేలా అలుగులు దోహదపడతాయి. సాగునీటి అవసరాలకు తూములను ఉపయోగిస్తారు. కొన్నేళ్లుగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుండడంతో.. చెరువులు పొంగిపొర్లుతున్నాయి. అలుగులు, తూములను మూసివేయడంతో.. చెరువుల విస్తీర్ణం పెరిగి.. ఆవాస ప్రాంతాల్లోకి నీళ్లు చేరుతున్నాయి. దీంతో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లపై అస్పష్టత నెలకొంటోంది. దీంతో.. చెరువుల సమీపంలోని పట్టా భూముల్లో ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు ఆందోళన చెందుతున్నారు. తమ ప్లాట్లలోకి చెరువులు వస్తున్నాయంటూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

ప్రతి సోమవారం ఫిర్యాదులు

కొత్త సంవత్సరం నుంచి ప్రతి సోమవారం(సెలవు రోజులు మినహా) ఫిర్యాదులను స్వీకరించాలని హైడ్రా నిర్ణయించింది. జనవరి 6 నుంచి బుద్ధభవన్‌లోని ప్రధాన కార్యాలయంలో 'గ్రీవెన్స్ డే' కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ప్రజలు నేరుగా గానీ, వాట్సాప్ లేదా ఆన్‌లైన్ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చు. వాట్సాప్ నంబరు, ఆన్‌లైన్ వివరాలను త్వరలో వెల్లడిస్తారు.

5,800 ఫిర్యాదులు

చెరువులు, నాలాలు, రోడ్ల ఆక్రమణలు, పార్కులు, లే అవుట్లలోని ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఇప్పటి వరకు 5,800 ఫిర్యాదులు వచ్చినట్లు హైడ్రా అధికారులు తెలిపారు. వీటిల్లో చెరువులు, పార్కులు, లేఅవుట్లలోని ఖాళీ స్థలాల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. హైడ్రా పరిధిలో లేని ప్రాంతాల నుంచి కూడా ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు.

ఐటీ, ఫార్మాలానే సినీ పరిశ్రమకూ సీఎం సహకరిస్తామన్నారు

ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు

హైదరాబాద్: బెనిఫిట్ షోలు, టిక్కెట్ ధరల పెంపు అనేది చిన్న విషయం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినిమాను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ ఎజెండా అని టాలీవుడ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎఫ్‌డీసీ) చైర్మన్, నిర్మాత దిల్ రాజు అన్నారు. ఆయన నేతృత్వంలో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు తెలంగాణ ముఖ్య మంత్రి సీఎం రేవంత్‌రెడ్డితో గురువారం సమావేశమయ్యారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధిపై చర్చించారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేశారని సమావేశం అనంతరం దిల్ రాజు మీడియాకు వెల్లడించారు. తెలుగు సినిమాకు జాతీయ గౌరవం దక్కుతోందని సీఎం అన్నారని ఆయన తెలిపారు. తెలుగు సినిమాను జాతీయ స్థాయిలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చేయడానికి చిత్ర పరిశ్రమ, ప్రభుత్వం కలిసి పని చేయాలని సీఎం సూచించారని, ఆ దిశగా కలిసి పనిచేయబోతున్నామని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో తెలుగుతోపాటు బాలీవుడ్, తమిళ్, కన్నడ, ఇతర భాషా చిత్రాల షూటింగ్‌లు కూడా జరుగుతున్నాయి, భారతీయ సినిమాలే కాదు హాలీవుడ్ చిత్రాలు కూడా ఇక్కడ షూటింగ్ చేసేలా ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై ఇండస్ట్రీ నుంచి సలహాలు ఇవ్వాలని సీఎం కోరినట్లు ఆయన చెప్పారు. దీనిపై తాము త్వరలో సమావేశమై ఏమేం చేస్తే బాగుంటుందో చర్చించుకుని ఎఫ్‌డీసీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. చిత్ర పరిశ్రమకు హైదరాబాద్‌ను ఒక ఇంటర్నేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని దిల్ రాజు అన్నారు. డ్రగ్స్ వ్యతిరేక క్యాంపెయిన్‌లో, ప్రభుత్వ అభివృద్ధి ప్రచార కార్యక్రమాల్లో ఇండస్ట్రీ నుంచి భాగస్వామం కావాలని సీఎం అడిగారని, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు మా నుంచి సహకారం ఉంటుందని చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ విషయంలో తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి హీరోలు, డైరెక్టర్లు ప్రత్యేకంగా ఎవరి ద్వారా చెప్పిస్తే సొసైటీకి రీచ్ అవుతుందో ఆ కార్యక్రమాన్ని కూడా త్వరలో చేపట్టనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌కు ఐటీ ఫార్మా రంగాలు ఎంత కీలకమో సినీ పరిశ్రమ కూడా అంతే కీలకమని సీఎం అన్నారని పేర్కొన్నారు. ఈ మధ్య జరిగిన అనుకోని సంఘటన వల్ల సినీ ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య కొంత గ్యాప్ పెరిగిందనే అపోహ తలెత్తిందని, తాను ఎఫ్‌డీసీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకుని వారం రోజులే అవుతోందని, తాను యూఎస్ నుంచి రాగానే వెంటనే సీఎంని కలిసి సమయం తీసుకున్నానని చెప్పారు. నేటి సమావేశంలో ఇండస్ట్రీకి ఏమేం కావాలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ద్వారా సీఎంకి విన్నవించామన్నారు. ప్రభుత్వం, ఇండస్ట్రీకి మధ్య చర్చల కోసం ఒక కమిటీ ఏర్పాటు చేయబోతున్నామని, గద్దర్ అవార్డులు ఎఫ్‌డీసీతో అనుసంధానంగా జరగాలని సీఎం సూచించారని ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ సమావేశంలో పాల్గొన్న మొత్తం సభ్యుల్లో ఒక్క మహిళా ఆర్టిస్టు గానీ, హీరోయిన్‌గానీ, మహిళా డైరెక్టర్‌గానీ లేరు. 24 క్రాఫ్ట్‌కి సంబంధించిన ఏ ఒక్క విభాగం నుంచి అయినా మహిళలను ఆహ్వానించకపోవడం గమనార్హం.

మార్గళి సంగీత సభలో టీఎం కృష్ణ కలకలం

కచేరీ డ్రెస్ కోడ్‌కు స్వస్తి... బీచ్ షర్టు, లుంగీతో హాజరు

చెన్నై, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీత కచేరీలలో పాటిస్తున్న డ్రెస్ కోడ్‌కు ప్రముఖ గాత్ర విద్వాంసుడు టీఎం కృష్ణ స్వస్తి పలికారు. చెన్నై నగరంలో ప్రతియేటా మార్గశిర మాసంలో సంగీత కచేరీలు నిర్వహించడం ఆనవాయితీ. కొన్నేళ్లుగా టీఎం కృష్ణ ఈ కచేరీలకు దూరంగా ఉంటున్నారు. హేతువాది పెరియార్‌ను కీర్తించే కీర్తనలను పాడడం, దళితులకు కూడా కర్ణాటక సంగీత మాధుర్యాలను అందించాలంటూ కచేరీలు వారి కాలనీల వద్దే చేయడం వంటి చర్యలు కలకలాన్ని సృష్టించాయి. తాజాగా బుధవారం రాత్రి మద్రాసు మ్యూజిక్ అకాడమీలో టీఎం కృష్ణ గాత్ర కచేరీ జరిగింది. ఆ హాలులోని గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ మొత్తం టీఎం కృష్ణ గాన మాధుర్యాన్ని ఆస్వాదించేందుకు వచ్చిన సంగీత ప్రియులతో కిక్కిరిసిపోయాయి. ఈ కచేరీలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన సంప్రదాయక దుస్తులు.. పట్టు చొక్కా లేదా తెలుపు రంగు చొక్కా, పట్టు ధోవతి లేదా సాధారణ ధోవతి ధరించకుండా బీచ్ షర్ట్, లుంగీ ధరించారు. ఇది కొంత కలకలానికి కారణమయింది. అయితే ఆయన సంగీత మాధుర్యంలో మునిగితేలిన రసహృదయులు.. కచేరీ ముగియగానే హర్షధ్వానాలతో ముంచెత్తారు.



బీచ్ షర్ట్, లుంగీ ధరించి వచ్చిన టీఎం కృష్ణను స్వాగతం పలుకుతున్న సభా నిర్వాహకులు



కొండ కింద వైకుంఠ ద్వారం నుంచి ప్రదక్షిణ దారిలో భక్తుల సమూహం

నమో నారసింహా..

» యాదగిరిగుట్టలో భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ

» వైభవంగా స్వామివారి జన్మనక్షత్ర వేడుకలు

భువనగిరి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రం (స్వాతి) పురస్కరించుకుని గురువారం గిరి ప్రదక్షిణ చేపట్టారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొన్నారు. వేదమంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావుతో కలిసి వైకుంఠ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి, హారతి సమర్పించి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. కళాకారుల కోలాటాలు, నృత్యాలు, భజనలు, కీర్తనలతో ప్రదక్షిణ సాగే రోడ్డు హోరెత్తింది. కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్లు సుమారు 45 నిమిషాల పాటు స్వామివారిని తలచుకుంటూ భక్తులు ప్రదక్షిణ పూర్తి చేశారు. కాగా, వైకుంఠ ద్వారం నుంచి కొండకు పశ్చిమ, ఉత్తర దిక్కుల్లో నూతనంగా నిర్మించిన మండపాల్లో ప్రతిష్ఠించిన భక్త ప్రహ్లాద, మునీశ్వరుడు యాదరుషి విగ్రహాలను చామల, బీర్ల ప్రారంభించారు.

అమిత్‌షాపై ప్రజలే తిరగబడతారు: వీహెచ్

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించిన కేంద్రమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పకుంటే.. ప్రజలు ఆయనపై తిరగబడతారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు వ్యాఖ్యానించారు. గురువారం గాంధీభవన్‌లో వీహెచ్ మాట్లాడుతూ.. ఇతరులెవరైనా అంబేద్కర్‌ను అవమానిస్తే కేసులు పెట్టి జైల్లో వేసేవారు.. కానీ అమిత్‌షా మీద ఏ చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. కాగా, ఏఐసీసీ అధ్యక్షుడిగా మహాత్మాగాంధీ ఎన్నికై వందేళ్ల గడిచిన సందర్భంగా గాంధీభవన్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి వీహెచ్ నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీది కీలకపాత్రఅని చెప్పారు.

రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా మిట్టపల్లి వెంకటేశ్..

రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా మిట్టపల్లి వెంకటేశ్ నియమితులయ్యారు. ఈమేరకు జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్ నియామకపత్రాన్ని వెంకటేశ్‌కు అందజేశారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌ను పటిష్ఠం చేసేందుకు పాటుపడాలని వెంకటేశ్‌కు ఆయన సూచించారు.

రష్యా కాల్పుల వల్లే విమానం కూలిపోయిందా?

» వెనుక భాగంలో తూటాలు దూసుకెళ్లినట్లు రంధ్రాలు

మాస్కో, డిసెంబరు 26: అజర్‌బైజాన్ విమానం కూలిపోవడానికి పక్షుల గుంపును ఢీకొనడం కారణం కాదా? ఉక్రెయిన్ డ్రోన్ అని భావించి రష్యా మిలిటరీ కాల్పులు జరపడం వల్లే విమానం కూలిపోయిందా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తోంది. విమానం వెనుక భాగంలో కనిపిస్తున్న రంధ్రాలు తూటాలు దూసుకెళ్లడంవల్ల పడినవేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విమానం కూలిపోవడానికి ముందు లోపల ఒకరు తీసిన వీడియోలో ఓ మహిళ కాలికి గాయమైన దృశ్యాలు, క్యాబిన్ వాల్‌పై కనిపించిన రంధ్రాలు కూడా ఈ సందేహాలకు బలం చేకూరుస్తున్నాయి. అజర్‌బైజాన్ ఇప్పటికే ఉన్నతస్థాయి దర్యాప్తు ప్రారంభించింది. కాగా, రష్యా గగనతల రక్షణ వ్యవస్థ పొరపాటున కాల్పులు జరపడం వల్లే విమానం కూలిపోయిందన్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. దర్యాప్తు పూర్తయితే అసలు కారణాలు తెలుస్తాయని, అప్పటి వరకు ఓపిక పట్టాలని క్రెమ్లిన్ ప్రతినిధి సూచించారు. బుధవారం అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానం ఆ దేశ రాజధాని బాకూ నుంచి రష్యాలోని గ్రోజ్నీ నగరానికి వెళుతుండగా కజకిస్థాన్‌లో కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు సహా 38 మంది ప్రయాణికులు మరణించారు. మిగతా 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. విమానం పక్షులను ఢీకొట్టిన తర్వాత అత్యవసర పరిస్థితి తలెత్తిందని, దాంతో కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయంలో దింపే యత్నంలో కూలిపోయిందనేది ప్రాథమిక సమాచారం.

17 మందికి బాల పురస్కారాలు

» ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, డిసెంబరు 26: వివిధ రంగాల్లో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి, అద్భుత విజయాలు సాధించిన 17 మంది చిన్నారులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా గురువారం 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' అందుకున్నారు. 'వీర్ బాల్ దివస్' సందర్భంగా.. కళలు, సంస్కృతి, ధైర్యసాహసాలు, నూతన ఆవిష్కరణలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, క్రీడలు, పర్యావరణం.. ఇలా ఏడు విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రపతి ఈ పురస్కారంతో సత్కరించారు. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఏడుగురు బాలురు, 10 మంది బాలికలు అవార్డులతో పాటు పతకం, సర్టిఫికెట్, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు విజేతలను రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ అభినందించారు.



చిన్నారికి పురస్కారం అందజేసి అభినందిస్తున్న రాష్ట్రపతి

దేశ పురోగతిలో యువతదే కీలక పాత్ర: మోదీ

దేశ పురోగతిలో యువతదే కీలక పాత్ర అని.. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతికతతో కూడిన నైపుణ్యం అందించి వారిని సిద్ధం చేసేందుకు భవిష్యత్ విధానం అవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. 'వీర్ బాల్ దివస్' సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడారు. కాగా, పోషకాహార సేవలను మరింత బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన 'సుపోషిత్ గ్రామ పంచాయతీ అభియాన్' కార్యక్రమాన్ని మోదీ ప్రారంభించారు.

ఉమ్మడి కరీంనగర్‌లో రేపు అరగంట కరెంట్ బంద్

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ విఫలమైనప్పుడు పునరుద్ధరించేందుకు ఏయే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందనే దానిపై గ్రిడ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రిడ్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అరగంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్ తెలిపారు.

జనగణనలో కులగణన

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది దేశవ్యాప్తంగా చేపట్టనున్న జన గణనలో కులగణన కూడా చేయాలంటూ కాంగ్రెస్ పోరాటం చేయాలని ఆయన సూచించారు. ఈ విషయంలో సీడబ్ల్యూసీ ఒక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. ఆయన ప్రతిపాదన మేరకు సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. త్వరలో చేపట్టనున్న నియోజకవర్గాల పునర్విభజనలోనూ ఏఐసీసీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని రేవంత్ అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో ఏఐసీసీ వ్యూహాత్మకంగా వ్యవహరించి, జాగ్రత్తగా ముందడుగు వేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన మహిళా బిల్లు కొలిక్కి వచ్చిన నేపథ్యంలో దానిపై కాంగ్రెస్ పార్టీనే ఎక్కువగా ప్రచారం చేసుకోవాల్సి ఉందని సీఎం పేర్కొన్నారు. మహిళా బిల్లును కూడా బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశాలున్నందున కాంగ్రెస్ అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు.



కుల గణనతో విప్లవాత్మక మార్పులు: మహేశ్‌కుమార్ గౌడ్

రాహుల్ గాంధీ ఆలోచనలతో చేపట్టాలని నిర్ణయించిన కులగణనతో దేశంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కులాలు, మతాల పేరిట రాజకీయాలు చేస్తూ దేశాన్ని విభజించి పాలిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీ ఎత్తుగడలకు కులగణన చెంపపెట్టు లాంటిదని చెప్పారు. కులగణనకు అత్యంత ప్రాధాన్యమిచ్చి, దాన్ని చేపట్టడం ద్వారా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సీడబ్ల్యూసీ సదస్సులో మహేశ్ కుమార్ గౌడ్ ప్రసంగించారు. తెలంగాణలో కులగణన సర్వే ఇప్పటికే 90 శాతం పూర్తయిందన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని, చరిత్రను తిరగరాయాలని చూస్తోందని మండిపడ్డారు. ఇలాంటి తరుణంలో దేశానికి సేవలు, త్యాగాలు చేసిన కాంగ్రెస్ పార్టీ త్యాగ పురుషుల జీవితాలను నేటి తరానికి వివరించాల్సి ఉందని అన్నారు. సరిగ్గా వందేళ్ల క్రితం ఇదే బెళగావిలో మహాత్మాగాంధీని సీడబ్ల్యూసీ ఏఐసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకుందని గుర్తుచేశారు. ఆ తర్వాత ఏ పదవినీ స్వీకరించకపోయినప్పటికీ గాంధీజీ పాటించిన విలువలు, ఆదర్శప్రాయమైన జీవనం కారణంగా ప్రపంచమంతా ఆయన సిద్ధాంతాలను అనుసరిస్తోందని కొనియాడారు.

కామారెడ్డిలో

మూకుమ్మడి ఆత్మహత్యలు?

మృతుల్లో ఓ ఎస్సై, మహిళా కానిస్టేబుల్, మరో యువకుడు.. అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువులో ఘటన

» కానిస్టేబుల్, యువకుడి మృతదేహాలు బుధవారమే గుర్తింపు

» గురువారం ఉదయం ఎస్సై ఆచూకీ లభ్యం

» మృతికి గల కారణంపై కొనసాగుతున్న దర్యాప్తు

కామారెడ్డి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారమో ? వివాహేతర సంబంధమో ? మరేదైనా కారణమో స్పష్టత లేదు కానీ... ఓ ఎస్సై, ఓ మహిళా కానిస్టేబుల్, మరో యువకుడు కామారెడ్డి జిల్లాలోని ఓ చెరువులో శవాలై కనిపించారు. మూకుమ్మడి ఆత్మహత్యలుగా భావిస్తున్న ఈ ఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం కుప్రియల్ గ్రామ శివారులోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువు వద్ద బుధవారం జరిగింది. ఈ ఘటనలో బీబీపేట పోలీసు స్టేషన్ మహిళా కానిస్టేబుల్ శ్రుతి(25), బీబీపేట సొసైటీ కాంట్రాక్ట్ కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ (28) మృతదేహాలను పోలీసులు బుధవారమే గుర్తించారు. బుధవారం నుంచి ఆచూకీ లేకుండా పోయిన భిక్కనూరు ఎస్సై సాతెల్లి సాయికుమార్ (32) మృతదేహం గురువారం ఉదయం లభ్యమైంది. కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మెదక్ జిల్లా కొల్చారం గ్రామానికి చెందిన సాయికుమార్ 2018లో ఎస్సై అయ్యారు. ప్రస్తుతం భిక్కనూరు ఎస్సైగా ఉన్న సాయికుమార్ గతంలో సిద్దిపేట జిల్లా చిన్నకోడురు మండలం, కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం, బీబీపేట పోలీసుస్టేషన్లలో ఎస్సైగా పని చేశారు. సాయికుమార్‌కు భార్య లక్ష్మి, కొడుకు శ్రీహన్ష్ ఉన్నారు. 2014 బ్యాచ్‌కు చెందిన శ్రుతి గతంలో ఓ వ్యక్తిని వివాహం చేసుకుని విడాకులు తీసుకుంది. మూడేళ్లుగా బీబీపేట పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తుంది.



కానిస్టేబుల్ శ్రుతి కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎస్పీ సింధూ శర్మ

అసలు ఏం జరిగిందంటే ?

ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ మరణాలపై భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. బుధవారం విధులకు హాజరైన శ్రుతి రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించారు. శ్రుతి ఫోన్ స్విచ్ఛాఫ్ లో ఉండడంతో మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా ఆమె చివరిగా పెద్ద చెరువు వద్ద ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడికి వెళ్లి చూడగా శ్రుతి, నిఖిల్‌కు చెందిన వస్తువులతో పాటు భిక్కనూరు ఎస్సై కారు ఉన్నాయి. అర్ధరాత్రి అయినా చెరువులో గాలించగా శ్రుతి, నిఖిల్ మృతదేహాలు దొరికాయి. సాయికుమార్ ఆచూకీ లభించకపోవడంతో అనేక అనుమానాలు తలెత్తాయి. అయితే, గురువారం ఉదయం సాయికుమార్ మృతదేహం కూడా అదే చెరువులో దొరికింది.

ప్రేమ వ్యవహారమేనా ?

బుధవారం మధ్యాహ్నం వరకు విధుల్లో ఉన్న ఎస్సై సాయికుమార్ ఆ తర్వాత తన సొంత కారులో కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి శ్రుతి, నిఖిల్‌ను కలిసినట్టు పోలీసులు ప్రాథమిక విచారణలో తేలింది. అక్కడి నుంచి ఈ ముగ్గురు కలిసి అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువు వైపు వెళ్లినట్లు గుర్తించారు. బీబీపేట పోలీసు స్టేషన్‌లో పని చేసినప్పటి నుంచి సాయికుమార్‌కు శ్రుతితో పరిచయం ఉందని, ఇరువురి మధ్య వివాహేతర సంబంధం ఉందనే ప్రచారమూ ఉంది. సాయికుమార్‌కు భిక్కనూరుకు బదిలీ అయిన తర్వాత శ్రుతికి నిఖిల్ దగ్గరయ్యాడని, ఇరువురు పెళ్లి చేసుకోవాలని అనుకున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో బుధవారం వీరి మధ్య వాగ్వాదం జరగ్గా క్షణికావేశంలో శ్రుతి చెరువులో దూకే యత్నం చేయగా సాయికుమార్, నిఖిల్ ఆమెను అడ్డుకున్నారని ఘటనాస్థలిలో లభించిన ఆనవాళ్ల ఆధారంగా పోలీసులు అనుకుంటున్నారు. అయినా వారిని విడిపించుకుని శ్రుతి చెరువులోకి దూకగా.. ఆమెను కాపాడేందుకు సాయికుమార్, నిఖిల్ కూడా నీళ్లలోకి దూకి పిచ్చి మొక్కలు, నాచు తీగల మధ్య చిక్కుకుపోయి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయి ఉంటారని భావిస్తున్నారు. మృతదేహాలకు పిచ్చి మొక్కలు, నాచు తీగలు చుట్టుకుని ఉండడంతో ఈ అంచనాకు వచ్చారు. అయితే, ముగ్గురూ చనిపోవడంతో వారి ఫోన్ కాల్ డేటా ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముగ్గురి మరణానికి గల కారణాన్ని త్వరలోనే వెల్లడిస్తామని జిల్లా ఎస్పీ సింధూ శర్మ గురువారం విలేకరులతో అన్నారు. కాగా, శ్రుతి ముఖంపై గాయాలున్నాయని సాయికుమార్, నిఖిల్ కలిసి ఆమెను హత్య చేసి ఉంటారని శ్రుతి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఇక, ఎస్సై సాయికుమార్ మృతదేహానికి నివాళులర్పించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

4 సంవత్సరాల్లో 20లక్షల గృహాలు

ఇందిరమ్మ ఇళ్ల కోసం 80 లక్షల దరఖాస్తులు

40లక్షల గృహాలు సర్వే చేసి రికార్డు చేశాం

సంక్రాంతికి 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

దమ్మపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాబోయే 4 సంవత్సరాల్లో పేదలకు 20లక్షల గృహాలు మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 80లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించనున్న ఇందిరమ్మ మోడల్ గృహానికి మంత్రి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులున్నా ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరతామన్నారు. ఇందిరమ్మ గృహాల కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో 10రోజులుగా సర్వే చేస్తున్నారని, ఇప్పటి వరకు సుమారుగా 40లక్షల గృహాలు యాప్ ద్వారా సర్వే చేసి రికార్డు చేశామన్నారు. సంక్రాంతి పర్వదినానికి తొలి విడతగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని, ప్రతి నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయిస్తామని తెలిపారు. అంతకు ముందు నాచారం, గన్నేపల్లి గ్రామాలలో రూ. 20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

మహిళా కూలీలతో పొంగులేటి మాటామంతీ

అశ్వారావుపేట మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన సందర్భంగా ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. గురువారం కేశప్పగూడెం సమీపంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ములకలపల్లి వెళ్తుండగా మార్గమధ్యంలో వేరుశెనగచేనులో పనిచేస్తున్న కూలీలను చూసి వారి దగ్గరకు వెళ్లారు. 'అక్కల్లారా చెల్లెమ్మల్లారా బాగున్నారా... మీకు సొంత ఇళ్లు ఉన్నాయా..' అంటూ పలకరించారు. 'ఇంతకీ నేనెవరో తెలుసా? మీ ఇంట్లో వాటీలో బొమ్మ ఉంటుంది గుర్తు పట్టారా..?' అంటూ కూలీలను పలకరించారు. ఇందుకు వారు స్పందిస్తూ 'తెలుసు, మీరు మంత్రి శ్రీనన్న..' అని బదులిచ్చారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ 'గాజులు వేయించుకోండి..' అంటూ వారికి కొంత నగదు ఇచ్చి ముందుకు కదిలారు.

'పట్నం' బెయిల్ రద్దు చేయాలని కోరతాం

» బెయిల్‌పై ఉండి ప్రెస్ మీట్ ఎలా పెడతారు?

» పాస్‌వర్డ్ చెప్పలేదు.. విచారణకు సహకరించట్లేదు

» లగచర్ల దాడి కేసులో అన్ని ఆధారాలూ ఉన్నాయి

» మల్టీ జోన్ ఐజీ సత్యనారాయణ

పరిగి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): లగచర్ల దాడి కేసులో నిందితుడైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని కోర్టును కోరతామని మల్టీ జోన్ ఐజీ వీ సత్యనారాయణ తెలిపారు. నరేందర్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో ప్రభుత్వం, పోలీసులపై అసత్య ఆరోపణలు చేశారని ఐజీ పేర్కొన్నారు. నరేందర్ రెడ్డి పోలీసుల విచారణకు సహకరించడం లేదని తెలిపారు. ఆయన మాటల తీరు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున న్యాయ నిపుణులతో చర్చించి బెయిల్ రద్దు కోసం కోర్టును కోరతామని తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా పరిగి సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలైన నరేందర్ రెడ్డి ప్రెస్ మీట్ ఎలా పెడతారని ఐజీ ప్రశ్నించారు. లగచర్ల ఘటనలో రైతులపై అక్రమ కేసులు పెట్టి ఇరికించారని చెప్పడం తప్పని, కలెక్టర్‌పై దాడి చేసిన వారిని మాత్రమే అరెస్ట్ చేశామని చెప్పారు. విచారణ అనంతరం అన్ని ఆధారాలతోనే కేసు నమోదు చేశామని తెలిపారు. నిఘా వైఫల్యం అసలు కానేకాదని, అన్ని జాగ్రత్తలు తీసుకుని పోలీసు బందోబస్తుతోనే లగచర్ల వెళ్లామని తెలిపారు. దాడిలో పాల్గొన్న నిందితుల్లో ఎవరినీ పోలీసులు కొట్టలేదని చెప్పారు. నరేందర్ రెడ్డి తన ఫోన్ పాస్వర్డ్ చెప్పడం లేదన్నారు. మరో నిందితుడు సురేశ్ తన సిమ్ కార్డు విరిచి ఏదో వాహనంలో పడేశానని చెబుతున్నాడని తెలిపారు. ఇద్దరూ పోలీసుల విచారణకు సహకరించడం లేదని చెప్పారు. సురేష్‌కు సంబంధించిన కొన్ని ఆడియోలు తమ వద్ద ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు బయటపెడతామని తెలిపారు. దాడికి ముందు రోజు నరేందర్‌రెడ్డి, సురేష్ పథకం వన్నారని, సురేష్ కావాలనే కలెక్టర్ దృష్టిని మరల్చి గ్రామంలోకి తీసుకెళ్లాడని చెప్పారు. సురేష్ మాటలు నమ్మి కలెక్టర్ గ్రామంలోకి వెళ్లారని తెలిపారు. పథకం ప్రకారం సురేశ్, అనుచరులు కలిసి రాళ్ళు, కర్రలతో కలెక్టర్, అధికారులపై దాడి చేశారని పోలీసుల విచారణలో తేలిందని పేర్కొన్నారు. దాడికి వారం ముందే నరేందర్ రెడ్డి ఆయా గ్రామాల్లో తిరిగి దాడి చేయాలని రెచ్చగొట్టారని కూడా పోలీసుల విచారణలో తేలిందన్నారు. దాడికి ముందు రోజు మద్యం ఎక్కడి నుంచి వచ్చింది, కుట్రలో ఎవరెవరు ఉన్నారనేదానిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అక్టోబరు 25న రోటిబండాతండాలో జరిగిన దాడి కన్నా మూడు రెట్లు ఎక్కువగా దాడులు చేస్తామని చెప్పిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. నిందితుడికి బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లిన ఘటనలో జైలు అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు.

బీసీ కులగణనపై బీజేపీ వైఖరేంటి? : కవిత

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీసీల కులగణనపై తమ వైఖరేంటో బీజేపీ స్పష్టం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బీసీలకు ఇచ్చిన హామీలు, కామారెడ్డి డిక్లరేషన్ అమలుపై బీజేపీ ఎందుకు నిలదీయడంలేదని ప్రశ్నించారు. గురువారం కవితను కుమ్మరి సంఘం నేతలు కలిశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ..కాంగ్రెస్ సర్కారు కులవృత్తులను కుదేలు చేస్తోందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ విస్మరిస్తున్నా బీజేపీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రప్రభుత్వం చట్టం తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నేతలు శివశంకర్, నరేశ్, శ్రీనివాస్, రాంబాబు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్థిక ఆర్తిని తీర్చిన మన్మోహనం!

కావాల్సిన వాళ్లు, ప్రేమించిన వాళ్లు, ఆరాధించిన వాళ్లు మరణించినప్పుడు మనసు వికలం అవ్వటం సహజం. వ్యధ చెందటం సహజం. విషాదం వేయిపాయలుగా ప్రవహించటం సహజం. తీర్చలేని లోటు ఏర్పడి కడలిసుడిలా ఉద్వేగం ఉప్పొంగటమూ సహజం. వ్యక్తులే కాదు ఒక ఘననాగరికత కల దేశమూ కొన్ని సందర్భాల్లో అటువంటి విషాద సన్నివేశంలో పడిపోతుంది. పది కాలాలు గుర్తించుకోదగ్గ నాయకుడూ, గర్వించదగ్గ నాయకుడూ, విలువలున్న నాయకుడు మరణిస్తే ఆ సన్నివేశం వద్దన్నా మన హృదయాల్లో గూడుగట్టి మనల్ని విచలితుల్ని చేస్తుంది. ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా, పదేళ్లపాటు దేశ ప్రధానిగా పనిచేసిన మన్మోహన్ మరణంతో ఇప్పుడు భారత్‌కు అదే పరిస్థితి ఎదురైంది. నాయకుడు అన్ని సందర్భాల్లోనూ మహా ధీరోదాత్తుడు అయివుండ నక్కర్లేదు. రాజకీయ రంగాన వీరోచిత పాత్రను పోషించాల్సిన అవసరమూ ఉండనక్కర్లేదు. మహావాకచక్యుడై కౌటిల్యనీతిలో ఘటికుడూ కానక్కర్లేదు. అసాధారణ పరిస్థితుల్లో నమ్రతతో, నవ్యతతో, మర్యాదతో సహజపద్ధతిలో అణగారిన శక్తులను స్వేచ్ఛగా పైకి వచ్చేలా చేయ గలిగితే గొప్ప విషయమే. ఆ నాయకుడు గొప్ప నాయకుడే. భారత ఆర్థికవ్యవస్థలో ఎంతోకాలం అణగిమణగి ఉన్న శక్తులను అలా పైకి వచ్చేలా విధానాల నిచ్చెలను ఏర్పరచటంలో మన్మోహన్ పాత్ర అనితర సాధ్యమైంది. ఆర్థికంగా పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని అప్పటి ప్రధాని పీవీ భావించి ఉండొచ్చు. సంస్కరణలు, మార్పులు అనివార్య మని గట్టిగా అనుకుని ఉండొచ్చు. కాదనలేం! కానీ బండిని దారిన పెట్టాలని అనుకోవటం వేరు. ఆ దారిని ఏ కొలతలతో నిర్మించాలి... ఏ పదార్థాలతో పటిష్ఠం చేయాలి... ఎంత బరువు భరించేలా దాన్ని రూపొందించాలి.. అన్నవాటిని నైపుణ్యం ఉన్నవారే నిగ్గుతేల్చగలరు. మన్మోహన్ మౌనముని అయినా ఆ నైపుణ్యం పుష్కలంగా ఉన్న వ్యక్తి. అందుకే భారత్ ఆర్థిక పరివర్తనను అతితక్కువ వ్యవధిలో అతితక్కువ నష్టాలతో సాధించగలిగారు. ఆర్థికసంస్కరణలపై భిన్నాభిప్రాయాలు ఎన్నైనా ఉండొచ్చు. అన్నివర్గాలకూ అవి సమంగా చేరలేదనీ అనొచ్చు. కానీ అవి దేశ ఆర్థిక సామర్థ్యాన్ని, ప్రజల జీవన ప్రమాణాలను అంతకు ముందు పరిస్థితితో పోల్చితే కొంతైనా ముందుకు నడిపించ లేదనీ అనలేం. ఎన్ని కొలమానాలు పెట్టుకు చూసినా ఇంతకు భిన్నమైన దృశ్యాన్ని ఊహించలేం.

అనుకున్నవి చేయగలిగినవాళ్లు జీవితాల్లోనే అరుదుగా ఉంటారు. రాజకీయాల్లో అదింకా అరుదు. ఆర్థిక సంస్కరణల విషయంలో అనుకున్న వాటిని సాధించలేదన్న అసంతృప్తి మన్మోహన్‌కూ ఉండేది. సొంతపార్టీకి లోక్‌సభలో బలం అరకొరగా ఉన్నపరిస్థితుల్లో, ఆర్థిక సంస్కరణలతో అన్ని అనర్థాలే కలుగుతాయన్న వాతావరణంలో పరిస్థితులను నెట్టుకురావటం అంత సులభం కాదు. సున్నిత మనస్కుడైన మన్మోహన్‌కు అది మరింత కష్టం. అయినా నెగ్గు కొచ్చారు. భారత రాజకీయాల్లో అదొక వింత.

2004లో ప్రధాని పదవిని చేపట్టి పదేళ్ల పాటు కొనసాగినా ఎక్కువ భాగం ఆయనకు ముళ్లపాన్పుగానే ఉండిపోయింది. ప్రధాని పదవికి ఇవ్వాల్సిన గౌరవాన్ని సొంతపార్టీ నేతలే ఇవ్వని పరిస్థితిని బహుశా ఏ ప్రధాని మన్మోహన్‌లా ఎదుర్కోలేదు. అధికార ఉత్తర్వులను ముఖం ముందే చించివేసినా ఎదిరించలేని అశక్తతనే ప్రదర్శించారు. తన ప్రమే యంలేని, తను ఆశించని, తను ఊహించని అవినీతి పరిణామాలు, ఆరోపణలు తనను కారుమేఘాల్లా కమ్ముకున్నప్పుడూ ఆయన ఆక్రో శాన్నీ ఆవేశాన్నీ ఆవేదననూ వ్యక్తంచేయలేని నిస్సహాయుడిగా మిగిలి పోయారు. ఎవరినో లక్షిస్తూ వేసిన బాణాలకు ఆయన బాధితుడిగా ఉండిపోయారు. ఆయన సారథ్యంలో దేశం అవినీతిలో, కుంభకోణాల్లో కూరుకుపోయిందనీ ఆరోపించినవారు కూడా మన్మోహన్‌కు వాటిల్లో ప్రమేయం లేదనీ తెలుసు. రాజకీయాల కోసం ఎంతటి వారినైనా ఏ స్థాయికైనా దిగజార్చగలగటం మన ఘన ప్రజాస్వామ్యం విశిష్ట తేమో!

భారత ప్రధానిగా ఉండే వ్యక్తికి కొన్ని సుగుణాలు ఉండాలని మనం కోరుకుంటాం. మోసం, కపటం, అవినీతి ఉండకూడదనీ ఆశిస్తాం. దయ, కరుణ, సానుభూతితో వ్యవహరించాలని కోరుకుంటాం. మతోన్మత్తత ఏ కణంలోనూ ఉండని గుణసంపన్నుడు కావాలనుకుంటాం. ఇవన్నీ నిండుగా ఉన్న వ్యక్తి మన్మోహన్. రాజకీయాల్లో అరుదైన సందర్భాల్లో అంతే అరుదైన పాత్రను పోషించగలగటం భారత చరిత్ర వింత మలుపులు తిరగగలిన శక్తికి నిదర్శనం!

సేవాదళ్ స్ఫూర్తితో నిర్మాణాత్మక రాజకీయాలు

నన్ను మొదట ఆకట్టుకున్నది వారి గానమే. రాజకీయ సమావేశాలలో పాటలు పాడడం అసాధారణం కదా. గాయకుడు శ్రావ్యంగా పాడుతున్నాడు, మరాఠీ చరణాలను నేను అర్థం చేసుకోలేకపోయినా పాట భావ పూర్ణంగా ఉన్నది. ఆ గాయకుడు సంజీవ్ సానే. అతడొక కార్మిక నాయకుడు, బుద్ధి నైశిత్యమున్న రాజకీయ వ్యూహకర్త. ఆ తరువాత బృందగానం ప్రారంభమయింది. ప్రధాన గాయకుడు సంజయ్ ఎమ్‌జి. వృత్తిరీత్యా ఇంజనీరింగ్ ప్రొఫెసర్. నిమ్నజాతులకు చెందిన యువజనులకు థానేలో ఒక 'సంస్కార్ శిబిర్'ను నిర్వహించిన వివేకశీలి. ఆయన పేరులోని ఎమ్‌జి అన్న అక్షరాలు 'మంగళ గోపాల్'ను సూచిస్తాయి.. మంగళ తల్లి పేరుకాగా గోపాల్ తండ్రిపేరు. తన పేరులో అమ్మానాన్న పేర్లను చేర్చుకున్న సంస్కారి. నిషా శివుర్కార్ ఏ పాటా పాడలేదు. అయితే ఈ విన్రమశీలి భర్తలు వదిలివేసిన, గెంటివేసిన 'పరిత్యక్త' మహిళలను సంఘటితం చేసిన సామాజిక కార్యకర్త. ఇది నాకు ఎంతో సంతోషం కలిగించింది. ఇక దృఢ సంకల్పుడు అయిన విలాస్ భోంగాడె యువ దళిత క్రియాశీలి. తన చేతల ద్వారానే తాను చెప్పదలుచుకునేది చెప్పే ఉద్యమకారుడు.

సరిగ్గా 30 సంవత్సరాల క్రితం థానేలో సమాజ్‌వాది జనపరిషత్ ప్రారంభ సమావేశంలో వీరందరూ నాకు తట స్థించారు. అదే వారితో నా మొదటి పరిచయం. అంతేకాదు శక్త్యుత్సాహాలు పరిపూర్ణంగా ఉన్న మహారాష్ట్ర ప్రజా జీవితంతో కూడా నాకు అదే మొదటి పరిచయం ఆదర్శ వాదం, ప్రగతిశీల భావజాలం, భావచైతన్యం, క్రమశిక్షణ సమ్మిళితమైన ఈ యువ రాజకీయ క్రియాశీలురులో ఏదో ఒక ప్రత్యేకత ఉన్నది, సందేహం లేదు. నాకు సుపరిచితమైన ఉత్తర భారతావని సామాజిక రాజకీయ క్రియాశీల ప్రపం చానికి ఇది పూర్తిగా భిన్నమైనది. వ్యక్తిత్వాలలోను, ప్రతిభా పాటవాల వ్యక్తీకరణలోను విలక్షణులు అయిన ఈ మరాఠీ క్రియాశీలురులో అనేక సామ్యాలు కనిపించాయి. ఏ సంస్థ నుంచి వీరు ప్రభవించారు అని ఆశ్చర్యం కలిగింది. తెలుసు కోవాలన్న ఆసక్తి జనించింది ఎవరో ఒకరు 'సేవాదళ్' అని అన్నారు. అవును వీరంతా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ సంస్థకు చెందినవారే.

రాష్ట్ర సేవాదళ్ (ఆర్ఎస్‌డి లేదా సేవాదళ్)ను 1941లో సోషలిస్టులు స్థాపించారు. అప్పటికివారు ఇంకా భారత జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగా ఉన్నారు. జాతీయవాదం, సామ్యవాదం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, హేతువాదంకు నిబద్ధమైన ఒక యువజన స్వచ్ఛంద సంస్థే రాష్ట్ర సేవాదళ్. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు పోటీగా సేవాదళ్ ఏమీ ఏర్పడలేదు (ఆరెస్సెస్‌కు అప్పట్లో అంతగా రాజకీయ ప్రాధాన్యం లేదని మరి చెప్పనవసరం లేదు). సంఘ్, సేవా దళ్ మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. అయినా రెండిటి మధ్య ఒక సామాన్యాంశం ఉన్నది. రోజూ 'శాఖ' సమావేశాల ద్వారా బాలలు, నవ యవ్వన యువకులను సంఘటితం చేయడం ఈ రెండు సంస్థల ప్రధాన కార్యకలా పంగా ఉండేది. ఈ దైనందిన సమావేశాలలో వారు ఆటలు ఆడేవారు, వ్యాయామం చేసేవారు, సాంస్కృతిక కార్యకలా పాలలో పాల్గొనేవారు, సైద్ధాంతిక చర్చలు జరిపేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆర్ఎస్‌డి కాంగ్రెస్ నుంచి నిష్క్రమించింది. సోషలిస్టు పార్టీలకు, ఏ ఒక్క సోషలిస్టు పార్టీకి అనుబంధ సంస్థ కాకుండా వాటితో సన్నిహితంగా పనిచేసేది. సేవాదళ్ అస్తిత్వ మొదటి దశాబ్దంలో దానికి చైతన్యశీల, స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందించిన



మన గణతంత్ర రాజ్యాన్ని సంరక్షించుకునేందుకు తప్పనిసరి అయిన విశాల దృక్పథంతో కూడిన ప్రయోజనకర రాజకీయాలకు ఒక విశిష్ట నమూనాను రాష్ట్ర సేవాదళ్ సమకూర్చింది. దేశ పౌరులను ప్రగతిశీల రాజకీయ విద్యావంతులుగా చేయడం, యువ తరాల వారిలో రాజ్యాంగ విలువలను పాదుకొల్పడం, సమస్యలపై సృజనాత్మకంగా ఆలోచించడం, వాటి పరిష్కారాలకు కొత్త ఆలోచనలతో ఎజెండాలు రూపొందించుకోవడం, నవ భావాలతో పనిచేసే రాజకీయ కార్యకర్తలు, నాయకులను సుశిక్షణతో తయారుచేసుకోవడం లక్ష్యాలుగా కల రాజకీయాలు ఈనాడు మనకు అవసరం.

ధీమంతుడు, దీక్షాదక్షుడు పాండురంగ సదాశివ్ సానే (1899–1950). సానే గురూజీగా మహారాష్ట్రలో ప్రతి ఒక్కరికీ గౌరవనీయుడు. తొలుత ప్రస్తావించిన థానే సమావేశంలో నేను విన్న పాట –ఖరా తో ఏకచి ధర్మ/ జగాల ప్రేమ్ అర్పావె– సానే గురూజీ విరచితమే. ఆ పాట పాడిన సంజీవ్ సానే పేరు గురూజీ గౌరవార్థం పెట్టిందే.

సానే గురూజీని ఏమనాలి? ఒక సోషలిస్టు నాయకుడు అనవచ్చునా? కేవలం అలా భావించడం ఆయన్ని గౌర వించడం కాబోదని అనుకుంటున్నాను. ఆయన ఒక అజ్ఞాత కార్యకర్త, ఒక నిరుపమాన నిర్మాణదక్షుడు, ఒక నిర్భీక నిరసనకారుడు. ఎటువంటి అన్యాయాన్ని సహించలేని సానే గురూజీ ఒక గాంధేయ వాది, ఒక జాతీయవాది, ఒక సామ్యవాది, అదే సమయంలో ఆయన ఒక ఋషి తుల్యుడు. ఆయన ఉద్రేకపూరిత ప్రసంగాలు, ఉత్తేజకర రచనలు మహారాష్ట్ర యువజన ప్రపంచాన్ని చైతన్యపరిచాయి. ముఖ్యంగా ఆయన తన మాతృమూర్తి గురించి రాసిన 'శ్యాంచీ ఆయీ' మహా రాష్ట్రలో అనేక తరాల వారి మనస్సులపై చెరగని ముద్ర వేసింది. ఆయన 'భారతీయ సంస్కృతి' మన చిరంతన సంస్కృతిపై ఒక కొత్త అవగాహనను కల్పించింది. మూఢ నమ్మకాలు, మత మౌఢ్యాన్ని ఆయన నిర్ద్వంద్వంగా ఖండించే వారు. తెగ, విశ్వాసం, కులం, జెండర్ ప్రాతిపదికన ఎవరి పట్ల వివక్ష చూపని అద్వైత దర్శనం ఆయనకు స్ఫూర్తి. మరో 82 ఇతర సంస్థలతో కలిసి ఆర్ఎస్‌డి, ప్రస్తుత అధ్యక్షుడు నితిన్ వైద్య నేతృత్వంలో ఒక ఏడాది కాలంగా నిర్వహిస్తున్న సానే గురూజీ 125వ జయంత్యుత్సవాలు ఇటీవలే ముగి సాయి. మహారాష్ట్ర ప్రగతిశీల రాజకీయాలలో సేవాదళ్ అడుగు జాడలను గత మూడు దశాబ్దాలుగా నేను గమనిస్తూ వస్తున్నాను. అది అనేక సంస్థలకు స్ఫూర్తిగా నిలిచింది. ఛాత్ర భారతి, సమాజ్‌వాది మహిళా సభ, ముస్లిం సత్యశోధక్ సమాజ్, సమాజ్‌వాది అధ్యాపక్ సభతో పాటు భారతీయ భాషల మధ్య ఒక మేధో అనుబంధాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన అంతర్ భారతి, నిర్మాణాత్మక కార్యకలాపాలకు ఏర్పడ్డ సేవాపథక్, ఎస్ఎమ్ జోషి సోషలిస్ట్ ఫౌండేషన్, సానే గురూజీ మెమోరియల్ ట్రస్ట్ మొదలైనవి సానే గురూజీ స్ఫూర్తిదాయక వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నాయి.

మహారాష్ట్రలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అందరూ రాష్ట్ర సేవాదళ్‌తో సంబంధమున్నవారే కావడం గమనార్హం. రాజకీయ నాయకులు ఎస్ఎమ్ జోషీ, మృణాల్ గోరే, మధు దండావతే, బాపు కల్దాటె; సామాజిక క్రియా శీలురు సుధా వర్దె, ప్రమీలా దండావతే, నరేంద్ర దభోల్కర్, హమీద్ దల్వాయి, బాబా అధావ్, మేధా పాట్కర్; సినీ నాటక రంగాలకు చెందిన శ్రీరామ్ లాగూ, నీలూ ఫూలే, స్మితా పాటిల్; మేధావులు ఆచార్య జావడేకర్, గణేష్ దేవి మొదలైనవారు విశేషంగా ఎన్నదగినవారు.

రాష్ట్ర సేవాదళ్‌కు తన అస్తిత్వ మొదటి రెండు దశాబ్దాలలో ఉన్న శక్తి సామర్థ్యాలు ఇప్పుడు లేవు. అయితే మన రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాన్ని సంరక్షించుకునేందుకు తప్పనిసరి అయిన విశాల దృక్పథంతో కూడిన ప్రయోజనకర రాజకీయాలకు ఒక విశిష్ట నమూనాను ఆ సంస్థ సమకూరు స్తుంది. ఒకటి మాత్రం స్పష్టం: మన గణతంత్రరాజ్య వ్యవస్థ కూల్చివేతకు ప్రస్తుతం జరుగుతున్న ప్రయత్నాలను ఎన్నిక లలో బీజేపీకి గట్టి పోటీ నివ్వడం ద్వారా మాత్రమే ఎదుర్కో లేము, నిరోధించలేము. దేశ పౌరులను ప్రగతిశీల రాజకీయ విద్యావంతులుగా చేయడం, యువ తరాల వారిలో రాజ్యాంగ విలువలను పాదుకొల్పడం, సమస్యలపై సృజనాత్మకంగా ఆలోచించడం, వాటి పరిష్కారాలకు కొత్త ఆలోచనలతో ఎజెండాలు రూపొందించుకోవడం, నవ భావాలతో పని చేసే రాజకీయ కార్యకర్తలు, నాయకులను సుశిక్షణతో తయారు చేసుకోవడం భారత్‌గా ఊహించుకున్న సమాజాన్ని పునః సృష్టించుకోవడం లక్ష్యాలుగా కల విశాల దృక్పథంతో కూడిన ప్రయోజనకర రాజకీయాలు ఈనాడు మనకు అవసరం. అటువంటి రాజకీయ సంస్కృతిని అనాడు రాష్ట్ర సేవాదళ్ సృష్టించి, పెంపొందించింది. ఆ దార్శనికత, కార్యదక్షతే నేడు మనలో లోపించింది. ఈ కొరతను తీర్చుకోవడానికి మనం వెన్వెంటనే పూనుకోకపోతే మన రిపబ్లిక్ భవిష్యత్తుకు తప్పక ముప్పు వాటిల్లు తుంది. రాష్ట్ర సేవాదళ్ పాఠాలు ఏమిటో గ్రహించడం కష్టమేమీ కాదు. వాటిలో మొదటిది– మనం మన యువజనులనే కాకుండా పాఠశాల బాలలనూ లక్ష్యంగా చేసుకోవల్సిన అవసరమున్నది. రెండోది– క్రీడలు, సాహిత్యం, కళల ద్వారా వ్యక్తిత్వ నిర్మాణ కార్యకలా పాలపై దృష్టి పెట్టడం. మూడోది– రాజ్యాంగ విలువలు, సామ్యవాద, లౌకికవాద గణతంత్ర రాజ్య ఆదర్శాలను పెంపొందించే ఏ ప్రయత్నమైనా వాస్తవిక జాతీయ వాదంగా, సుదృఢమైన ప్రాంతీయ సంస్కృతిగా, మన పురా నవ నాగరికతా స్ఫూర్తిగా అంతస్థగితం కావాలి. నాలుగోది– అన్యాయాల వ్యతిరేక పోరాటాలను నిర్మాణాత్మక కార్యాచరణతో కలిసికట్టుగా నిర్వహించాలి. ఐదోది– ఈ ప్రయోజనకర రాజకీయాలు ఎన్నికల వ్యవహారాలు, రాజ్యాధికారాలలో జోక్యం చేసుకుంటూనే ఏ రాజకీయ పార్టీకి అయినా సరే ఆమడ దూరంలో ఉండి తీరాలి.

ఇటువంటి విశిష్ట కృషికి ఆదర్శప్రాయమైన నమూనా ఆర్ఎస్‌డి మాత్రమే కాదు, దేశ వ్యాప్తంగా ఎన్నో సంస్థలు ఉన్నాయి: ద్రవిడ కళగం, కేరళ సాహిత్య శాస్త్ర పరిషత్, కర్ణాటక రాజ్య రైతా సంఘ్, దళిత్ సంఘర్ష్ సమితి (కర్ణా టక), ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్, ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా, ఛాత్ర యువ సంఘర్ష్ వాహిని, ఇండియన్ పీపుల్స్ ఫ్రంట్, జయేష్ (మధ్యప్రదేశ్), సమతా సంఘటన్, బ్యాక్ వర్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్. ఈ ప్రస్తావిత సంస్థల సృజనాత్మక జీవితం స్వల్పకాలికమైనదే అయినప్పటికీ వాటిలో అత్యధికం ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. విశాల దృక్పథంతో కూడిన ప్రయోజనకర రాజకీ యాల వ్యవస్థీకరణ, సుసాధ్యతలను అవి ధ్రువీకరించాయి.

ఈ తరం యువజనులలో రాజకీయ ప్రక్రియల ద్వారా సమాజ జీవితంలో పాలుపంచుకునే శ్రద్ధాసక్తులు లోపించడం పట్ల విచారగ్రస్తులమయినప్పుడు, వారి రాజకీయ ఉదాసీనతను తప్పుపట్టినప్పుడు, వారి సంకుచిత రాజకీయ వైఖరుల పట్ల దిగ్భ్రాంతి చెందినప్పుడు మనకు మనమే ఈ క్రింది ప్రశ్నలు వేసుకోవాలి: యువతలో రాజ్యాంగ విలువల పట్ల నిష్ఠా భావాన్ని పెంపొందించేందుకు దోహదం చేసే సంస్థలను మనం నిర్మించామా? విద్వత్ ఆసక్తులను పెంపొందించే స్టడీ సర్కిల్స్ సంప్రదాయం ఏమయిపోయింది? నిర్మాణాత్మక కార్యకలాపాలకు యువతను ప్రోత్సహిస్తున్నది ఎవరు? నిత్య జీవిత సమస్యలను విశాల రాజకీయ కర్తవ్యా లతో సంధానిస్తుంది ఎవరు? సమస్య వారితో లేదు మనతో ఉన్నది. మనకొక దార్శనిక నమూనా ఉన్నది. దాని స్ఫూర్తితో మనం తక్షణమే కార్యాచరణకు పూనుకోవాలి. ఇంతెంత మాత్రం జాప్యం కూడదు. ఇది మనకు ఒక సవాల్. మనం నిర్దేశించుకోవలసిన జీవిత లక్ష్యం. మన కాలం సానే గురూజీల కోసం అవి నిరీక్షిస్తున్నాయి.



■ యోగేంద్ర యాదవ్

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

అంబేడ్కర్‌పై కాంగ్రెస్ కపట ప్రేమ

ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడిన మాటల్లో 16 సెకండ్ల వీడియోను కట్ చేసి, దురుద్దేశంతో రాహుల్‌గాంధీ డైరెక్షన్‌లో కాంగ్రెస్ శ్రేణులు శివాలెత్తుతున్నాయి. రాజ్యసభలో అమిత్ షా ఒక గంట 32 నిమిషాలు చేసిన ప్రసంగంలో మూడు నిమిషాల 36 సెకండ్లు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ గురించి మాట్లాడారు. అందులోంచి 16 సెకండ్ల వీడియోను బయటికి తీసి చిలువలు పలువలు చేసి అమిత్‌ను, బీజేపీని బోనులో నిలబెట్టే ప్రయత్నం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు కుటిల యత్నం చేస్తున్నాయి. నెహ్రూ కాలం నుంచి రాహుల్‌గాంధీ వరకు అంబేడ్కర్‌తో పాటు ఎందరో దేశభక్తుల త్యాగాలను వాడుకొని గద్దెనెక్కడం తప్ప కాంగ్రెస్ పార్టీకి ఇంకేమీ తెలియదు. ఆ పార్టీ అన్యాయం చేసిన వాళ్లలో సుభాష్ చంద్రబోస్, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, అంబేడ్కర్, సర్దార్ వల్లభభాయ్ పటేల్, బాబూ రాజేంద్రప్రసాద్ వంటి ఎందరో గొప్ప వ్యక్తులు ఉన్నారు.

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏనాడూ అంబేడ్కర్‌ను సహించలేదు. దళితుల పక్షాన మొదటి న్యాయశాఖ మంత్రిగా అంబేడ్కర్‌ను నియమించినా, ఆయనకు సరైన గౌరవం ఇవ్వలేదు. సి. రాజగోపాలాచారి, అంబేడ్కర్ రాజీనామా చేస్తున్నారని నెహ్రూకి తెలిసినపుడు.. రాజాజీ పోవడం వల్ల నాకు కొంత నష్టం కానీ, అంబేడ్కర్ వల్ల ఏ లాభం లేదు, పోతే పోనీ అన్నారు. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి చెందిన మీర్జా అజ్మీర్ బేగ్ తన పరిశోధనలో బయటపెట్టిన అంశం ఏమిటంటే– నెహ్రూ మనస్తత్వం వంటపట్టిన కాంగ్రెస్‌వాదులకు అంబేడ్కర్‌ను రాజ్యాంగ సభ సభ్యుడుగా చేయడం కూడా ఇష్టం లేదు. "296 మంది రాజ్యాంగ సభ సభ్యుల్లో కూడా మొదట అంబేడ్కర్ ఉండాలని నెహ్రూ వర్గం కోరుకోలేదు" అని బేగ్ తన రచనల్లో తేల్చి చెప్పాడు. గాంధీని అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా ప్రమోట్ చేసేవారు, గాంధీజీ మరణించిన ఆరు సంవత్సరాల తర్వాత బాబాసాహెబ్ రాజ్యసభలో మాట్లాడుతూ గాంధీజీ గురించి వ్యక్తం చేసిన భావాలను తెలుసుకోవాలి. దళితుల పేరిట రూ.20 కోట్ల స్కీమును ప్రారంభించి, దానికి గాంధీజీ పేరు పెట్టాలని బాబాసాహెబ్ కోరుకున్నాడు. అంటరానితనం పట్ల నెహ్రూ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకో వాలని, 370 ఆర్టికల్ భారత సార్వభౌమ త్వాన్ని ప్రశ్నిస్తుందని ఆనాడే అంబేడ్కర్ చెప్పాడు. కానీ ఏనాడూ అంబేడ్కర్ మాటను నెహ్రూ, ఆయన నడిపే కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదు, పైగా ఘోర అవమానం చేశారు.



నేటి ఆధునిక యుగంలో ఎవరు ఎటువంటి అబద్ధాలకు, దుష్ప్రచారాలకు పాల్పడినా, వాటిని ఇట్టే బయటపెట్టేస్తోంది సోషల్ మీడియా. అందుకే ఈ యుగంలో కాంగ్రెస్ ఆటలు సాగవని ఆ పార్టీ పెద్దలు గుర్తించాలి.

పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో మహాత్మాగాంధీ, మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఫోటోలను పెట్టారు. కానీ అంబేడ్కర్ ఫోటోను పెట్టడానికి ఆ పార్టీకి మనస్కరించలేదు. భారతీయ జనతా పార్టీ మద్దతుతో ఏర్పడిన వీపీ సింగ్ ప్రభుత్వం అంబేడ్కర్ ఫోటోను ఆవిష్కరించింది. బతికుండగానే 'భారతరత్న' పురస్కారాలను ప్రకటించుకున్న నెహ్రూ, ఇందిరలు.. బాబాసాహెబ్ చనిపోయిన తరువాత కూడా 'భారతరత్న' ప్రకటించడానికి ఇష్టపడ లేదు. కాంగ్రెసేతర ప్రభుత్వం బాబాసాహెబ్‌కు భారతరత్న ప్రదానం చేసింది. ఎప్పుడూ బాబాసాహెబ్‌ను కాంగ్రెస్ పార్టీ భారత సమాజం నుంచి దూరం పెట్టాలనే ప్రయత్నమే చేసిందని 'పటేల్ ఏ లైఫ్' అన్న పుస్తకంలో రాజమోహన్ గాంధీ స్పష్టంగా తెలిపారు.

భారత రాజ్యాంగ రచనలో కీలక పాత్ర పోషించిన అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ కలిసి ఎన్నికల్లో ఘోర పరాజయం పాలయ్యేటట్లు చేశారు. 'ఇండియా ఆఫ్టర్ గాంధీ' అన్న పుస్తకంలో ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ 112వ పేజీలో ఈ విషయాలన్నీ వివరించాడు. బాబాసాహెబ్ మొదటిసారి ముస్లిం లీగ్ తరఫున సంయుక్త బెంగాల్‌లో నిలబడితే 1.5 లక్షల ఓట్ల తేడాతో కాంగ్రెస్ ఓడించింది. రెండోసారి 1954లో మహారాష్ట్రలోని బండారా ఉప ఎన్నికలో బాబాసాహెబ్ పోటీకి దిగితే, అంబేడ్కర్ అనుచరుడైన నారాయణ్ కాజ్రోల్‌కర్‌ను ఆయనపై పోటీకి నిలబెట్టి కమ్యూనిస్టు పార్టీ మద్దతుతో 17,153 ఓట్ల తేడాతో ఘోరంగా ఓడించారు. ఇంతా ఘోరమైన విషయం ఏమిటంటే 1970లో ఇందిరాగాంధీ ప్రభుత్వం కాజ్రోల్‌కర్‌కు పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేసింది. అప్పటివరకు డాక్టర్ బాబాసాహెబ్‌కు ఒక్క అవార్డు కూడా ఇవ్వలేదు.

బాబాసాహెబ్ పట్ల ఇన్ని దురాగతాలకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ, ఈ రోజు రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తోంది. ఆఖరికి బహుజన నాయకుడైన సీతారామ్ కేసరిని పార్టీ అధ్యక్షునిగా నియమించి, చివరికి ఆయనను బాత్రూంలో బంధించి సోనియా గాంధీ పార్టీని స్వాధీనం చేసుకున్నది. దళిత నాయకుడైన బాబు జగ్జీవన్‌రామ్‌ను కాంగ్రెస్ పార్టీ, ఇందిరాగాంధీ అనేక అవమానాలకు గురి చేశారు. సిక్కుల్లో దళిత వర్గానికి చెందిన మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు.. రాజ్యాంగం ప్రకారం ఆమోదితమైన ఒక చట్టపు కాగితాన్ని ఆయన చేతిలో నుంచి లాక్కొని, ఏ పదవిలో లేని రాహుల్‌గాంధీ మీడియా ముందే చించేశాడు. అటువంటి రాహుల్‌కు రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత ఉందా?

బతికున్నప్పుడు అంబేడ్కర్‌ను వేధించిన కాంగ్రెస్, ఇప్పుడూ అదే మార్గంలో నడుస్తోంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగం మార్చేస్తారంటూ రాహుల్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ, భారతీయ జనతా పార్టీపై దుష్ప్రచారం చేసింది. రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాలను తన స్వార్థ రాజకీయాల కోసం నిర్దాక్షిణ్యంగా కూలగొట్టిన కాంగ్రెస్ పార్టీని, దేశానికి ఎమర్జెన్సీ విధించి, చీకటి రోజులు తెచ్చిన ఇందిరాగాంధీని ఈ దేశం మరవలేదు. కానీ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువల్ని దుర్మార్గంగా తుంగలో తొక్కి, ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసిన కాంగ్రెస్, ఇప్పుడు రోజూ రాజ్యాంగం గురించి, అంబేడ్కర్ గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా ఉంది. 2000 సంవత్సరానికి ముందు విస్తృత స్థాయిలో మీడియా లేదు. అప్పుడు ప్రభుత్వాలు చెప్పిందే ప్రజలు నమ్మాల్సిన పరిస్థితి. నేడు ఆధునిక యుగం. ఎవరు ఎటువంటి అబద్ధాలకు, దుష్ప్రచారాలకు పాల్పడినా, వాటిని ఇట్టే బయటపెట్టేస్తోంది సోషల్ మీడియా. అందుకే ఈ యుగంలో కాంగ్రెస్ ఆటలు సాగవని, ఆ పార్టీ పెద్దలు గుర్తించాలి.



● ఎం. రఘునందన్‌రావు

పార్లమెంటు సభ్యులు, మెదక్

విప్లవకారుల ఐక్యతే లక్ష్యంగా...

ఏప్రిల్ 22, 1969లో భారత విప్లవ అరుణతార సీపీఐ (ఎం-ఎల్) ఆవిర్భవించింది. భారత విప్లవోద్యమం ప్రారంభం నుంచి రెండు పాయలుగా విభజనకు గురైంది. మొదటి పాయకు చారు మజుందార్, సత్యనారాయణ సింగ్ నాయకత్వం వహిస్తే, రెండవ పాయకు దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి నాయకత్వం వహించారు. ఈ రెండు పాయలు అనేక విభజనలకు గురయ్యాయి. కొన్ని తెరమరుగయ్యాయి. మరికొన్ని ఉనికి కాపాడుకునే స్థితిలో ఉన్నాయి. రెండు పాయల్లోని సత్య నారాయణ సింగ్, చంద్ర పుల్లారెడ్డి 1975లో ఒకే పార్టీగా ఏర్పడ్డారు. దీని కొనసాగింపే నేటి సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ. ఈ పార్టీలో కూడా వివిధ కాలాల్లో, వివిధ ప్రాంతాల్లో, వివిధ సెక్షన్లు చీలికలను సృష్టించాయి. ఈ చీలికలు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీని ప్రభావితం చేయలేకపోయాయి. సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ 14 రాష్ట్రాలకు విస్తరించి విప్లవో ద్యమాన్ని కొనసాగిస్తున్నది. ప్రజలను చైతన్యపరుస్తూ ప్రజాయుద్ధ పంథాకి చేరువ కావాలని ప్రకటించుకున్నది. మార్క్సిజం– లెనినిజం– మావో ఆలోచనా విధానం సిద్ధాంత ప్రాతిపదికగా, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించాలని, దృఢ సంకల్పంతో సమరశీల పోరాటాలను అభివృద్ధిపరుస్తోంది.

నేడు ఆర్ఎస్ఎస్ అండతో బీజేపీ ప్రభుత్వం– ప్రజలను చీల్చే చర్యలకు, ఈతిబాధలకు గురిచేస్తున్నది. వారి హక్కులపై అణచి వేతను కొనసాగిస్తోంది. కార్పొరేట్లకు చేయూతనిస్తూ, దేశంలో ఫాసిస్టు విధానాలను నెలకొల్పుతున్నది. ఈ చర్యలకు వ్యతిరేకంగా అన్ని శక్తులు సంఘటితమై పోరాడాలి. చీలికలను నివారించి, ఐక్యతను సాధించాలి. దీనిలో భాగంగానే దేశంలో పలు విప్లవ సంస్థలతో సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ చర్చిస్తున్నది. ఐక్యతకు వీలుకాని విప్లవ సంస్థలతో ఐక్య సంఘటన, ఐక్య కార్యాచరణను కొనసాగిస్తున్నది. ఇందులో భాగంగా సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పేరిట కొనసాగుతున్న రెండు విప్లవ పార్టీలు, చర్చల అనంతరం 2024 ఏప్రిల్‌లో జరిగిన సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ మహాసభల డాక్యుమెంట్ల ప్రాతిపదికగా విలీన మవుతున్నాయి. రేపు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే సభలో ఈ రెండు పార్టీలు ఒకే పార్టీగా ఆవిర్భవిస్తున్నాయి.

– పి. సూర్యం

తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ

కులగణన దుష్ప్రచారాలూ, అసలు నిజాలు!

గత 77 ఏండ్ల స్వతంత్ర భారతావనిలో ఎవరు లబ్ధి పొందారు, బడుగు బలహీన వర్గాల బతుకులు ఎంతవరకు బాగు పడ్డాయి అనే విషయం కుల గణన ద్వారా తేటతెల్లమవుతుంది. దాన్నిబట్టి తగు ప్రణాళికలను రచించి వేల ఏళ్ళుగా అన్ని రంగాల్లోనూ అణగదొక్కబడిన బలహీనవర్గాలకు సామాజిక న్యాయం అందించడం సాధ్యమవుతుంది. ఈ లక్ష్యంతోనే ఓబీసీ సంఘాలు, కుల గణన మద్దతు రాజకీయ పార్టీలు పోరాటం చేస్తున్నారు. ఈ దేశ పాలనలో మెజారిటీ ప్రజల భాగస్వామ్యం లేనిదే ఇది ప్రజాస్వామ్య దేశం అనిపించుకోదు.

కాని కొందరు కుల గణన వ్యతిరేకులు అనేక దుష్ప్రచారాలు కొనసాగిస్తూ కుల గణనకు అడ్డుపడాలని చూస్తున్నారు. ఒక కుక్కను చంపాలంటే ఆ కుక్కపై 'పిచ్చి కుక్క' అన్న ముద్ర వేయాలి అని సామెత. కొందరు ఈ పద్ధతిలోనే తమ దుష్ప్రచా రాన్ని కొనసాగిస్తున్నారు. ఆ దుష్ప్రచారాలను ఖండించేందుకు కొన్ని వివరణలు అవసరమని బీసీ ఇంటెలెక్చువల్ ఫోరమ్ భావిస్తున్నది.

కులగణన కష్టమైనది, పరిపాలన దృష్ట్యా సాధ్యం కానిది అన్న ప్రచారంతో పాటు, ఇదే వాదనతో సుప్రీంకోర్టులో మహారాష్ట్ర vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ 841/2021 దాఖలు చేసింది. కుల గణన కష్టమైనది కాదు, క్లిష్టమైనది అంతకంటే కాదు. ఎలాంటి సమాచార సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్స్ రవాణా సౌకర్యాలు లేని కాలంలో నిరుపేద, నిరక్షర, బానిస భారతదేశంలో బ్రిటిష్‌వారు, మన రాష్ట్రంలో నిజాంవారు, 1881 నుంచి 1931 వరకు అన్ని కులాల గణన ప్రతి పదేళ్ళకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కలలో భాగంగా సేకరించారు. అది ఇంత సాంకేతికంగా అభివృద్ధి చెందిన ఈ కాలంలో కష్టం అవుతుందా? ఈ వాదన సరైంది కాదు. ఇప్పటికే సెన్సస్‌లో ఎస్సీ ఎస్టీ కులాల వివరాలు సేకరిస్తున్నారు. అందులో ఓబీసీ కేటగిరీ కాలమ్ చేర్చితే సరిపోతుంది. అదేవిధంగా సరి ఐన శిక్షణ ఇచ్చి, తగు ఫార్మాట్‌లు అభివృద్ధి చేస్తే ఈ దేశంలోని సుమారు 6000 ఓబీసీ కులాల లెక్కలు సేకరించడం అసాధ్యమేం కాదు.

కులగణన హిందూ సమాజాన్ని విభజిస్తుంది, కులతత్వం పెంచుతుంది అన్న ప్రచారంలోనూ వాస్తవం లేదు. భారతీయ సమాజం, ముఖ్యంగా హిందూ సమాజం, గత మూడు వేల సంవత్సరాలుగా కులాల పేరుతో, వర్గాల పేరుతో విడిపోయే ఉన్నది. కొత్తగా విడిపోయేది ఏమీ లేదు. ఈ వర్ణాలూ కులాలూ అగ్రవర్ణాలు తమ ఆధిపత్యం కొరకు సృష్టించినవే, శూద్రులనూ అతిశూద్రులనూ అణచివేయడానికి ఏర్పాటు చేయబడినవే. కావున ఈ వాదనలో పసలేదు.

ఓబీసీలు ఒక రాష్ట్రంలో బీసీలుగానూ, మరొక రాష్ట్రంలో ఎస్సీలుగానూ లేదా ఎస్టీలుగానూ ఉన్నారు కాబట్టి ఈ సంక్లిష్టతపై ముందు అధ్యయనం చేయాలని కొందరు అంటున్నారు. జన గణన (సెన్సస్)లో 1234 ఎస్సీ 698 ఎస్టీ కులాల లెక్కలు సేకరిస్తారు. మన రాష్ట్రంలో లంబాడాలు ఎస్టీలు, కానీ పక్కన మహారాష్ట్రలో ఓబీసీలు; మన రాష్ట్రంలో రజకులు ఓబీసీలు, కానీ బిహార్‌లో ఎస్సీలు; మహేంద్ర (మేదరి) కులంవారు తెలంగాణలో బీసీలు, కర్ణాటకలో ఎస్టీలు, మహారాష్ట్రలో ఎస్టీలు. మరి ఇలా ఉన్నా సరే ఎస్సీ ఎస్టీల లెక్కలు సేకరించడం లేదా?

కుల గణన వలన రిజర్వేషన్ల డిమాండ్ పెరుగుతుంది అన్నది మరికొందరి వాదన. ఈ దేశంలో ఎస్సీలకు, ఎస్టీలకు వారి జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగాలు, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు ఉన్నాయి. అగ్రకులాలు 15 శాతం ఉండగా, అందులో 5 శాతం కూడా లేని అగ్రకుల పేదలకు ఈడబ్ల్యూఎస్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుకున్నదే తడవుగా జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు, ఆర్టికల్ 370 రద్దు, అడగకుండానే అగ్రవర్ణాలకు 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు, మహిళలకు 33శాతం రిజర్వేషన్లు, జమిలి ఎన్నికల బిల్లు తీసుకువచ్చారు. కానీ వారికి కులగణన చేయడానికి మనసు లేక రకరకాల సాకులు చెబుతున్నారు.



పేరిట విద్యా ఉద్యోగాలలో 10శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఈ దేశ మూలవాసులైన ఓబీసీలు 60శాతం ఉంటే వారికి 27శాతం కేవలం విద్య ఉద్యోగాలలో ఇచ్చారు. అది కూడా ఇప్పటి వరకు పూర్తిగా అమలుకు నోచుకోవడం లేదు. చట్టసభలలో ఎలాంటి రిజర్వేషన్లు లేవు. స్థానిక సంస్థలలో 50శాతం సీలింగ్‌కు లోబడి ఎస్సీ ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం ఇచ్చి మిగిలితే బీసీలకు ఇవ్వాలి.

రిజర్వేషన్ల వలన మెరిట్‌కు అన్యాయం జరుగుతున్నదన్న వాదనకు వస్తే– మెరిట్ అనేది సాపేక్షిక అంశం. అనాదిగా అగ్ర వర్ణాలు వర్ణ వ్యవస్థలో రిజర్వేషన్లు అనుభవించలేదా? బ్రాహ్మణులు పౌరోహిత్యం, వేద పురాణాలు పఠించడం, గురువుల పాత్ర వహించడం చేయలేదా? క్షత్రియులు రాజరికం, వైశ్యులు వ్యాపారం చేయగా, శూద్రులు కేవలం వారికి సేవలు చేసే బానిస వర్ణాలుగా మార్చబడలేదా? విద్యలు నేర్చిన శూద్రులకు ఎలాంటి గతి పట్టించారో తెలియడానికి పురాణాలలోని ఏకలవ్యుడు, శంభూకుని కథలు మనకు కనిపించవా! ప్రైవేటు కార్పొరేట్ పాఠ శాలల్లో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో లక్షలు ఖర్చుపెట్టి ఇంగ్లీష్ మీడియంలో చదివినవారికీ, అరకొర వసతులు గల ప్రభుత్వ పాఠశాలల్లో మాతృభాషలో చదివినవారికీ మధ్య పోటీ ఎంత వరకు సమంజసం? ఇలాంటి ప్రశ్నలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. భారతదేశంలో గత 77ఏళ్ల నుంచి రిజర్వేషన్లు అమలు అవు తున్నాయి. మరి మన దేశం అభివృద్ధి పథంలో పయనించడం లేదా? రిజర్వేషన్లు శాస్త్ర, న్యాయ, ఉన్నత వైద్య, టీచింగ్ రంగా లలో ఎక్కడున్నవి? ప్రైవేటు రంగంలో ఎక్కడ ఉన్నవి? కేవలం కొన్ని విద్యా, ప్రభుత్వ ఉద్యోగ, రాజకీయ రంగాలలో కల్పిస్తేనే ప్రతిభ (మెరిట్) దెబ్బతింటుందా? మరి మీ ఈడబ్ల్యూఎస్ మెరిట్ ఏమిటి? బీసీల కంటే తక్కువ లేదా? తమిళనాడులో విద్య ఉద్యోగాలలో ఓబీసీలకు 50శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. మరి అక్కడ ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ కుప్పకూలిందా? తమిళనాడు మిగతా రాష్ట్రాల కంటే అన్ని రంగాలలో ముందు లేదా?

ఈ దేశంలో కుల వ్యవస్థ రూపుమాయాలంటే, హిందువు లందరూ ఏకం కావాలంటే, అనాదిగా అణగదొక్కబడిన ఓబీసీ (శూద్ర) వర్గాలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించి వారిని ఉన్నత వర్గాలతో సమానంగా అభివృద్ధి చెందేలాగా అవకాశాలు కల్పించినప్పుడే అది సాధ్యమవుతుంది, కులరహిత సమాజం ఏర్పాటు సుగమమవుతుంది, రాజ్యాంగం ఆశించిన సామాజిక న్యాయం అందరికీ అందుతుంది, రాజ్యాంగ నిర్మాతల కలలు నెరవేరుతాయి.

కులం అనేది విదేశీయుల కుట్ర అన్న వాదన ఒకటి ప్రస్తుతం పైకి వస్తున్నది. ఇది కూడా శుద్ధ అబద్ధం. ఋగ్వేద కాలం నుండి ఈ దేశంలో వర్ణ వ్యవస్థ ఉన్నది. ఋగ్వేదంలోని పురుష సూక్తంలో ప్రజాపతి శిరస్సు నుంచి బ్రాహ్మణులు, బాహువుల నుంచి క్షత్రియులు, ఊరువుల నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు జన్మించినట్లు శ్లోకం లేదా? మనుస్మృతిలో శూద్రులను ఏ విధంగా అణగదొక్కాలో వివరించబడలేదా? ఈ దేశంలో గత వేల సంవత్సరాల నుంచి ఉన్న ఈ వర్ణ వ్యవస్థకు వృత్తులు తోడై కుల వ్యవస్థ ఏర్పడి ఉండవచ్చును. కేస్ట్ అనే పదం పోర్చుగీస్ పదం కావొచ్చు, కానీ ఇది ఉత్తర భారతదేశంలోని జాతి పదానికి సమానంగా వాడటం జరిగింది. తెలుగులో ఇదే కులంగా పిలవ బడింది. ఈ దేశం పరాధీనంలో బతకడానికి, శూద్రులను అతి శూద్రులను క్రూరంగా అణచివేయడానికి, ఈ వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ, మనుస్మృతులే కారణం.

కుల గణన డిమాండ్ విదేశీ శక్తుల కుట్ర అని కూడా ఒక దుష్ప్రచారం జరుగుతున్నది. భారతదేశం ప్రగతిని చూసి ఓర్వలేక విదేశీ శక్తులు ఈ దేశ సంస్కృతిని, సమైక్యతను, సమగ్రతను దెబ్బతీయడానికి పన్నిన పన్నాగమే కులగణన అనే ఈ ప్రచారం శుద్ధ అబద్ధం. ఇదే నిజమైతే బీజేపీ 2010 పార్లమెంట్‌లో 2011 సెన్సెస్‌లో కులగణన చేయాలని డిమాండ్ చేసి పార్లమెంటులో తీర్మానం ఆమోదానికి అనుకూలంగా ఓటు వేయలేదా? ఆగస్టు 31, 2018న పార్లమెంటులో ఆనాటి హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 2021 సెన్సెస్‌లో కులగణన చేస్తామని ప్రకటించలేదా? వారు విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యే ఈ ప్రకటన చేశారా?

పై దుష్ప్రచారాలు, అవాస్తవాలూ, వితండవాదనలూ అన్నీ కులగణనను అణగదొక్కేందుకు కుట్రలే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుకున్నదే తడవుగా జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు, ఆర్టికల్ 370 రద్దు, అడగకుండానే అగ్రవర్ణాలకు 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు, మహిళలకు 33శాతం రిజర్వేషన్లు, జమిలి ఎన్నికల బిల్లు తీసుకువచ్చారు. కానీ వారికి కులగణన చేయడానికి మనస్సు లేక రకరకాల సాకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలి. 60 శాతం జనాభా ఉన్న ఓబీసీ ప్రజలకు ఈ దేశ పాలన వ్యవస్థలో భాగస్వామ్యం లేనప్పుడు ఈ ప్రజాస్వామ్య దేశం కాబోదని గుర్తెరగాలి. అంతా ఏకమై సమగ్ర కులగణనకు నినదించాలి.

■ టి. చిరంజీవులు

కన్వీనర్, బీసీ ఇంటెలెక్చువల్ ఫోరమ్ హైదరాబాద్

పచ్చని సంసారంలో మద్యం చిచ్చు

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య
అనాథలుగా మిగిలిన ఇద్దరు చిన్నారులు
వరంగల్ లక్ష్మీపురంలో విషాదం

వివరాలు 6లో



కేయూ విద్యార్థులందరికీ హాస్టల్ వసతి

గతంలోలా రెగ్యులర్, ఎస్ఎఫ్‌సీ కోర్సులనే తేడాల్లేవు

- అదనంగా రెండు హాస్టల్స్, మెస్‌లు ఏర్పాటు
- నిధుల కేటాయింపు.. నిర్మాణాలకు సన్నద్ధం
- ఈ సంక్రాంతికి విద్యార్థులకు అందుబాటులోకి
- వర్సిటీ క్యాంపస్ విద్యార్థుల హర్షాతిరేకాలు

7



ఏకశిల పార్కు వద్ద కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మెలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

కేసీఆర్‌పై కోపంతోనే కాంగ్రెస్‌ను గెలిపించారు

- మాజీ ఎంపీ సీతారాం నాయక్
- సమగ్ర శిక్ష కాంటాక్టు ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం

హనుమకొండ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌పై కోపంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని, అయితే కాంగ్రెస్ పార్టీ సమర్థవంతమైన పాలన అందించడం లేదని మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్కు వద్ద సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె 21వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ సీతారాంనాయక్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను ఎందుకు రెగ్యులర్ చేయలేదని హరీశ్‌రావును ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షా శిబిరాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు సంఘీభావానికి వస్తే వారిని అడ్డుకోవాలని సీతారాంనాయక్ కాంట్రాక్టు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే సినిమా హీరోల గురించి మాట్లాడుతూ సమయాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాంట్రాక్టు ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్ఐల బదిలీ



ఎస్సై మాధవ్

వరంగల్ క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఉత్తర్వులను జారీచేశారు. ఎస్‌బీలో విధులు నిర్వర్తిస్తున్న బి.మాధవ్‌తోపాటు ఏనుమాముల పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న పి.శ్రీకాంత్‌ను హనుమకొండ పోలీస్ డివిజన్‌లోని కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



సవాళ్లు.. వివాదాలు!

ఉమ్మడి జిల్లాలో మిశ్రమ రాజకీయాలను మిగిల్చిన 2024

2024 కాలచక్రం

అధికారం కోల్పోయి.. గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న 'గులాబీ' పార్టీ

- బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పిన కడియం, అరూరి, అజ్మీరా, సుధారాణి, సారయ్య, మార్నేని
- కండువా మార్చిన అరూరి, సీతారాంనాయక్‌కు కలిసిరాని కాలం
- కాషాయం టికెట్‌పై ఎంపీగా పోటీ చేసి ఓడిన బీఆర్ఎస్ మాజీ నేతలు
- పార్టీ మారి.. తొలి ప్రయత్నంలోనే ఎంపీగా నెగ్గిన కడియం కావ్య
- చర్చనీయాంశమైన తాటికొండ యూటర్న్..
- కోపంతో కారు దిగి.. దారిలేక మళ్లీ కారెక్కిన రాజయ్య
- ఎర్రబెల్లిని టెన్షన్ పెట్టిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం
- కాంగ్రెస్‌లో అసంతృప్తి.. పలు వివాదాల్లో కొండా దంపతులు

7

2024.. ఎన్నో రాజకీయ మార్పులు.. వివాదాలు.. సవాళ్లకు వేదికగా నిలిచింది. కొందరు నేతలకు కలిసొస్తే మరికొందరికి చేదు అనుభవాలను మిగిల్చింది. పలువురు కీలక నేతలు అప్పటి వరకు తాము వేసుకున్న పార్టీ కండువాలను మార్చారు. కారు దిగి కాషాయ గూటికి కొందరు చేరితే.. ఇంకొందరు 'స్నేహ'హస్తం' అందుకున్నారు. కమలం గూటికి చేరిన అరూరి, సీతారాంనాయక్‌కు చేదు మిగిలితే.. కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన కడియం కావ్య 'విజయ'లక్ష్యాన్ని చేరుకున్నారు. తద్వారా పార్టీ మారి కడియం శ్రీహరి తన ఇమేజ్‌ను నిలబెట్టుకున్నారు. ఇక ఓరుగల్లులో కాంగ్రెస్‌లో నెలకొన్న అసమ్మతి మంత్రి కొండా సురేఖను టెన్షన్ పెట్టగా.. సినీ హీరోపై ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాలను కుదిపేశాయి. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసు మాజీ మంత్రి ఎర్రబెల్లిని ఆందోళనకు గురి చేస్తే.. మరోనేత రాజయ్య తొలుత గులాబీ పార్టీకి రాజీనామా చేసి.. పరిస్థితులు అనుకూలించక.. మళ్లీ అదే పార్టీలో చేరారు. ముఖ్యంగా ఏడాది కాలంగా గడ్డుపరిస్థితులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకులు ఓరుగల్లు గడ్డపై పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు శాయశక్తులా కృషిచేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు తమ ముందున్న అభివృద్ధి సవాళ్లను స్వీకరిస్తూ ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా చూసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

మావోయిస్టులు, కమ్యూనిస్టులు ఏకం కావాలి

- అప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుంది..
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



ముల్కనూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

భీమదేవరపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు, కమ్యూనిస్టులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. పార్టీ వందో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో సీపీఐ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. శ్రీలంక లాంటి దేశాల్లో కమ్యూనిస్టులందరూ ఏకమైతేనే రాజ్యాధికారం వస్తుందన్నారు. అలాగే కమ్యూనిస్టులు దేశంలో ఏకమైతే రాజ్యాధికారం సిద్ధిస్తుందన్నారు. దున్నేవాడికే భూమి, పరిశ్రమలు, బ్యాంకు రంగాలు ప్రభుత్వ రంగాల్లో ఉండాలని కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారన్నారు. పేదవాడి రాజ్యం కోసం కలిసి పోరాడుదామన్నారు. కార్పొరేట్ వ్యవస్థకే కేంద్రం ప్రభుత్వం పనిచేసోందన్నారు. సమసమాజ నిర్మాణం, ప్రజల హక్కుల కోసం పోరాటాలు, ఉద్యమాలు, బలి దానాలు చేసిన పార్టీ సీపీఐ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, నాయకులు జుర్రు సంపత్, ఆదరి రమేష్, కొంగల రామచంద్రారెడ్డి, మార్పు సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, బోడ బాలరాజు, తిరుపతి, ఉప్పలయ్య, స్వరూప, రంజిత్, శ్రీను, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- 56వ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జవహర్ కాలనీలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వడ్డెపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని జవహర్‌కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద రూ.3కోట్ల 35 లక్షలతో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించే సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమి పూజ చేశారు. అదే విధంగా రూ.2 కోట్ల 20 లక్షలతో నిర్మించిన జవహర్ కాలనీ నూతన బ్రిడ్జిని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరైనా డబ్బులు అడిగితే వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, కుడా మాజీ డైరెక్టర్ బూక్య శంకర్, జవహర్ కాలనీ, విష్ణుపురి కాలనీల అధ్యక్షులు భైరి సోమయ్య, అయిలు నారాయణగౌడ్, కాంగ్రెస్ శ్రేణులు చింత రమేష్‌గౌడ్, కందుకూరి పూర్ణచందర్, సయ్యద్ ఉమర్ పాషా, రుద్రోజు మణీంద్రనాథ్, బూక్య విజయ్, చెరుకు శ్రీనివాస్, కొత్తపల్లి అమర్‌నాథ్, పల్లకొండ సరోజన, దూలం పెద్ద రాజు గౌడ్, బూక్య రవి తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్ సర్కారు

- బీఆర్ఎస్ మంజూరు చేసిన పనులపై నిర్లక్ష్యం
- నెక్కొండ మండలంలో కుంటుపడిన అభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజం

నెక్కొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ యేడాది పాలనలో అభివృద్ధి నిధుల మాట దేవుడెరుగు.. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.కోట్ల నిధులు మురిగిపోతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నెక్కొండలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతమైన నెక్కొండ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఐబీ, ఇరిగేషన్ తదితర శాఖల నుంచి కోట్ల రూపాయల నిధులు విడుదల చేశారన్నారు. అయితే కరోనా వల్ల అభివృద్ధిలో జాప్యం జరిగిందన్నారు. మండలంలోని చిన్న కొర్పోలు - పెద్ద కొర్పోలు వట్టివాగుపై వంతెన, ఐంటికన్ని మీదగా అలంకానిపేట వరకు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.18 కోట్లు మంజూరు చేయడమే కాకుండా టెండర్లు కూడా పిలిచామన్నారు. అలాగే నాగారం వట్టి వాగుపై వంతెన నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేయగా, నేటికీ నిర్మాణ పనులను ప్రారంభించిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా కోట్లాది రూపాయల పనులను సకాలంలో ప్రారంభించకపోవడంతో నిధులు మురిగిపోతున్నాయన్నారు. ఈ ఏడాది కాంగ్రెస్ పాలనలో నర్సంపేట నియోజకవర్గానికి ఎన్ని వేల కోట్ల రూపాయలను మంజూరు చేశారంటూ ఎమ్మెల్యే మాధవరెడ్డిని ప్రశ్నించారు. పలు తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి తాను నిధులు మంజూరు చేయించగా ఎమ్మెల్యే మాధవరెడ్డి నిధులను రద్దు చేయించాడన్నారు. దీనిని బట్టి గిరిజనులపై ఎమ్మెల్యేకు ఎంత ప్రేమ ఉన్నదనే విషయం తెలుస్తోందన్నారు. నర్సంపేట ఏరియా ఆస్పత్రిని నెక్కొండకు తరలింపు విషయమై ఎమ్మెల్యే మాధవరెడ్డికి ఏమాత్రం పట్టింపులేదన్నారు. నెక్కొండ అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. నెక్కొండ మునిసిపాలిటీ అవుతుందా..? లేదా అనే విషయం అధికార పార్టీ నాయకులు స్పష్టం చేయాలని పెద్ది డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, నియోజక వర్గం నాయకులు కొమ్ము రమేష్, సొసైటీ చైర్మన్ మారం రాము, మాజీ ఎంపీపీ జాటోతు రమేష్, కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, తాటిపల్లి శివకుమార్, అబ్దుల్‌నబీ, కొనిజేటి బిక్షపతి, డి.సారంగపాణి, సూరం రాజిరెడ్డి, హరికిషన్, వీరభద్రం, రవి, సత్యం, ఖలీల్, బక్కి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీ కొట్టిన కారు

బీటెక్ విద్యార్థి మృతి
మరో ఇద్దరికి తీవ్రగాయాలు



శివకుమార్ (ఫైల్)

నర్సంపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను కారు ఢీ కొట్టడంతో బైక్‌పై వెళ్తున్న ఓ బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలైన సంఘటన నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలోని ప్రధాన రహదారిపై గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రామప్ప కాలనీకి చెందిన తాటి కుమార్ కుమారుడు తాటి శివరాజ్‌కుమార్(20) అలియాస్ జెట్టీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైజాగ్‌కు చెందిన శేషగిరి, కరీంనగర్‌కు చెందిన అభిరామ్‌లు లక్నేపల్లిలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఇదే గ్రామంలోని బిట్స్ కళాశాలలో బీటెక్(సీఎస్ఈ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గురువారం రాత్రి శివకుమార్, శేషగిరి, అభిరామ్‌లు బైక్‌పై గ్రామ శివారుకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు వస్తున్న క్రమంలో గ్రామంలోని బస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే వరంగల్ వైపు నుంచి నర్సంపేటకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి వారి బైక్‌ను

మిగతా 6లో..



బైక్ ఢీకొట్టి స్తంభాన్ని ఢీకొట్టడంతో ధ్వంసమైన కారు

రుద్రేశ్వరుడిని దర్శించుకున్న బిహార్ చీఫ్ సెక్రటరీ విజయలక్ష్మి


రుద్రేశ్వరుడి సన్నిధిలో బిహార్ సీఎస్ విజయలక్ష్మి

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయాన్ని గురువారం బిహార్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి విజయలక్ష్మి సందర్శించారు. మార్గశిర మాసం బహుళ ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేకంగా నిర్వహించిన నీరా జన మంత్ర పుష్పం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఈవో వెంకటయ్య ఆలయ మర్యాదలతో స్వాగతిం చి రుద్రేశ్వరుడి సన్నిధిలో ఆమెతో ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి స్వామి వారి శేష వస్త్రాలను బహూకరించారు. రాష్ట్ర సీఎం పీఆర్వో శ్రీధర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పీఏ వరుణ్, తదితరులు కూడా గురువారం ఆలయాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు. శనివారం శని త్రయోదశిని పుర స్కరించుకొని ప్రత్యేక పూజలు తైలాభిషేకాలు నిర్వహించ నున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు ఉపేంద్రశర్మ చెప్పారు.

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ అథ్లెటిక్స్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 26 నుంచి 31 వరకు భువనేశ్వర్‌లోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (కేఐఎస్ఎస్)లో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ మహిళలు, పురుషుల అథ్లెటిక్స్ పోటీలకు 2024-25 ఏడాదికి గాను కేయూ జట్టును ఎంపిక చేసినట్లు గురువారం కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులలో పురుషుల విభాగం నుంచి జి.అంజి(కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), ఎం.కోశయ్య(లాల్ బహదూర్ డిగ్రీ కళాశాల ములుగురోడ్డు, వరంగల్), ఎస్.గోపీచంద్ (కేఎండీసీ కళాశాల, ఖమ్మం), మాలోత్ అఖిల్, (ప్రియదర్శిని డిగ్రీ కళాశాల, కొత్తగూడెం), బి.రోషన్(కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), అలాగే మహిళల విభాగం ఎస్‌కె.అఫ్రీన్(కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, ఖమ్మం), ఎం.హిందు(ఎస్‌సీ ఉమెన్స్ ఆర్ట్స్అండ్‌సైన్స్ కళాశాల ఖమ్మం) లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా ఖమ్మంలోని యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

బీసీ సమర శంఖారావం సదస్సును విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆరెగంటి నాగరాజు తదితరులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జనవరి 8న నిర్వహించే బీసీ విద్యార్థుల సమర శంఖారావం సభను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం ఇన్‌చార్జి ఆరెగంటి నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కేయూ పరిపాలన భవనంలోని రాణి రుద్రమ విగ్రహం ఎదుట సమర శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల బలిదానాలతోనే రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. అయితే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం లేదన్నారు. గత ఎన్నికల సందర్భంగా మూడు నెలలకు ఫీజులు చెల్లిస్తామని చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలమైనా ఇప్పటి వరకు ఫీజులు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులాలకు హాస్టల్స్ భవనాల నిర్మాణం జరుగులేదన్నారు. ఎస్సీ ఎస్టీలకు ఇస్తున్నటుగా బీసీ విద్యార్థులకు కామన్ ఫీజులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి విద్యార్థుల ఫీజులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు రాక ప్రైవేట్ కళాశాలలు మూతపడుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల ఫీజులు విడుదల కాకపోవడంతో కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో కేయూ బీసీ విద్యార్థి సంఘం నేతలు రాములు, అశోక్, భద్రయ్య, నాగరాజు, బండి నాగరాజు, సతీశ్, ఖద్రూ, మధు, రాజశేఖర్, ప్రతాప్, అనిల్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని సంసారంలో మద్యం చిచ్చు

▸▸ కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య ▸▸ అనాథలుగా మిగిలిన ఇద్దరు చిన్నారులు ▸▸ వరంగల్ లక్ష్మీపురంలో విషాదం


ఓని రమేష్ మృతదేహం


ఓని తిరుపతమ్మ మృతదేహం

వరంగల్ టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పచ్చని సంసారంలో కుటుంబ కలహాలు మొదలయ్యాయి. భర్త తాగుడుకు బానిస కావడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ పరిణామాలు నిరుపేద దంపతుల ఆత్మహత్యకు దారితీశాయి. ఫలితంగా ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు. వరంగల్ నగరంలో జరిగిన ఈ విషాద సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గిర్మాజీపేటలోని లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన ఓని రమేష్(35)కు అదే ప్రాంతానికి చెందిన తిరుపతమ్మ(30)తో 13ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి పన్నేండేళ్ల గౌతమ్, ఏడేళ్ల గణేష్ ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు లక్ష్మీపురంప్రాంతంలో అద్దెకు ఉంటూ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే కొంతకాలంగా ఓని రమేష్ మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోక పోగా భార్య తిరుపతమ్మతో తరచూ గొడవ పడేవాడు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి రాత్రి ఓని రమేష్ మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. మాటామాటా పెరగడంతో క్షణికావేశానికి లోనై మొదట భార్య తిరుపతమ్మ ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. దీంతో ఆందోళన చెందిన రమేష్ సైతం అదే ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు. గురువారం ఉదయం పెద్ద కుమారుడు గౌతమ్ నిద్ర లేచేసరికి తల్లిదండ్రులు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో కేకలు వేసుకుంటూ వారి పెద్దనాన్న ఎల్లాస్వామి ఇంటికి వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. సమాచారం అందుకున్న ఇంతేజార్‌గంజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను ఎంజీఎంకు తరలించి కేసు నమోదు చేశారు.

చిచ్చుపెట్టిన మద్యం

చక్కని కాపురంలో మద్యం చిచ్చుపెట్టిందని, రమేశ్ మద్యానికి బానిస కావడమే దంపతుల ఆత్మహత్యకు కారణమని స్థానికులు తెలిపారు. కొన్నేళ్లపాటు వారి కాపురం సవ్యంగానే సాగిందని, కొంత కాలంగా రమేష్ మద్యానికి బానిస కావడంతో ఇంట్లో గొడవలు ప్రారంభమయ్యాయని, తను కుటుంబాన్ని పట్టించుకోకవడం, వారిది పేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని, ఈ క్రమంలో ఇద్దరి మధ్య కలహాలు పెరిగాయని, క్షణికావేశంలో దంపతులు ఆత్మహత్యచేసుకొని పిల్లల్ని అనాథల్ని చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

అనాథలైన చిన్నారులు

తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకోవడంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. పెద్ద కుమారుడు ఓని గౌతమ్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతుండగా, చిన్న కుమారుడు ఓని గణేష్ అదే పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రుల మృతితో వారి ఆలనాపాలన చూసేవారు కరువయ్యారు. తల్లిదండ్రుల మృతదేహాల వద్ద చిన్నారుల రోదనలు చూసిన ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు

5వ పేజీ తరువాయి

ఢీకొట్టి, రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభానికి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, శేషగిరి, అభిరామ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలం సమీపంలో ఉన్న బేతం అఖిల్, రాకేష్ అనే యువకులు స్పందించి గాయాలపాలైన విద్యార్థులను ప్రైవేట్ వాహనాల్లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శివకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించిన పోలీసులు.. ఘటన గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు.


తీవ్ర గాయాలపాలైన అభిరాం

అమెరికాలో జగ్గయ్యగూడెం వాసి మృతి

▸▸ స్వగ్రామంలో మృతదేహం ఖననం


క్రాంతికుమార్‌రెడ్డి మృతదేహం

ఐనవోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రవాస భారతీయుడు అమెరికాలో అనారోగ్యంతో మృతిచెందగా మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి ఖననం చేశారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపాలెం శివారు పల్లె జగ్గయ్యగూడెంనకు చెందిన గొలమారి జోజిరెడ్డి - లుర్థ్‌మేరి దంపతులకు కుమార్తె, కుమారుడు క్రాంతికుమార్‌రెడ్డి(37) ఉన్నారు. కుమారుడు అమెరికాలోని డల్లాస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ అక్కడే స్థిరపడ్డాడు. ఆయనకు భార్య ప్రియాంక (సాఫ్ట్‌వేర్ ఉద్యోగి), 6నెలల కుమారుడు ఉన్నాడు. ఇటీవల ఆయనకు జ్వరం, ఫిట్స్ రాగా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఈనెల 17న మృతి చెందాడు. అక్కడే ఉన్న అతడి స్నేహితుల సహాయంతో మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తరలించి ఖననం చేశారు. రైతు కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులను అభ్యసించి అమెరికాలో స్థిరపడి కుటుంబానికి అండగా నిలుస్తున్న కుమారుడిని అంతలోనే మృత్యువు కబళించడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకొంది.

బైక్, టిప్పర్ ఢీ.. ఒకరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన రాజేష్

మడికొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ లారీ ఢీకొని అయ్యప్పస్వామి మాలధారణలో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం ముచ్చర్ల నాగారం గ్రామానికి చెందిన బూర్ల రాజేష్ ఖన్నా ఓ కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఓ వ్యక్తి వద్ద నుంచి డబ్బులు వసూలు చేయడం కోసం గురువారం మడికొండకు చేరుకొని ఆర్ఎస్ఆర్ గార్డెన్ వద్ద నుంచి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మడికొండ చౌరస్తా వద్దకు రాగానే బైక్‌పై వెళ్తున్న రాజేష్‌ను వెనుక నుంచి వస్తున్న టిప్పర్‌ను డ్రైవర్ ఒక్కసారిగా ధర్మసాగర్ రోడ్డు వైపు మళ్లించాడు. దీంతో టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అయ్యప్ప మాలధారణలో ఉన్న రాజేష్ కుడికాలు నుజ్జునుజ్జయి తీవ్ర రక్తస్రావం జరిగింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన రాజేష్‌ఖన్నాను అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. అక్కడి నుంచి అతడి కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాలుకు తీవ్రగాయం కావడంతో అక్కడ వైద్యులు చికిత్స చేసి కాలును కొంత మేర తొలగించినట్లు బంధువులు తెలిపారు. కాగా, రాజేష్‌కు భార్య కుమార్తె ఉన్నారు. పోలీసులు లారీని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు క్యాడర్ ఫిక్సేషన్ చేయాలి

వరంగల్ మెడికల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు క్యాడర్ ఫిక్సేషన్ చేసి, జేసీకేపే వేతనం అమలు చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్(ఎన్‌హెచ్ ఎం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్‌ఖన్నా కోరారు. ఈ సందర్భంగా గురు వారం రాజేశ్‌ఖన్నా మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ 78 క్యాడర్లలో సుమారు 17,541 మంది పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. సంబంధిత ఉద్యోగులందరికీ క్యాడర్ ఫిక్సేషన్ చేసి, రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ పే అమలు చేయాలని కోరారు. 25 ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలను తీసుకుంటూ ప్రజల ప్రాణాలను కాపాడటంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నట్లు గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు రెగ్యులరైజేషన్ చేయాలని, అప్పటి వరకూ సమాన పనికి సమాన వేతనం అమలు పర్చాలని కోరారు. గత ప్రభుత్వం విడుదల చేసిన పీఆర్‌సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని తెలిపారు. కొన్నేళ్లుగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు



క్రీడాకారుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీఎస్‌ఏ కోచ్‌లు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం హనుమకొండ జేఎన్ఎస్‌లో క్రీడాపోటీల ఏర్పాట్లను డీవైఎస్‌వో పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్, సేపక్‌తక్రా, హ్యాండ్‌బాల్ పోటీలను జేఎన్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ఎర్రగట్టు గుట్ట వద్దగల కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 29 వరకు క్రీడా పోటీలు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని విధాలా వసతులను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న క్రీడా పోటీలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రసారం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను పోత్సహించాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో ప్రథమ స్థానంలో స్వర్ణ పతక విజేతలకు రూ.లక్ష, రజత పతకం సాధించిన విజేతలకు రూ.75 వేలు, కాంస్య పతకం సాధించిన విజేతలకు రూ.50వేలు, వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం సాధించిన వారికి రూ.20వేలు, రజత పతకం సాధించిన వారికి రూ.15వేలు, కాంస్య పతకానికి రూ.10 వేలు ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, రమేష్, శంకర్, వెంకటేశ్వర్లు, అఫ్జల్, విష్ణు, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం

▸▸ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


ప్రెస్‌క్లబ్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో వరంగల్ ప్రెస్‌క్లబ్ స్పోర్ట్స్ మీట్-2024 ముగింపుతో పాటు ప్రెస్‌క్లబ్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ..తాను పాలకుడిలా కాకుండా సేవకుడిలా అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. పదేళ్ల కనీసం వసతులు కల్పించని కొందరు నేతలు ఇప్పుడు మాట్లాడడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. వరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజ అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, వివిధ యూనియన్ల నేతలు బీఆర్ లెనిన్, గడ్డం రాజిరెడ్డి, గాడిపెల్లి మధు, తడక రాజనారాయణ, వల్లాల వెంకటరమణ, బొక్క దయాసాగర్, మట్ట దుర్గాప్రసాద్, మస్కపురి సుదాకర్, మెండు రవీందర్, పీవీ మదన్ మోహన్, పిన్న శివకుమార్, గడ్డం కేశవమూర్తి, గోకారపు శ్యామ్, నన్నపునేని భరత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో గెలుపొందిన జర్నలిస్టు జట్లకు కప్పులు, షీల్డులను అందజేశారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

రూ.2,46,700, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

వరంగల్ క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డ సంఘటన మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మధ్య కోటకు చెందిన తాడేం భరత్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడనే పక్కా సమాచారం మేరకు గురువారం అదుపులోకి తీసుకొని, నిందితుడి నుంచి రూ.2,46,700, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ రంజిత్, ఎస్సై దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బతుకు చిత్రాలు వాణిదేవి కథలు

▸▸ 'సుమాయిష్' గ్రంథావిష్కరణలో నల్సార్ వీసీ కృష్ణదేవరావు


సుమాయిష్ కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న నల్సార్ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కృష్ణదేవరావు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానం, సంస్కృతి ప్రతిబింబించేలా వారి బతుకు చిత్రాలను తన అద్భుత కథల్లో వాణీదేవి పాఠకులకు హత్తుకునేలా రచించారని నల్సార్ విశ్వ విద్యాలయ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కృష్ణదేవరావు అన్నారు. గురువారం తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి డాక్టర్ దేవులపల్లి వాణీదేవి కలం నుంచి జాలువారిన తాజా కథల సమాహారం సుమాయిష్ గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. తెరసం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో తన అనుభవం ద్వారా ఆకళింపు చేసుకున్న కథనాలతో అద్భుత కథలు ఆవిష్కరింప చేసిందని కొనియాడారు. సామాన్యుడి బాధలను తన కథల్లో చిత్రీకరించిన తీరు పాఠకులకు చేరువగా ఉందన్నారు.

సింగరాజు రమాదేవి 'సుమాయిష్' కథా సంపుటిని సమీక్షిస్తూ వాణీదేవి కథల్లో తెలంగాణ అస్తిత్వ చైతన్యం స్పష్టంగా ఉందన్నారు. గ్రామీణ జీవన విధానం పలుకుబడులు, భాషతీరు అన్ని కథల్లో ప్రత్యేకంగా ఉన్నాయని పేర్కొన్నారు. డాక్టర్ గిరిజ మనోహర్ బాబు మాట్లాడుతూ.. మానవ సమాజంలోని సంబంధాలు,సామాజిక అభివృద్ధి పట్ల గౌరవ భావం దాదాపు అన్ని కథల్లో కనిపిస్తుందని పేర్కొన్నారు. తెరసం కార్యదర్శి బిల్లా మహేందర్ స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ అశ్విన్, సతీష్, వంశీ, సన్ని తదితరులు వాణీదేవి కథా సంపుటిపై ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో కార్తీక రాజు, రామ రత్నమాల, డాక్టర్ విద్యాదేవి, మేకిని దామోదర్, వెల్దండి లీలా, మందువ ప్రభాకర్‌రావు తదితర కవులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాణీదేవిని ఘనంగా సత్కరించారు.

కళాకారుడు జగన్నాథం మృతి తీరని లోటు

▸▸ ఆయనకు పద్మశ్రీ ఇవ్వాలి..

▸▸ తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ


జగన్నాథం (ఫైల్)

నర్మెట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ, సాంస్కృతిక కళారూపానికి పూర్వవైభవం తీసుకువచ్చిన మోతె జగన్నాథం మృతి తీరని లోటని, ఆయనకు పద్మశ్రీ ఇవ్వాలని తెలంగాణ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ గురువారం ఓ ప్రకటనలో కోరారు. జనగామ జిల్లా నర్మెట మండలం అమ్మాపురంనకు చెందిన చెక్క తీగల తోలుబొమ్మలాట కళాకారుడు మోతె జగన్నాథం(70) ఇటీవల అనారోగ్యంతో ఆకస్మిక మృతి చెందగా, కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బొమ్మలోల్లు అని ఆప్యాయంగా పిలుచుకునే మోతె జగన్నాథం.. శతాబ్దాల నాటి కథా సంప్రదాయాన్ని పరిరక్షించేందుకు అంకితభావంతో పాటుపడ్డారని కొనియాడారు. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు, ప్రహ్లాద, రామదాసు కథలకు ఆయనప్రాణం పోశాయన్నారు. వీరి బృంద కళానైపుణ్యం తెలంగాణ ప్రాంతపు గొప్ప వారసత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. తాను జగన్నాథం బృందంతో కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాంతాల్లో పర్యటించి వర్క్ షాపులు, కళా ప్రదర్శనలు ఇవ్వడం జరిగిందన్నారు. దశాబ్దాలుగా హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శనలు ఇప్పించామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా కళాకారుడు జగన్నాథం బృందంచే దేశంలోని 12కి పైగా రాష్ట్రాల్లో కళా ప్రదర్శనలు ఇస్తూ జాతీయ వేదికలపై గుర్తింపు పొందారన్నారు. ప్రభుత్వం స్పందించి జగన్నాథం కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

కేయూ దూరవిద్య కేంద్రం వద్ద రోడ్డు ప్రమాదం

▸▸ భారీగా స్తంభించిన ట్రాఫిక్

కేయూ క్యాంపస్ డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎదుట గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. నిజామాబాద్‌కు చెందిన ఆర్టీసీ బస్సు ఓ ప్రైవేట్ కారును వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. దీంతో కారు వెనుక బాగం నుజ్జునుజ్జు అయింది. వెంటనే కారు డ్రైవర్ అప్రమత్తమై కారును ప్రమాదం ఘటన నుంచి పక్కకు తప్పించారు. హఠాత్తుగా చోటు చేసుకున్న ప్రమాద సంఘటనతో దూరవిద్య కేంద్రం వద్ద భారీగా వాహనాలతో ట్రాఫిక్ స్తంభించింది. వెంటనే ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన బస్సును రోడ్డు పక్కకు నిలిపారు. దీంతో నిలిచిన ట్రాఫిక్ క్లియర్ అయ్యింది. కాగా, ఆర్టీసీ బస్సు కారును ఢీ కొట్టిన ఘటనలో కారులో మహిళలు, చిన్నారులున్నారు. వారు ప్రమాద తాకిడికి భయభ్రాంతులకు గురయ్యారు. సంఘటనలో బస్సులోని ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చివరకు బస్సు డ్రైవర్ బస్సుతో నిజామాబాద్‌కు తరలివెళ్లారు.


ఎస్డీఎల్‌సీఈ సెంటర్‌లో నిలిచిన ట్రాఫిక్

సవాళ్లు.. వివాదాలు!

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో మిశ్రమ రాజకీయ పరిస్థితులు

చర్చనీయాంశమైన కీలక నేతల తీరు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు రాజకీయాల్లో 2024 ఎన్నో చేదు, తీపి జ్ఞాపకాలను మిగిల్చింది. కొందరికి కాలం కలిసొస్తే.. మరికొందరికి అదే కాలం పరీక్ష పెట్టింది. కీలక నేతలు పార్టీ కండువాలు మార్చి గోడలు దూకేశారు. కారు దిగి కాషాయ గూటికి చేరిన గులాబీ నేతలు ఆరూరి, సీతారాంనాయక్‌లకు ఓటమి ఎదురవ్వగా, కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన డాక్టర్ కావ్య ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఓరుగల్లులో కాంగ్రెస్‌లో అసమ్మతి రంకెలు వేసి.. మంత్రి కొండా సురేఖను టిన్నెకు గురి చేయగా, తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో కొండా రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. మరో వైపు ఫోన్ ట్యాపింగ్ కేసు మాజీ మంత్రి ఎర్రబెల్లిని ఆందోళనకు గురి చేయగా.. మరోనేత గులాబీ పార్టీకి రాజీనామా చేసి.. మళ్లీ అదే పార్టీలో చేరాల్సిన పరిస్థితి ఎదురైంది. రాజకీయంగా ఎన్నో చేదు, తీపి జ్ఞాపకాలను మిగిల్చిన 2024 వ సంవత్సరం ఐదు రోజుల్లో కాలగర్భంలో కలిసిపోనుంది. వీటితో పాటు అధికార, ప్రతిపక్షాల నేతల మధ్య మాటల సవాళ్లు తారస్థాయికి చేరాయి. ఢీ అంటే ఢీ అన్నట్టుగా పోటాపోటీ కార్యక్రమాలు, ప్రెస్‌మీట్‌లతో నేతలు మాటల మంటలు రేపారు. పలు సందర్భాల్లో నేతల వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపాయి.

గులాబీ పార్టీకి సవాల్‌గా 2024

పదేళ్లు అధికారంలో కొనసాగిన బీఆర్‌ఎస్ 2024లో గడ్డు పరిస్థితులను ఎదుర్కొంది. 2023 డిసెంబరులో అధికారం కోల్పోయిన తరువాత చాలామంది నేతలు తెరమరుగయ్యారు. అయితే 2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికలు గులాబీ పార్టీకి అసలైన పరీక్షను పెట్టాయి. బీఆర్‌ఎస్‌లో కీలక నేతగా ఉన్న మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్యను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా మార్చి 13న ప్రకటించారు. అయితే అనూహ్యంగా కడియం శ్రీహరి తన కుమార్తె సహా మార్చి 28న బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. ఆ తరువాత కాంగ్రెస్ గూటికి తండ్రి కూతుళ్లు చేరారు. దీంతో బీఆర్‌ఎస్ భారీ షాక్‌కు గురైంది. గులాబీ కండువా పక్కన పడేసి కాంగ్రెస్ జెండాతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ కడియం కావ్య విజయం సాధించారు. అయితే ఎంపీ అభ్యర్థి పార్టీ మారటంతో పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన గులాబీ పార్టీ అభ్యర్థి కోసం వెతుక్కోవాల్సి వచ్చింది. మరోవైపు బీఆర్‌ఎస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్.. కడియం కావ్యకు టికెట్ ఇస్తారని భావించి మార్చి 17వ తేదీన బీజేపీలో చేరారు. వరంగల్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అలాగే మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్ బీఆర్‌ఎస్‌కు రాజీనామ చేసి మార్చి 10న ఢిల్లీలో బీజేపీలో చేరి, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. నలుగురు కీలక నేతలు బీఆర్‌ఎస్‌ను వీడటంతో పాటు బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేయటంతో గులాబీ పార్టీకి 2024 సంవత్సరం భారీ ఝలక్ ఇచ్చినట్లైందనే చర్చ జరిగింది. వీరితో పాటు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో పాటు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య లాంటి కీలక నేతలు గులాబీ పార్టీని వీడారు. వీరితో అనేక మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా కారు పార్టీకి బైబై చెప్పారు. 2024లో అత్యంత గడ్డు పరిస్థితులను బీఆర్‌ఎస్ ఎదుర్కొన్నది.

కొండాకు అసమ్మతి సెగ.. ఎర్రబెల్లికి ట్యాపింగ్ టెన్షన్

ఓరుగల్లు రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న మంత్రి కొండా సురేఖ దంపతులు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావులకు 2024 ఓ రకంగా హై టెన్షన్‌లోనే పెట్టింది. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో కొండా సురేఖకు చోటు దక్కినా ఓరు గల్లు రాజకీయాల్లో పట్టు చిక్కడం లేదని, ఈ క్రమంలోనే మంత్రి సురేఖతో పలువురు ఎమ్మెల్యేలతో పొసగడం లేదనే చర్చ జరుగుతోంది. తమ నియోజకవర్గాల్లో మంత్రి జోక్యం చేసుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీలకు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేయటం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. అక్టోబరు 13న మంత్రి కొండా సురేఖ గీసుకొండలో ధర్నా చేయటమే కాకుండా, సీఐ కుర్చీలో కూర్చోవటం రాజకీయంగా పెద్ద దుమారాన్నే లేపింది. అలాగే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో జరిగిన ఫోన్ సంభాషణ బయటకు లీక్ కావటం మరింత వివాదంగా మారింది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వ్యాఖ్యలు కూడా పార్టీలో అసంతృప్తిని రగిలించాయి. ఆజం జాహి కార్మిక భవన్‌ను కూల్చివేసి, ఓ వస్త్ర వ్యాపారి షాపింగ్ మాల్ నిర్మాణానికి భూమి పూజ చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పాల్గొనడం రాజకీయంగా సంచలనంగా మారింది. ఆ తర్వాతి పరిణామాలతో కొండా మురళి యూటర్న్ తీసుకోవాల్సి వచ్చింది. అలాగే సినీ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాలను కుదిపేశాయి. ఈ ఏడాదంతా కొండా దంపతులు ఏదో ఒక వివాదం లోనే ఉన్నారన్న చర్చ ప్రజల్లో ఉంది. అలాగే కొండాకు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ఈ ఏడాది ఫోన్ ట్యాపింగ్ కేసుతో హైటెన్షన్ పడాల్సి వచ్చింది. ఫోన్ ట్యాపింగ్‌లో తన ప్రమేయం ఇసుమంత కూడా లేదని ఖరాఖండిగా చెప్పినా.. మీడియాలో మాత్రం ఎర్రబెల్లిపై కథనాలు రావటం ఓరుగల్లు రాజకీయాల్లో హాట్‌టాపిక్ అయ్యింది. పర్వతగిరి కేంద్రంగా మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు పలువురి ఫోన్లు ట్యాప్ చేశారన్న ప్రచారం నేపథ్యంలో అందరి చూపు ఎర్రబెల్లిపై పడింది. మొత్తానికి ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లతో పాటు కీలక నేతలకు 2024 ఎన్నో చేదు, తీపి జ్ఞాపకాలను మిగిల్చింది.



ఉమ్మడి వరంగల్ జిల్లా మ్యాప్

కాంగ్రెస్ సక్సెస్ యాత్ర.. తలకిందులైన కాషాయం అంచనాలు

ఈ ఏడాది సక్సెస్ రేట్‌లో ఉన్నది కాంగ్రెస్ పార్టీనే. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో పాగా వేసింది. వరంగల్ లోక్‌సభ పరిధిలో బీజేపీ బలపడుతున్న వైనాన్ని పసిగట్టి, బీఆర్‌ఎస్‌లో బలమైన నేతగా ఉన్న కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లోకి తీసుకురావటం కాంగ్రెస్‌కు కలిసి వచ్చిందనే టాక్ ఉంది. కడియం శ్రీహరి కూమార్తె కడియం కావ్యను ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా బరిలో దించటంతో విజయం సొంతమైందనే టాక్ ఉంది. ఇక మహబూబాబాద్‌లో తొలి నుంచి కూడా కాంగ్రెస్ అనుకూల గాలులే వీయడం.. గెలుపు ఈజీ అయిందన్నది అందరి అభిప్రాయం. అయితే ఓరుగల్లులో కాషాయ జెండా ఎగురవేయాలనే తాపత్రయంతో ఉన్న బీజేపీ అంచనాలు 2024లో తలకిందులయ్యాయి. వరంగల్ లోక్‌సభ పరిధిలో ఎక్కువ పట్టణ ఓటర్లు ఉండటంతో పాటు మోదీ ఇమేజ్ కూడా భారీగానే కనిపించింది. కానీ పోల్‌మెనేజ్మేంట్‌లో వెనుకడుగు వేయటం ఆ పార్టీ 40ఏళ్ల ఆశలపై నీళ్లు చల్లిందనే చర్చ ఉంది. బీఆర్‌ఎస్ నుంచి కీలక నేతలు కాషాయ పార్టీలో చేరినా.. విజయం మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది. అయితే ఏ మాత్రం పట్టులేని పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట తదితర నియోజకవర్గాల్లో భారీగా ఓట్లు పోలవ్వటం, మంత్రి సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్‌తూర్పులో మెజార్టీ సాధించడం 2024లో బీజేపీకి ఊరటను కలిగించే అంశాలుగా చెబుతున్నారు.

2024లో స్టేషన్‌ఘనపూర్ రాజకీయాలు కీలక మలుపు తిరిగాయి. స్టేషన్‌ఘనపూర్ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరి, తన కూతురు కడియం కావ్యను ఎంపీగా గెలిపించుకున్నారు. తన రాజకీయ వారసురాలిని తెరపైకి తీసుకురావడంలో సక్సెస్ అయ్యారు. తొలి ప్రయత్నంలోనే కడియం కావ్య ఎంపీగా విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. కడియం కండువా మార్చినా రాజకీయంగా సక్సెస్ సాధించినట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొం టున్నారు. అయితే ఇదే స్టేషన్‌ఘనపూర్ నియోజక వర్గానికి చెందిన మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యకు 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వలేదు. కడియం శ్రీహరిని ఎమ్మెల్యేగా నిలబెట్టగా.. కడియం ఎమ్మెల్యేగా గెలవటం.

కడియంకు లక్.. తాటికొండకు ఝలక్..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో రాజయ్య చూపు తన పాత పార్టీపై పడింది. ఫిబ్రవరి 3వ తేదీన బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన రాజయ్య... కాంగ్రెస్‌లో చేరేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయినా శనిగపురం ఇందిరా రాజయ్య చేరికను అడ్డుకున్నారనే ప్రచారం జరిగింది. ఈలోపు బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్‌లోకి రావటంతో రాజయ్యకు ఢిల్లీ స్థాయిలో కూడా తలుపులు మూసుకుపోయాయి. దీంతో ఏప్రిల్ 14న గులాబీ అధినేత కేసీఆర్‌ను కలిసి మళ్లీ గులాబీ గూటికి చేరారు. కోపంతో కారు దిగి.. గత్యంతరం లేక యూ టర్న్ తీసుకుని అదే కారులోకి రాజయ్య రావటం 2024లో జరిగిన విచిత్ర రాజకీయంగా చెబుతున్నారు.

కేయూ విద్యార్థులందరికీ హాస్టల్ వసతి

- గతంలో లాగా రెగ్యులర్, ఎస్‌ఎఫ్‌సీ కోర్సులనే తేడాల్లేవు
- అదనంగా రెండు హాస్టళ్లు, మెస్‌ల ఏర్పాటు
- ఈ సంక్రాంతికి అందుబాటులోకి..

కేయూ క్యాంపస్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఈ ఏడాది రెగ్యులర్, ఎస్ఎఫ్‌సీ కోర్సులు చదువుతున్న విద్యార్థులందరికీ హాస్టల్ వసతి కల్పిస్తూ వర్సిటీ అధికారులు చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. వర్సిటీలో సీట్లు పొందిన విద్యార్థులందరికీ గతంలో ఇలాంటి సౌకర్యాలు కల్పించలేదు. తాజాగా ఈ ఏడాది రెగ్యులర్, ఎస్ఎఫ్‌సీ కోర్సులనే తేడాల్లేకుండా వర్సిటీలో సీట్లు పొందిన విద్యార్థులందరికీ హాస్టల్, మెస్ ఇవ్వడంతో విద్యార్థులు బాగా చదువుకునే అవకాశం లభిస్తుంది. వర్సిటీలోని ఎంత మందికైనా మెస్, హాస్టల్ ఇచ్చే విధంగా హాస్టల్ అధికారులు సిద్ధం అయ్యారు. దీంతో కేయూ పరిధిలోని పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు మరింతగా వర్సిటీలోని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

500 బెడ్లలో అమ్మాయిలకు నూతన హాస్టల్

కేయూ పోతన హాస్టల్ ఎదురుగా సుమారు 500 బెడ్ల సామర్థ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఈ ఏడాది నూతనంగా హాస్టల్ నిర్మించనున్నారు. దీంతో వర్సిటీలో చదివే అమ్మాయిలకు మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు అవకాశం లభిస్తుంది. ఇప్పటికే 200 బెడ్ల సామర్థ్యంతో వర్సిటీ క్యాంపస్‌లో నిర్మించిన సమ్మక్క-సారక్క హాస్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీంతో అమ్మాయిలకు హాస్టల్ కొరత తీరనుంది.

వెయ్యి మంది భోజనాలు చేసేందుకు వీలుగా..

కేయూలో ఇప్పుడున్న కామన్ మెస్‌కు దీటుగా మరో రెండు అదనపు మెస్‌లు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే వర్సిటీ న్యూబాయ్స్ డిజిటల్ హాస్టల్‌లో అదనపు మెస్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సంక్రాంతి పండుగ వరకు విద్యార్థులకు మెస్ అందుబాటులోకి రానుంది. దీంతో న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులు కామన్ మెస్ వరకు వచ్చి భోజనం చేసేందుకు పడుతున్న ఇబ్బందులు తప్పనున్నాయి.

లేడీస్ హాస్టల్‌నూ అదనపు మెస్ ఏర్పాటు



వర్సిటీ క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్‌లో ఒకే దఫా సుమారు 500 నుంచి 1000 మంది కూర్చొని భోజనం చేసేందుకు వీలుగా నూతన మెస్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే పనులకు సంబంధించిన అన్ని అనుమతులు లభించాయి. త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వర్సిటీ హాస్టల్స్ అధికారులు, డెవలప్‌మెంట్ అధికారులు సన్నద్ధం అయ్యారు.

అందుబాటులోకి జీడీ-1, స్పోర్ట్స్ హాస్టల్స్

కొన్నేళ్లుగా మూలకుపడిన జీడీ-1, స్పోర్ట్స్ హాస్టల్స్‌ను ఈ దఫా విద్యార్థులకు హాస్టల్స్ అధికారులు అందుబాటులోకి తెచ్చారు. స్వల్ప మరమ్మతుల కారణంగా జీడీ-1 హాస్టల్‌ను వర్సిటీ అధికారులు మూసివేశారు. దీనిలో సుమారు 150 మందికి వసతి కల్పించే వీలున్నా అప్పటి వర్సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. తాజాగా జీడీ-1కు మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. అలాగే అన్ని సదుపాయాలున్న స్పోర్ట్స్ హాస్టల్‌ను మూడేళ్లుగా ఎవ్వరికీ కేటాయించకుండా నిర్లక్ష్యం వదిలివేశారు. దీనిలో ఈ ఏడాది మరో 140 మందికి వసతి కల్పించారు. మూలకు పడ్డ హాస్టల్స్‌ను అందుబాటులోకి తెచ్చి విద్యార్థులకు వసతి కల్పించడంపై వర్సిటీలోని విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

వర్సిటీ హాస్టళ్లు

తెలంగాణలో రెండో అతిపెద్ద వర్సిటీగా పేరు గాంచిన కేయూలో గ్రామీణ పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇంతకుముందు వర్సిటీలోని పద్మాక్షి లేడీస్ హాస్టల్స్ సమ్మక్క-సారక్క హాస్టల్, పోతన హాస్టల్‌ను మహిళలకు కేటాయించగా, న్యూ బాయ్స్ పీజీ హాస్టల్, జీడీ-1, జీడీ-2, జీడీ-3తో పాటు అంబేద్కర్, విద్యారణ్య, స్పోర్ట్స్ తదితర హాస్టల్స్‌లను అందుబాటులోకి తెచ్చారు. వర్సిటీ క్యాంపస్‌లో అబ్బాయిలు, అమ్మాయిలందరికీ కలిసి ఈ ఏడాది 4, 200 మందికి హాస్టల్, మెస్ సౌకర్యం కల్పించారు. వర్సిటీ క్యాంపస్‌తో పాటు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, పీజీ కళాశాలకు వసతి, మెస్‌ను అందుబాటులోకి తెచ్చారు.

బోధన ఫీజులకు ఎదురుచూపులు

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులకు బోధన ఫీజులు, ఉపకార వేతనాల అందక కష్టాలు పెరుగుతున్నాయి. ఐదేళ్లుగా ఫీజుల బకాయిలు అందకపోవడంతో ఆందోళలు వ్యక్తం అవుతున్నాయి. 2023-24 విద్యాసంవత్సరం నాటికి బోధనా ఫీజులు, ఉపకార వేతన బకాయిలు రాష్ట్రంలో దాదాపు రూ.5,165కోట్లకు చేరుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. దీంతో కేయూ విద్యార్థుల బకాయిలతో వర్సిటీ హాస్టల్స్‌పై భారం పడుతున్నాయి. రెండేళ్లుగా మెయింటెనెన్స్ చార్జీలను (ఎంటీఎఫ్)లను విడుదల చేయడం లేదు. దీంతో వర్సిటీలో విద్యార్థులకు భోజనం, హాస్టల్స్ నిర్వహణకు వర్సిటీ అధికారులు నిధుల కోసం వెంపర్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఫీజులు మంజూరైనట్లు ప్రొసీడింగ్ వస్తే చాలు.. భోజనంతో పాటు హాస్టల్స్ వసతి కల్పించాలనే నిబంధనలున్నాయి. అలాగే ఆయా విద్యార్థుల చదువుల సర్టిఫికెట్లను సైతం వెంటనే ఫీజుల బకాయి విడుదలతో సంబంధం లేకుండా జారీ చేయాలని చెబుతున్నాయి.

విద్యార్థులకు అండగా..

కేయూలో విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం విడుదల చేయనప్పటికీ వర్సిటీ అధికారులు విద్యార్థులకు అండగా నిలిచి రెగ్యులర్‌తో పాటు ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు హాస్టల్స్, మెస్ సౌకర్యం కల్పించడం గమనార్హం. రెగ్యులర్ విద్యార్థులతో పోల్చితే కొన్ని ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీ ఫీజులు, మెస్ బకాయిలన్నీ చెల్లించదు. విద్యార్థులే స్వయంగా చెల్లించుకోవాల్సిన పరిస్థితి. విద్యార్థులు కొందరు చదువు పూర్తయిన వెంటనే ఫీజులకు డబ్బుల్లేక వర్సిటీకి చెల్లించలేని పరిస్థితి ఉంటుంది.

ఆయా విద్యార్థుల మెస్ ఖర్చుల భారం వర్సిటీ భరించాల్సి ఉంటుంది. దీంతో గతంలో వర్సిటీలో ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యా ర్థులకు హాస్టల్స్ మెస్ ఇచ్చేందుకు వర్సిటీ అధికా రులు వెనుకడుగు వేశారు. ఇప్పుడు విద్యార్థులందరికీ హాస్టల్స్, మెస్ ఇవ్వడంతో విద్యార్థులు సంతోషంగా వర్సిటీ క్యాంపస్‌లో చదువుకునేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో అడ్మిషన్ల సంఖ్య భారీగా పెరుగుతోంది. అనేక మంది విద్యార్థులకు హాస్టల్స్ అధికారులు అండగా నిలుస్తున్నారు.

వర్సిటీ కామన్ మెస్‌లో ఇక్కట్లు

వర్సిటీలోని వెయ్యి మంది విద్యార్థులు ఒకే దఫా కూర్చొని అల్పాహారంతో పాటు భోజనం చేసేందుకు వీలుగా వర్సిటీలో కామన్ మెస్‌ను ఏర్పాటు చేశారు. వర్సిటీని బాయ్స్ హాస్టల్స్ విద్యార్థులందరికీ కామన్ మెస్‌లోనే భోజనాల ఏర్పాట్లు చేశారు. దీంతో విద్యార్థులందరికీ సరిపడా వంట కాలు చేసే క్రమంలో అనేక దఫాలుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కామన్ మెస్‌లో విద్యార్థుల తాకిడి ఎక్కువగా పెరగడంతో ఒక్కోరోజు వంటకాలు అందడం లేదు. అలాగే మరో రోజు భోజనాల సన్నాహ అంచనాలు తప్పి భోజనాలు సరిపోవడం లేదు. భోజనాలు సరిపోని విద్యార్థులు తమకు భోజనం కావాలంటూ నిరసన ఆందోళనలకు దిగుతున్నారు. దీంతో వర్సిటీలోని హాస్టల్ విద్యార్థులను విభజించనున్నారు. నూతనంగా న్యూ పీజీ డిజిటల్ హాస్టల్‌లో మెస్ ఏర్పాటు చేస్తే కామన్ మెస్‌పై భారం తగ్గుతుందని భావించారు. విద్యార్థులను ఇప్పటి కంటే మరింత నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.



రాహుల్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న పరశురామ్

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

- నా పోరాటానికి మద్దతివ్వండి
- 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ రాహుల్‌కుమార్‌కు పరశురామ్ వినతి

జనగామ కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఫొటో ముద్రించాలని, తన ఈ పోరాటానికి మద్దతునివ్వాలంటూ కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరశురామ్ 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ ఎన్ రాహుల్‌కుమార్‌ను కోరారు. గురువారం హైదరాబాద్‌లోని 'ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంలో రాహుల్‌కుమార్‌ను పరశురామ్ కలిశారు. తొలుత ఇటీవల ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరశురామ్ మాట్లాడుతూ తన వినతి విషయంపై రాహుల్‌కుమార్ స్పందించారని, తాను చేస్తున్న ఉద్యమం న్యాయబద్ధమైందని, దానికి తన సహకారం ఉంటుందని స్పష్టం చేశారన్నారు.

పుష్కరిణి.. పాహిమాం!

- వచ్చే ఏడాది మేలో సరస్వతీ పుష్కరాలు
- ఏర్పాట్లు, పెండింగ్ పనులపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్
- ప్రత్యేక దృష్టి పెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు
- వరుస సమావేశాలతో ముందుకు కదులుతున్న ఫైళ్లు



కాళేశ్వరాలయం

మహదేవపూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పుష్కరిణిలో స్నానాలు చేస్తే సకల పాపాలు తొలగిపోతాయని నమ్ముతుంటారు. ఈ క్రమంలోనే పన్నెండేళ్లకోసారి వచ్చే ఈ ఉత్సవాల కోసం భక్తులు ఎదురుచూస్తూ ఉంటారు. మన రాష్ట్రంలో ఎక్కువగా గోదావరి, కృష్ణా పుష్కరాలకు ప్రాచుర్యం ఉంటుంది. ఇక దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద జరిగే సరస్వతీ పుష్కరాలకు సమయం దగ్గరపడుతోంది. వచ్చే ఏడాది మే నెలలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సమూహం వద్ద సరస్వతీ పుష్కరాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. త్రిలింగాలలో ఒకటైన కాళేశ్వరం దేవాలయం అతి ప్రాచీనమైంది. నది ఒడ్డున ఒకే పానవట్టంపై రెండు లింగాలు ఉన్న పుణ్యక్షేత్రంగా కాళేశ్వరం పేరొందింది. ఇంత పవిత్ర దేవాలయం వద్ద జరిగే పుష్కరాలు అంటే భక్తులు భారీగా తరలొస్తుంటారు. కార్తీక మాసంలోనే రోజూ 30వేల నుంచి 40వేల మంది భక్తులు తరలివచ్చారు. ఇక సరస్వతీ పుష్కరాలకు.. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి రోజుకు సుమారు 50వేలకు పైగా భక్తులు తరలొస్తారని అంచనా.

రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక

పుష్కరాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రణాళిక సిద్ధం చేస్తోంది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని ఇప్పటికే అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ సెక్రటరీ, దేవాదాయ శాఖ కమిషనర్లు ఇటీవల కాళేశ్వరం, భూపాలపల్లిలో వరుస సమావేశాలు నిర్వహించారు. పెండింగ్ పనులపై ఆరా తీశారు. రెండు సార్లు దేవాదాయ శాఖ మంత్రి, ఇతర అధికారులతో మంత్రి శ్రీధర్‌బాబు సమావేశాలు నిర్వహించి.. పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఫిబ్రవరిలో కుంభాభిషేకం

కాళేశ్వరంలో ఫిబ్రవరి చివరివారంలో కుంభాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు హైదరాబాద్ సమీక్ష సమావేశంలో వివరించారు. 1982లో ఆలయ పునఃప్రతిష్ఠ అయినప్పుడు ఆ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. మళ్లీ ఫిబ్రవరిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న పనులు

రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలో ఉన్న గోదావరి వద్ద శాశ్వత నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మరుగుదొడ్లు, డస్ట్ బిన్‌లు, ప్రత్యేక షాట్‌లు, స్త్రీలు దుస్తు మార్చుకునే గదులు, భక్తులు సేద తీరేందుకు షెడ్లు నిర్మించనున్నారు. అలాగే వంద గదుల వసతి గృహానికి సంబంధించిన పనులు పూర్తి చేయాలని మంత్రి ఇదివరకే అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఆలయ గోపురానికి వేసిన రంగు, ఇతర ఆలయాలకు వేసే రంగు ఒకటిలా ఉన్నాయని, దాంతో శివుడికి ప్రీతికరమైన బూడిద రంగు వేయాలని పలువురు భక్తులు సూచించడంతో అదికూడా పెండింగ్‌లో ఉంది. ఆలయానికి రెగ్యూలర్ ఈవో లేరు. ఇన్‌చార్జ్ ఈవోగా మారుతి కొనసాగుతున్నారు. అతిపెద్ద ప్రాచీన దేవాలయమైన కాళేశ్వరానికి అసిస్టెంట్ కమిషనర్ హోదాకు తగ్గట్టుగా అధికారిని నియమించాల్సి ఉంది. ఆలయానికి వచ్చే భక్తులకు సరిపడా అర్చకులు లేరు. ఇటీవల కొంతమంది పదవీ విరమణ పొందారు. దాదాపు 10 మంది అర్చకులను నియమించాల్సి ఉంది. అన్న సత్రం నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది.



గోదావరి వద్ద భక్తుల రద్దీ (ఫైల్)

ఉచిత బస్సు ప్రయాణంతో మరింత పెరుగనున్న మహిళల రాక

రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉన్నందున కాళేశ్వరానికి ఈ సారి మహిళా భక్తులే పెద్ద ఎత్తున తరలిరానున్నారు. మే నెలలో వచ్చే పుష్కరాలు కాబట్టి వ్యవసాయ పనులు అన్ని పూర్తయి ఉంటాయి. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు తరలిరానున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి కాళేశ్వరానికి బస్సులు నడవనున్నందున మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.

కార్యకర్తల కృషితోనే మొదటి స్థానం

• బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

రాంనగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే హనుమకొండ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన కార్యకర్తలు, నాయకులకు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గం నుంచి 82వేల పైచిలుకు సాధారణ సభ్యత్వంతో పాటు వెయ్యికి పైగా క్రియాశీల సభ్యత్వాలు పూర్తిచేసి, 487 పోలింగ్ బూత్‌లకు గాను 402 బూత్ కమిటీలను ఏర్పాటు చేసి రాష్ట్ర నాయకత్వంతో ప్రశంసలు పొందటం గర్వకారణమన్నారు.

సగర సంఘం నాయకుల దాతృత్వం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సగర సంఘం

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని సగర(ఉప్పర) సంఘం నాయకులు దాతృత్వం చాటుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.70వేలు ఆర్థిక సహాయంతో పాటు బియ్యం అందించారు. గ్రేటర్ 2వ డివిజన్ గుండ్లసింగారం గ్రామానికి చెందిన శనిగరపు శివకుమార్ అలియాస్ బిల్లు శివ ఇటీవల రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం దశదిన కర్మ సందర్భంగా జిల్లా సగర సంఘం నాయకులు రూ.70వేలు ఆర్థిక సహాయంతో పాటు ఒక క్వింటాల్ బియ్యం అందించారు. మృతుడి కుటుంబాన్ని కలిసిన వారిలో హనుమకొండ జిల్లా సగర సంఘం అధ్యక్షుడు నలబోల సతీష్, రాష్ట్ర సంఘం కోశాధికారి తాడిశెట్టి విద్యాసాగర్, నాయకులు వడ్లకొండ కుమారస్వామి, వీరగంటి రవీందర్, వీక్కొండ కిషన్, గంటి శ్రీను, సీత కమలాకర్, కురిమిండ్ల సదానందం, యంజాల మల్లేశం, సీత రమేష్, దుర్గాప్రసాద్‌రావు, అయోధ్య, కరుణ, కవిత, గణేశ్, రాజన్నలు ఉన్నారు.

సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల పెంపు

రాంనగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని న్యూశాయంపేట సబ్‌స్టేషన్‌లో 8 ఎంవీఏ ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు అదనంగా 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పెంచామని హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ తెలిపారు. మొత్తం ఇప్పుడు 16 ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెరిగిందన్నారు. దీని ద్వారా లోడ్ పెరిగిన ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని స్పష్టం చేశారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ జీసాంబరెడ్డి, ఏడీఈలు మల్లికార్జున్, జానకిరాంరెడ్డి, దర్శన్ కుమార్, ఏఈ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పుష్ప-2 చిత్ర దర్శక నిర్మాతలు, హీరోపై చర్యలు తీసుకోవాలి

▸▸ హనుమకొండ పీఎస్‌లో ఫిర్యాదు



సీఐ సతీష్‌కు ఫిర్యాదు చేస్తున్న కేశవమూర్తి

వరంగల్ క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నేరప్రవృత్తిని ప్రోత్సహించడంతో పాటు పోలీస్, రాజకీయ వ్యవస్థను కించపరిచే విధంగా నిర్మించిన పుష్ప-2 దర్శకుడు, నిర్మాత, హీరోపై చర్యలు తీసుకోవాలని గురువారం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో సీనియర్ జర్నలిస్టు గద్దం కేశవమూర్తి ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న హైదరాబాద్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంధ్య థియేటర్ ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మరణించగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటనలో పోలీసుశాఖ స్పందించిన తీరు అభినందనీయమని, ఈ ఘటనలో 18 మందిపై కేసు నమోదు చేయగా, 11వ నిందితుడిగా హీరో అల్లు అర్జున్ పేరు చేర్చడం సంతోషకరమైన విషయమని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సందేశాత్మకమైన చిత్రాలు నిర్మించాల్సిందిపోయి సమాజాన్ని వక్రమార్గంలో నడిపించే విధంగా పుష్ప-2 సినిమా నిర్మించిన దర్శకుడు సుకుమార్, నిర్మాతలు యెలమంచిలి రవిశంకర్, యెర్నేని నవీన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత బండ్రెడ్డి అశోక్, సినిమా హీరో అల్లు అర్జున్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐ సైసతీష్‌ను కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వడ్డెపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీ ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత మట్టేవల్లి మోహన్ (59) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, ఇమ్మడి లోహిత రాజు, మాజీ కార్పొరేటర్లు దాస్యం విజయ్ భాస్కర్, ఎనుకొంటి నాగరాజు, కాంగ్రెస్ నేతలు మండల సమ్మయ్య, తమ్మెల శోభారాణి తదితరులు మోహన్ భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు.

వేం నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



నరేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేస్తున్న మార్నేని

హనుమకొండ సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. గురువారం హైదరాబాద్‌లో వేం నరేందర్‌రెడ్డిని కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ డీసీసీ బ్యాంక్ చైర్మన్ బోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని వేం నరేందర్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నాయకులు ఆయన జన్మదిన వేడుకలు జరిపారు. టీపీసీసీ నాయకుడు మార్శ విజయ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మార్శ విజయ్ కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కూర వెంకట్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని హనుమకొండ కాకాజీకాలనీలో మాజీ కార్పొరేటర్ కానుగంటి శేఖర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. పేదలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

• కాజీపేట : ప్రభుత్వ ముఖ్య సలహాదారు, మాజీ ఎమ్మెల్యే వేంనరేందర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను గ్రేటర్ వరంగల్ 47వ డివిజన్ డీజిల్ కాలనీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ అధికార ప్రతినిధి వనమూరి మనోహర్ ఆధ్వర్యంలో గురువారం కేక్‌కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యకర్తలు చందుపట్ల మాధవరెడ్డి, కంశబాల నురేందర్, రాజారపు యాదగిరి, కాంపెల్లి లక్ష్మణ్, భైరి సత్యం, తంగళ్లపెల్లి సమ్మయ్య, జవ్వాజి నరేందర్, ధనరాజ్, పొలిమేర గోపి, కందుకూరి ఎల్లయ్య శ్రీనివాస్, మునిగాల ప్రసాద్, నాతరి శ్రీనివాస్, నదుమూరి జానీ, వలబోజు రవీందర్, మోహన్, విజయ్, బొబ్బిలి రవి, షౌకత్‌అలీ, కుమారస్వామి పాల్గొన్నారు.



డీజిల్ కాలనీలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రోడ్లపై మూగజీవాల సంచారం

▸▸ ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

▸▸ హనుమకొండ చౌరస్తాలో ట్రాఫిక్‌కు అంతరాయం



హనుమకొండ చౌరస్తాలో ప్రధాన రోడ్డుపై తిష్ట వేసిన పశువులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ చౌరస్తా, బ్రిలర్‌స్ట్రీట్ పరిసర ప్రాంతాల్లోని ప్రధాన, అంతర్గత రోడ్లపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తూ ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. ప్రధానంగా హనుమకొండ బ్రిలర్‌స్ట్రీట్ నుంచి కుమార్‌పల్లి కూరగాయల మార్కెట్ వెళ్లే ప్రధాన రోడ్డుకు అడ్డుగా మూగజీవాలు గుంపులు గుంపులుగా చేరి అక్కడే తిష్ట వేయడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జన సమూహంతో రద్దీగా ఉండే రోడ్లపై విచ్చలవిడిగా పశువులు సంచరించడంతో పాటు పొట్లాటకు దిగడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఎక్కడ ప్రమాదాలకు గురికావల్సి వస్తుందోనని బిక్కుబిక్కుమంటూ ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం అని తేడా లేకుండా పశువులు రోడ్డుకు అడ్డుగా ఉండటమే కాకుండా పశువులు ఒకదానికి ఒకటి పొట్లాటకు దిగడంతో రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది.

నిత్యం వందల మంది వివిధ పనుల నిమిత్తం బ్రిలర్‌స్ట్రీట్‌కు రాకపోకలు సాగించడంతోపాటు రోడ్డుకు అడ్డుగా ఉన్న పశువుల కారణంగా నానా ఇబ్బందులు చవిచూడాల్సిన దుస్థితి నెలకొందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. కుమార్‌పల్లి కూరగాయలు మార్కెట్ వద్ద కూరగాయలు కొనుగోలు చేసిన సంచులపై పడుతున్నాయని కూరగాయల విక్రయదారులు వాపోతున్నారు. ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న పశువులను వాటి యజమానులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్లపై తిష్ట వేసి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న పశువుల విషయంలో శ్రద్ధ కనబర్చి పశువుల యాజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హనుమకొండ బ్రిలర్ స్ట్రీట్ రోడ్డుపై అడ్డుగా ఉన్న పశువులు



కుమార్‌పల్లి ప్రధాన రోడ్డుపై పోట్లాడుకుంటున్న మూగజీవాలు

స్పీడ్ బ్రేకర్లను తలపిస్తున్నాయి..

చిల్పూరి కిషన్, వాహనదారుడు



వివిధ పనుల నిమిత్తం హనుమకొండ బ్రిలర్‌స్ట్రీట్‌కు వస్తుంటాం. బ్రిలర్‌స్ట్రీట్‌లో వాణిజ్య సముదాయాలు ఉండటం వలన సామాన్లు కొనుగోలు చేయడానికి వచ్చే క్రమంలో కుమార్‌పల్లి కూరగాయాల మార్కెట్ నుంచి బ్రిలర్‌స్ట్రీట్ వచ్చే ప్రధాన రోడ్డుపై మూగజీవాలు పెద్ద ఎత్తున రోడ్డుకు అడ్డుగా ఉండి స్పీడ్ బ్రేకర్లను తలపిస్తున్నాయి. ప్రతీ రోజు పశువులు రోడ్లకు అడ్డుగా ఉండటంతో అటుగా వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా పశువులు రోడ్లపైకి రాకుండా నియంత్రించాల్సిన అవసరం ఉంది.

ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నాం..

ఎర్రోజు భాస్కర్, బ్రిలర్‌స్ట్రీట్, హనుమకొండ



నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లపై పశువులు తిష్ట వేయడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఉదయం వేళల్లో స్కూల్ పిల్లల్ని తీసుకెళ్లాలంటే రోడ్డుకు అడ్డుగా ఉన్న పశువులు కారణంగా ఆలస్యం అవుతోంది. రోడ్డుపై ఉన్న మూగజీవాలను పక్కకు పంపిచే ప్రయత్నం చేద్దామంటే ఎక్కడ దాడి చేస్తాయో అని భయపడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. మూగ జీవాలవల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు పట్టించుకునే వారే కరువయ్యారు. మూగ జీవాల విషయంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలుగజేసుకొని సమస్యను పరిష్కరించాలి.

నేటి నుంచి భీమారంలో నాటకోత్సవాలు

హసన్‌పర్తి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమారం వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవం-2024 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్మారక నాటకోత్సవ కమిటీ వరంగల్ అధ్యక్షుడు వనం లక్ష్మీకాంతరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, విశిష్ట అతిథిగా స్థానిక కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు, పందిళ్ల రమేష్‌బాబు, అతిథులుగా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర సారంగపాణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల సారంగపాణి, కాంగ్రెస్ నాయకుడు ఆకుల కుమార్, గద్దం శివరాంప్రసాద్, రచయితల, నటుడు, దర్శకుడు శీట సత్యనారాయణలు హాజరవుతున్నట్లు తెలిపారు. ముందుగా పల్లేటి లక్ష్మీ కులశేఖర్ రచించిన టి.బాబురాజు దర్శకత్వంలో టీబీఆర్ ఆర్ట్స్ కూకట్‌పల్లి హైదరాబాద్ వారి అయ్యప్ప పద్యనాటకం ఉంటుందని తెలిపారు. ఈ మూడు రోజుల పాటు జరిగే నాటకోత్సవ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు, దేశిని నిర్మలవీరస్వామి, అటికం రవిందర్, ఆకుల సునీల్‌లు తమ వారసుల జ్ఞాపకార్థం ఆర్థిక తోడ్పాటునందిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నాట సమాజ అధ్యక్షుడు ఆకుల సదానందం, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వొడపాణి చక్రపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరాజు రవీందర్‌రావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాడిశెట్టి రమేష్, పందిళ్ల స్మారక నాటకోత్సవ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు బాలాజీ, వెంకట్, నాగరాజు, రాజేంద్రప్రసాద్, కళాకారులు పాల్గొన్నారు.

సర్వే సమాచారాన్ని యాప్‌లో నమోదు చేయండి



గోపాల్‌పూర్ మారుతినగర్‌లో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్

▸▸ మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వడ్డెపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం నిర్వహిస్తున్న సర్వే సమాచారాన్ని యాప్‌లో నమోదు చేయాలని మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. కాజీపేట సర్కిల్ పరిధిలోని 56వ డివిజన్ గోపాల్‌పూర్ మారుతీ నగర్‌లో కొనసాగుతున్న సర్వే తీరును గురువారం కమిషనర్ ఆకస్మికంగా పరిశీలించారు. సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్, వార్డు ఆఫీసర్ జెట్టి రాజు, జూనియర్ అసిస్టెంట్ స్వాతి, ఆర్పీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వరంగల్ గొప్ప చారిత్రక నగరం

▸▸ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో పోలోజు కృష్ణమాచారి



పాల్గొన్న అటవీశాఖ అధికారులు, రిటైర్డ్ అధికారులు

హసన్‌పర్తి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ గొప్ప చారిత్రక నగరమని ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లా అటవీశాఖ అధికారి పోలోజు కృష్ణమాచారి అన్నారు. మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ టీటీడీసీ సమావేశ మందిరంలో వరంగల్ యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో పర్యావరణ సంరక్షణపై అవగాహన కార్యక్రమం గురువారం మాజీ జిల్లా అటవీశాఖ అధికారి కాజీపేట పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ సాంస్కృతిక వారసత్వమే కాకుండా అడవులు, సరస్సులు, వన్యప్రాణులతో కూడిన ప్రకృతి సంపదకు ప్రసిద్ధి చెందిందన్నారు. ఇతర పట్టణాల మాదిరిగానే వరంగల్ కూడా అడవుల తొలగింపు, నీటి కాలుష్యం, పట్టణీకరణ ప్రభావాల వంటి పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు. భవిష్యత్తు తరాలకు ప్రకృతి సంపదను కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రత్యేక అతిథి జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు. నగరంలోని పర్యావరణ ఉద్యమంలో పాల్గొనడానికి అన్ని స్వచ్ఛంద సంస్థలు మొక్కలు నాటడం వంటి మౌలిక చర్యలను చేపట్టాలన్నారు. కళాశాల విద్యార్థులను ఈ ఉద్యమంలో భాగస్వాములను చేయాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ జాయింట్ సెక్రటరీ మండల పరశురాములు, కార్యవర్గ సభ్యులు పొన్నాల రామ్మోహన్, కె.అనితారెడ్డి, టి.శ్రవన్, రాజగోవింద్, సుధాకర్ స్వామి, నాగేశ్వర్‌రావు, పి.రాజుకుమార్, పిట్టల రవిబాబు, శ్రీనివాస్, సతీష్, ప్రకాష్, దేశిని లక్ష్మీనారాయణ, మల్లారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, దామోదర్, కమలాకర్, స్వామి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

వరంగల్ క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 22 మంది వాహనదారులను గురువారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి రూ.37,100 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ ఏడుగురికి రూ.4000 జరిమానా విధించారని పేర్కొన్నారు.

గుట్కాలు పట్టివేత



పట్టుకున్న గుట్కాలతో పోలీసులు

వరంగల్ క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చట్టవ్యతిరేకంగా విక్రయిస్తున్న గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం... అలంకార్ జంక్షన్‌లో ఎం.డి. ఇంతియాజ్ గుట్కాలు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు స్థానిక పోలీసులతో కలిసి సోదాలు చేసి రూ.50,480 విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన గుట్కాలను సీజ్ చేశామన్నారు. ఈ సోదాల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రంజిత్, ఎస్సై వి. దిలీప్, హనుమకొండ ఎస్సై సతీష్, కానిస్టేబుల్స్ రవీందర్, గౌస్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో ప్రైవేట్ ల్యాబ్‌ల దందా

వరంగల్ మెడికల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ప్రైవేట్ నిర్వాహకుల దందా కొనసాగుతోంది. నేరుగా వార్డులోకి వచ్చి రోగుల నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్నారు. సిబ్బంది మాత్రం చోద్యంగా చూసినట్లు తెలుస్తోంది. వార్డుల్లోని రెగ్యులర్ సిబ్బంది ప్రైవేట్‌లో చేయించుకోమని ఉచిత సలహా ఇస్తున్నట్లు సమాచారం, ఇలాంటి వారికి ప్రైవేట్ ల్యాబ్‌ల నిర్వాహకులు నెల నెలా మామూళ్లు కూడా చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. యథేచ్ఛగా సాగుతున్న ఈ దందాపై ఎంజీఎం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రోగి నుంచి రక్త నమూనా సేకరిస్తున్న దృశ్యం

సత్వర న్యాయం అందించాలి

మట్టెవాడ డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరం న్యాయం అందించాలని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ అన్నారు. గురు వారం ఆయన మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరును, పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల రికార్డులను పరిశీలించారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేవిధంగా పనిచేయాలని సూచించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ లీగల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఆహ్వానిత క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ ఆవిష్కరించారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో కలిసి క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ప్రశాంతతకు, శరీర దృఢత్వానికి దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషదాయకమని జిల్లా జడ్జి అన్నారు. జనవరి నెలలో జరుగనున్న క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముదసిర్ అహ్మద్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు సామంతుల శ్రీనివాస్, వెంకటరమణ, వే ముల రమేష్, ఆనంద్‌మోహన్, రాజు నాయక్, సురేష్, నాగేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా హిందూ ముక్తిస్థల్

కానరాని కనీస సౌకర్యాలు ● పేరుకుపోయిన చెత్తాచెదారం ● దట్టంగా పెరిగిన పిచ్చిచెట్లు

పందులు, కుక్కల స్వైర విహారం ● అసంపూర్తిగా అభివృద్ధి పనులు ● నిర్లక్ష్యం చేస్తున్న నగర పాలక సంస్థ



వరంగల్ ఎల్‌బీనగర్‌లోని హిందూ ముక్తిస్థల్



అసంపూర్తిగా నిలిచిపోయిన విశ్రాంతి గదుల భవనం

హనుమకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎల్‌బి నగర్ ఆదర్శ వీధిలోని హిందూ ముక్తి స్థల్ శ్మశాన వాటిక అత్యంత అధ్వానంగా ఉంది. లోపల అంతా పిచ్చిచెట్లు పెరిగి, చెత్తాచెదారం పేరుకు పోయి డంపింగ్ యార్డులా మారిపోయింది. 21 వార్డు పరిధిలోని ప్రజలకు ఏకైక శ్మశాన వాటిక ఇదే కావడంతో నిత్యం రెండు మూడు దహన సంస్కారాలు ఇక్కడే జరుగుతుంటాయి. వరంగల్ నగరం నడిబొడ్డున ఉన్న ఈ ముక్తిస్థల్‌కు ఎల్‌బినగర్, కాశిబుగ్గ, చార్‌బౌలిక, గిర్మాజీపేట, లక్ష్మీపురం, పీవర్స్ కాలనీతోపాటు చుట్టుపక్కల ప్రజలు దహన సంస్కారాల కోసం ఎక్కువగా ఇక్కడికే వస్తుంటారు.

● జనావాసాల మధ్య

ఆదర్శవీధిలో ఈ శ్మశాన వాటిక ఉంది. గతంలో ఇక్కడ పెద్దగా ఇళ్లు ఉండేవి కావు. క్రమేణా చుట్టూ పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం జరగడంతో ఈ శ్మశానవాటికి సరిగ్గా ఇళ్ల మధ్యకు వచ్చింది. ప్రతీ రోజు శవయాత్రలన్నీ ఈ వీధిలోని ఇళ్ల ముందు నుంచే సాగుతాయి. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చితిమంటల నుంచి వచ్చే పొగంతా ఈ చుట్టు పక్కల ఇళ్లకు వ్యాపిస్తుంటుంది. అయినా విధిలేని పరిస్థితుల్లో వారు భరిస్తున్నారు.

● కొరవడిన పర్యవేక్షణ..

మున్సిపల్ అధికారులుగానీ, స్థానిక ప్రజాప్రతినిధులు గానీ దీని గురించి పట్టించుకోవడం లేదు. శ్మశానవాటిక స్థలం విశాలంగా ఉన్నా సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పిచ్చిచెట్లు దట్టంగా పెరిగాయి. వాటి మధ్య మురుగు నీరు పెద్ద ఎత్తున చేరడంతో పందులు సైర్యవిహారం చేస్తున్నాయి. కుక్కలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో ఎటు చూసినా దహన సంస్కారాల్లో ఉపయోగించే కర్రలు, చాపలు, పాతదిండ్లు, వాడిపోయిన పూలదండలు, బూడిత ఇతర చెత్తాచెదారం నిండిపోయి కనిపిస్తోంది. దుర్గంధం వ్యాపించి అంత్యక్రియలకు వచ్చినవారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రాళ్లు రప్పలతో లోపల అడుగుతీసి అడుగుపెట్టేట్లు లేదు. దహన వాటికల వద్ద బండలు ఊడిపోవడంతో చితిచుట్టూ తిరిగేవారి కాళ్లకు గుచ్చుకొని గాయాలవుతున్నాయి. దింపుడు కళ్ళం వేదిక చుట్టూ బండలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఆ పక్కనే ఉన్నచెత్త కుండీ నిండిపోయి కంపుకొడుతోంది.

● అసంపూర్తిగా రూ.2 కోట్ల అభివృద్ధి పనులు..

తిలక్ రోడ్డులోని ఈ శ్మశానవాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు వరంగల్ మహానగర పాలక సంస్థ రూ2 కోట్లను మంజూరు చేసింది. గత సంవత్సరం మార్చి 3వ తేదీన గత ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క పనీ పూర్తి కాలేదు. దహనవాటికలను తూతూ మంత్రంగా నిర్మించారు. విశ్రాంతి గదుల పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. కర్మకాండల నిర్వహణ కోసం చేపట్టిన ప్లాట్‌ఫారాల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ఎముకలను భద్రపరిచేందుకు ఏర్పాట్లు లేవు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు లేవు. అంత్యక్రియల అనంతరం మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు స్నానాలు చేయడానికి కూడా ఏర్పాట్లు లేవు.


● పట్టించుకోని కమిటీ..

శ్మశాన వాటిక పర్యవేక్షణకు హిందూ ముక్తిస్థల్ సేవా సంఘం పేరిట ఒక కమిటీ ఉన్నా.. వారు పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. పేరుకు 21 మంది సభ్యులతో కమిటీ ఉన్నా శ్మశాన వాటిక ఆలనాపాలనా చూసేవారు లేకుండా పోయారు. వరంగల్ నగర పాలక సంస్థ కూడా తనకేమి పట్టనట్టు వ్యవహరిస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని, శ్మశాన వాటిక పరిస్థితి గురించి వారి దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లినా స్పందన లేదని విమర్శిస్తున్నారు. ఇరుకు సందులో జనావాసాల మధ్య ఉన్న ఈ హిందూ ముక్తిస్థల్ ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు అభ్యర్థిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి 9
నవ్య
నివేదన
శుక్రవారం • 27 డిసెంబరు 2024

ప్రత్యేకం

కాలం అవిచ్ఛిన్నంగా ప్రవహించే ఒక మహా ప్రవాహం. ఒక సంవత్సరం... దానిలో చిన్న నీటి బిందువుకన్నా తక్కువే. కానీ ప్రతి క్షణం ఎంతో విలువైన మానవ జీవితంలో... ఒక ఏడాది కాలానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతున్న వేళ... గడచిన రోజులను, ఆ రోజుల్లో చవిచూసిన సాఫల్య, వైఫల్యాలను పునశ్చరణ చేసుకొని, ఏవైనా పొరపాట్లు జరిగితే రాబోయే కాలంలో సరిదిద్దుకోవడానికి, జీవితాన్ని మరింత ఫలప్రదంగా మార్చుకోవడానికి ఒక సంకల్పం చేసుకోవడం అవసరం.



సంకల్పం చేసుకుందాం... కొత్తగా!

భక్తికన్నా భయమే ఎక్కువ

చాలామంది కొత్త ఏడాదిలో అనుసరించాల్సిన ప్రణాళిక గురించి తీర్మానాలు చేసుకుంటూ ఉంటారు. వాటిలో ఆధ్యాత్మికమైనవి కూడా ఉంటాయి. కానీ వాటిని అమలు చేసేవారు అతి తక్కువ. మన చుట్టూ ఉన్న ప్రపంచంలో మనల్ని ఊరించే ప్రలోభాలు ఎన్నో ఉంటాయి. వాటిని తట్టుకోవాలంటే జీవిత పరమార్థాన్ని తెలుసుకోవాలి. దాని కోసం భగవంతుడి మీద అచంచలమైన భక్తి కావాలి. ఎక్కువమందిలో దేవుడి పట్ల భక్తి కన్నా... ఇలా చేస్తే దేవుడు ఏ శిక్ష విధిస్తాడో అనే భయమే ఎక్కువగా ఉంటుంది. కానీ దేవుడు మన తప్పొప్పుల పట్టిక రాసే గుమాస్తా కాదు. మనం ఎప్పుడు తప్పు చేస్తామా? ఎలాంటి శిక్ష వేయాలా? అని కాచుకొని కూర్చోడు. మనం పొరపాట్లు చేసినా ఆయన మన్నిస్తాడు. ఆయన మీదే మన మనస్సు లగ్నమైతే... మన లోపాలను సరిదిద్దుతాడు. పాఠాలు నేర్పుతాడు. అనుక్షణం భగవన్నామస్మరణ చేస్తూ, దైవ చింతనలో ఉండేవారికి సన్మార్గాన్ని చూపిస్తాడు.

పిచ్చుక-సముద్రుడు కథ

గట్టి సంకల్పం ఉంటే సాధించలేనిది లేదని, అలాంటివారికి సాయం చెయ్యడానికి దేవుడు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాడనీ పెద్దలు చెబుతారు. దానికి ఈ కథ ఉదాహరణ.

పూర్వం ఒక పిచ్చుక సముద్ర తీరంలో గుడ్లు పెట్టింది. సముద్రుడు తన కెరటాలతో ఆ గుడ్లను లోపలికి లాక్కుపోయాడు. ఆవేదన చెందిన పిచ్చుక... తన గుడ్లను తిరిగి ఇవ్వాలని సముద్రుణ్ణి కోరింది. కానీ సముద్రుడు అంగీకరించలేదు. దాంతో కడలిలో నీరు లేకుండా చేయాలని పిచ్చుక నిశ్చయించుకుంది. తన ముక్కుతో



నీటిని పీల్చి దూరంగా పొయ్యడం మొదలుపెట్టింది. ఆ సమాచారం లోకం అంతటికీ తెలిసింది. అసాధ్యమైన పని చేయాలని పంతం పట్టిన ఆ పిచ్చుక పిచ్చిదని జీవరాశులన్నీ నవ్వుకున్నాయి. మహా విష్ణువు వాహనమైన పక్షిరాజు గరుత్మంతుడు ఈ సంగతి విన్నాడు. పిచ్చుక బాధ, అది చేస్తున్న పనిలోని దృఢసంకల్పం ఆయనకు అర్థమయ్యాయి. వెంటనే ఆ సముద్ర తీరానికి చేరుకున్నాడు. పిచ్చుకకు దాని గుడ్లను తిరిగి ఇవ్వకపోతే... పిచ్చుక చేసే పని తను చేయాల్సి వస్తుందని హెచ్చరించాడు. గరుత్మంతుడి శక్తి ఎంతటిదో బాగా తెలిసిన సముద్రుడు భయపడిపోయాడు. ఆయనకు దండం పెట్టి, పిచ్చుకకు దాని గుడ్లను తిరిగి ఇచ్చేశాడు.

ఇదొక గొప్ప అవకాశం

ఆధ్యాత్మికంగా కొన్ని విషయాలు అసాధ్యమైనవని అనిపించవచ్చు. కానీ ప్రయత్నం ప్రారంభిస్తే... భగవదనుగ్రహంతో కాలక్రమేణా అవి సానుకూలమవుతాయి. కాబట్టి ఆ దిశగా పయనించడానికి కొత్త సంవత్సర ఆరంభాన్ని ఒక గొప్ప అవకాశంగా భావించాలి. "చేయవలసింది చేయండి, వాటి నుంచి ప్రతిఫలాన్ని ఆశించకండి, అన్నీ నాకు వదిలిపెట్టండి, మిమ్మల్ని నేను కాపాడతాను" అన్నాడు 'భగవద్గీత'లో శ్రీకృష్ణపరమాత్మ. కాబట్టి భారాన్ని భగవంతుడిపైనే వేసి... మంచి పనులే చేస్తామనీ, ఇతరులకు హాని కలిగించబోమనీ సంకల్పం తీసుకోవాలి. మంచి పనులు చేయాలంటే మంచి ఆలోచనలు ఉండాలి. ఎవరినీ ద్వేషించకూడదు, ఎవరిపట్లా అసూయ చెందకూడదు. సహానుభూతి, కృతజ్ఞత, దయ, పరోపకారం... ఇవన్నీ దైవీ గుణాలు. ఈ గుణాలు దేవుడికి ప్రీతి కలిగిస్తాయి. కనుక ఆ లక్షణాలను జీవితంలో భాగం చేసుకోవాలి. వీలైనప్పుడల్లా దైవ మందిరాలను సందర్శించాలి. దేవుడిపై విశ్వాసాన్ని మరింత బలపరుచుకోవాలి. తోటివారికి, ప్రధానంగా పేదసాదలకు సాయం చేయాలి. మంచి ఆధ్యాత్మిక గ్రంథాలను చదివి, వాటి సారాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. సద్గురువులను ఆశ్రయించాలి, వారి బోధలు వినాలి. రోజువారీ కార్యకలాపాల్లో ఉత్తమమైన అలవాట్లను భాగం చేసుకోవాలి. యోగ, ధ్యానం మనిషిని ఆధ్యాత్మికంగా బలోపేతం చేస్తాయి. శరీరాన్ని, మనసును నిర్మలంగా మార్చుకోవడానికి దోహదం చేస్తాయి. ఇలాంటి విషయాల్లో సంకల్పాలు చేసుకొని... జీవిత సాఫల్యం కోసం ఆధ్యాత్మిక ప్రయాణానికి నూతన సంవత్సరంలో కొత్తగా శ్రీకారం చుడదాం.

సద్బోధ

దృశ్యం ఒకటే... దృష్టే వేరు



అది సూర్యోదయ సమయం. వాతావరణం నిర్మలంగా ఉంది. ఒక పర్వతం పైభాగంలో సాధువు ఒకరు ఏకాంతంగా, ప్రశాంతంగా... కళ్ళు మూసుకొని నిలబడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు ఆ సాధువును చూశారు. ఆయన గురించి వారిలో ఒక్కొక్కరికీ ఒక్కొక్క అభిప్రాయం కలిగింది.

మొదటి వ్యక్తి "ఆ సాధువు నాకు బాగా తెలుసు. ఎప్పుడైనా అతని ఆవుల్లో ఒకటి తప్పిపోతే... దాన్ని వెతుకుతూ అటూ ఇటూ వెళ్తాడు. ఎక్కడో ఒక చోట ఇలా నిలబడి చూస్తూ ఉంటాడు" అన్నాడు.

రెండో వ్యక్తి "అదేం కాదు! ఆయన ఆవుకోసం వెతుకుతున్నట్టు కనిపించడం లేదు. తన మిత్రుడి కోసం, తోటి సాధువు కోసం ఎదురుచూస్తున్నట్టున్నాడు. ఇద్దరూ కలిసి ఉదయం కాలినడకకు వెళ్తారేమో!" అన్నాడు.

"ఆయనను చూస్తూ ఉంటే తప్పిపోయిన ఆవు కోసం వెతుకుతున్నట్టు కానీ, ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్టు కానీ లేదు. ప్రార్థనో, ధ్యానమో చేస్తున్నట్టున్నాడు. అటూ ఇటూ చూడడం లేదు. కళ్ళు మూసుకొని నిశ్చలంగా ఉన్నాడు" అన్నాడు మూడో వ్యక్తి.

అసలు విషయం సాధువునే అడిగి తెలుసుకుందామని వారు అనుకున్నారు. నేరుగా ఆయన దగ్గరకు వెళ్ళి "అయ్యా! మీరు ఈ వేళలో ఇక్కడ ఎందుకిలా నిలబడ్డారు? ఏం చేస్తున్నారు? దయచేసి చెప్పండి" అని అడిగారు. సాధువు సమాధానం ఇవ్వలేదు.

అప్పుడు మొదటి వ్యక్తి "మీరు తప్పిపోయిన మీ ఆవు కోసం వెతుకుతున్నారు కదూ!" అన్నాడు.

"నాకు 'నాది' అనేది ఏదీ లేదు. ఇక ఆవు తప్పిపోవడం, దానికోసం వెతుకుతూ ఉండడం ఎలా సంభవం?" అన్నాడు సాధువు.

"మీరు రోజూ వాహ్యాళికి కలిసి వెళ్ళే మీ తోటి సాధువు కోసం ఎదురు చూస్తున్నారు కదా?" అని అడిగాడు రెండో వ్యక్తి.

"నాకు మిత్రులు కానీ, శత్రువులు కానీ ఎవరూ, ఎప్పుడూ లేరు. నేను రోజూ వాహ్యాళికి ఒంటరిగానే వెళతాను" అని చెప్పాడు సాధువు.

అప్పుడు మూడో వ్యక్తి "నేను అనుకున్నదే సరైన కారణం అనిపిస్తోంది. మీరు ప్రార్థన చేస్తున్నారు, అవునా?" అన్నాడు.

"అలాంటిదేం లేదు. ప్రార్థన ఎవరికి చెయ్యాలో, ఎలా చెయ్యాలో నాకు అస్సలు తెలీదు" అని బదులిచ్చాడు సాధువు.

"మరి ఇక్కడ మీరేం చేస్తున్నారు?" అని ఆ ముగ్గురూ ఒకేసారి ప్రశ్నించారు.

నేను ఊరకే నిలబడి ఉన్నానంతే. ఏదీ చేయడం లేదు, దేన్నీ చూడడం లేదు అన్నాడు సాధువు.

ఆ ముగ్గురు వ్యక్తులు చూసిన దృశ్యం ఒకటే కానీ ఒక్కొక్కరి అభిప్రాయం ఒక్కోలా ఉంది. అలాగే సత్యం ఒక్కటే. ఒక్కొక్కరు ఒక్కో విధంగా వీక్షిస్తారు, బోధిస్తారు. అందుకే 'ఏకం సత్ విప్రా బహుధా వదన్తి' అన్నారు పూర్వులు. మనకు ఉన్న అభిప్రాయంతో దేన్ని చూసినా... దాని అసలైన స్వరూపాన్ని మనం గ్రహించలేం. మనకు గోచరించేది పాక్షికమైన సత్యమే కాని పూర్ణ సత్యం కాదు, మూల సత్యం కాదు. ఎలాంటి అభిప్రాయాలు, ఆలోచనలు, ఆశయాలు, ఆశలు లేనప్పుడే... సత్యం తాలూకు అసలైన స్వరూపం అవగతం అవుతుంది.

• రాచమడుగు శ్రీనివాసులు

చింతన

హింస పుట్టేది అక్కడే...

వేలాది సంవత్సరాల మానవ నాగరికత మనిషిలోని పశుత్వాన్ని కాస్తయినా అదుపులోకి తేలేకపోయింది. దారుణమైన హత్యలు, ఆత్మహత్యలు, మానభంగాలు... ద్వేషంతో మనిషిని చంపి ముక్కలు ముక్కలుగా ఖండించే హంతకులు, అమాయక ప్రజలను తమ పశుత్వానికి బలి తీసుకొనే శత్రు సైన్యాలు... ఇలా ప్రపంచంలో ప్రతి చోటా హింస, దాని ప్రతిరూపమైన



కోపం తాండవిస్తున్నాయి. ఈ రెండూ నిత్యజీవితంలో మనకు వివిధ రూపాల్లో తారసిల్లుతాయి. ఈ విషయంలో రాతియుగం నాటి మనుషులకు, ఈనాటి మనుషులకు మధ్య ఏమాత్రం భేదం లేదు. వృద్ధిలోకి వస్తున్న ఎదుటివాణ్ణి చూసినప్పుడు మనిషిలో పుట్టే అసూయ... హింసకు ఒక రూపం. తనను ఇతరులతో పోల్చుకొని... తనలో లేమిని గుర్తించినప్పుడు మనసులో ఏర్పడే అసంతృప్తి, ఇతరుల స్థాయిని అందుకోవడానికి పడే శ్రమ, వాళ్ళతో పడే పోటీ, వాళ్ళను మించిపోవాలనే పట్టుదల... ఇవన్నీ హింస ప్రతిరూపాలే. తమ అభిప్రాయం చెల్లుబాటు కోసం చేసే వాదోపవాదాల్లో హింస ఉంటుంది. పనుల ఒత్తిడి వల్ల మనం ఇతరులను నిరాకరించడానికి ఉపయోగించే పదాల్లో, ప్రదర్శించే భంగిమలలో కూడా హింస ప్రచ్ఛన్నంగా ఉంటుంది. "అంతా పిల్లల మేలు కోసమే అనే ఆదర్శవంతులైన తల్లితండ్రుల పెంపకంలో ఎంతో హింస ఉంటుంది. తల్లితండ్రులు పిల్లల జీవితాలను నాశనం చేస్తారు" అని జిడ్డు కృష్ణమూర్తి ఆరోపిస్తారు. "హింస మన నిత్య జీవితంలో, మన సంబంధ బాంధవ్యాల్లో సర్వత్రా ఉంది. ఈ దైనందిన హింసల బృహత్ స్వరూపమే దేశాల మధ్య ఏర్పడే యుద్ధాలు" అనేది కృష్ణమూర్తి ప్రతిపాదన. హింస నైజాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోకుండా... ప్రపంచ శాంతికోసం పడే ప్రయాస విఫలమై తీరుతుంది.

హింస పుట్టుపూర్వోత్తరాలు

జిడ్డు కృష్ణమూర్తి సిద్ధాంతం ప్రకారం... వేలాది ఏళ్ళ నుంచి మన సమాజ నిర్మాణం విభజన మీద ఆధారపడి ఉంది. జాతీయ, ప్రాంతీ, మత, రాజకీయ, కుల, ఆర్థిక భేదాలు మనుషుల్ని విభజిస్తాయి. మనం తోటి మనిషిలో అతడి జాతీయతను, ప్రాంతీయతను, అతని రాజకీయ పార్టీని, కులాన్ని, అతను తినే ఆహారాన్ని చూస్తాం. ఈ విభజనల వల్ల మన మనసులో ఎదుటి వ్యక్తి పట్ల ఒక ఫొటో లాంటి అభిప్రాయ చిత్రం ఏర్పడుతుంది. మనం ఎదుటివాడిలో ఈ అభిప్రాయ చిత్రాన్నే చూస్తాం కానీ అసలు మనిషిని చూడం. ఇది ఇంకొక విధమైన విభజన. సజీవమైన మనిషి నిరంతరం మారుతూ ఉంటాడు. మన మనస్సులో ఉన్న అభిప్రాయ చిత్రం నిర్జీవమైనది. ఈ రెండిటికీ మధ్య ఉండే భేదం ఆశాభంగానికి, ఘర్షణకు, చివరకు హింసకు దారి తీస్తుంది. తమ పిల్లల తెలివితేటలమీద అచంచలమైన నమ్మకం ఉన్న తల్లితండ్రులు, వారి ఆశలను భంగపరిచే పిల్లలు... మనం తరచుగా వినే వార్తల్లో ఆత్మహత్యలు. అంతేకాదు, "మన మనసు స్వరూపంలో కూడా నిరంతరం 'నేను-నువ్వు', 'నేను-ఇతరులు', 'నేను-బహిః ప్రపంచం' అనే ద్వైతం, విభజన ప్రచ్ఛన్నంగా ఉంటుంది. ఎక్కడ విభజన ఉంటుందో అక్కడ హింస ఉండి తీరుతుంది" అని కృష్ణమూర్తి నొక్కి చెప్పారు.

> భారతీయ తత్త్వశాస్త్రానికి 'దర్శనం' అని పేరు. అంటే సత్యాన్వేషణలో ఆలోచనకన్నా చూడడానికి, అంటే దర్శించడానికి తత్త్వశాస్త్రం ఎక్కువ విలువ ఇచ్చింది.

ఆలోచన... దర్శనం

హింసను తిరస్కరించి, అహింసను ఒక నైతిక విలువగా, ఒక ఆధ్యాత్మిక సాధనగా నిత్య జీవితంలో అనుసరించడం నిరర్థకం. వివిధ మతాలే కాకుండా అనేక రకాల జనాలు కూడా అహింసను ఆరాధిస్తాయి, కానీ మనుషులను ఏమాత్రం మార్చలేకపోయాయి. ఇవన్నీ హింసను, దాని పుట్టుకను సమగ్రంగా అర్థం చేసుకొనే బదులు... ఏదో ఒక కోణం లోంచి ఒక భాగాన్ని మాత్రమే చూస్తాయి. లేదా దాన్ని అణగదొక్కే ప్రయత్నం చేస్తాయి. అందువల్ల విఫలమవుతాయి. "మనలో ఉండే విభజనల వల్ల జన్మిస్తున్న హింసను సమర్థించకుండా, గర్హించకుండా... పదదాలలాంటి మన అనుభవాలను, సిద్ధాంతాలను, నియమాలను, అభిప్రాయ చిత్రాలను... అంటే ఆలోచనలను, అసలు ఆలోచించే ప్రక్రియను సంపూర్ణంగా పక్కకు తోసేసి... హింసను ప్రత్యక్షంగా చూడగలమా?' అన్నదే ప్రశ్న. అటువంటి దృష్టికి ఉండే శక్తి వల్ల మనం హింసను అధిగమించగలుగుతాం" అంటారు కృష్ణమూర్తి. అంటే హింసను అధిగమించడం ఒక దర్శించే ప్రక్రియ. భారతీయ తత్త్వశాస్త్రానికి 'దర్శనం' అని పేరు. అంటే సత్యాన్వేషణలో ఆలోచనకన్నా చూడడానికి, అంటే దర్శించడానికి తత్త్వశాస్త్రం ఎక్కువ విలువ ఇచ్చింది. 'దర్శనం' అనే సంస్కృత పదంతో యూరోపియన్ భాషల్లోని 'థియరీ' (నిర్వచనం), 'థియేటర్' (నాటక రంగస్థలం) ముడిపడి ఉన్నాయి. ఈ రెండు పదాలకు 'దర్శనం, చూడడం' అని అర్థం. జిడ్డు కృష్ణమూర్తి సిద్ధాంతంలో 'చూచుట' అంటే 'దర్శించుట' అనేది ఒక కీలకమైన ప్రక్రియ

- గుంటూరు వనమాలి www.gunturu.de

(డిసెంబర్ 29న హైదరాబాద్‌లోని ఐఎఎస్ ఆఫీసర్స్ ఇనిస్టిట్యూట్‌లో గుంటూరు వనమాలి రచించిన 'నేను నా గురువు - అనుభవాల సుడిగుండంలో భగవంతుడి ప్రతిబింబం' అనే పుస్తకావిష్కరణ జరుగుతుంది)

గీతాసారం

మరణం ఒక భ్రమ

య ఏనం వేత్తి హంతారమ్ యశ్చైనం మన్యతే హతం
ఉభౌ తౌ న విజానీతో, నాయం హంతి, న హన్యతే...
న జాయతే, మ్రియతే వా కదాచి... న్నాయం భూత్వా భవితా వా న భూయః
అజో నిత్య శ్శాశ్వతోయం పురాణో... న హన్యతే హన్యమానే శరీరే...



భగవద్గీతలోని రెండవ అధ్యాయమైన 'సాంఖ్యయోగం'లోని ఈ శ్లోకాల్లో ఆత్మ గురించి శ్రీకృష్ణుడు వివరించాడు. "ఆత్మ దేన్నీ చంపదు, దేనివల్లా మరణించదు. అజ్ఞానులు మాత్రమే అందుకు భిన్నంగా ఆలోచిస్తారు. ఆత్మ పుట్టుకలేనిది, శాశ్వతమైనది, మార్పులేనిది, పురాతనమైనది. మనం చిరిగిపోయిన, పాతవి అయిన వస్త్రాలను వదిలేసి, కొత్తవి ధరించినట్టే... భౌతిక దేహాలను ఆత్మ మారుస్తుంది" అని ఆయన చెప్పాడు.

సాంకేతిక భాషలో దీన్ని 'శక్తి పరిరక్షణ సూత్రం' (లా ఆఫ్ కన్సర్వేషన్ ఆఫ్ ఎనర్జీ), ద్రవ్యరాశి, శక్తి తాలూకు 'పరస్పర మార్పిడి సూత్రం' (ప్రిన్సిపల్ ఆఫ్ ఇంటర్-కన్వర్టబిలిటీ ఆఫ్ మాస్ అండ్ ఎనర్జీ)ల ద్వారా బాగా అర్థం చేసుకోవచ్చు. ఆత్మను శక్తితో పోల్చి పరిశీలించినప్పుడు... శ్రీకృష్ణ భగవానుడి మాటలు మరింత స్పష్టమవుతాయి. శక్తి పరిరక్షణ సూత్రం ప్రకారం... శక్తిని సృష్టించలేం. నాశనం చేయలేం. కానీ ఒక రూపం నుంచి మరొక రూపానికి మార్చగలం. ఉదాహరణకు ఉష్ణ శక్తి కేంద్రాలు (థర్మల్ పవర్ స్టేషన్లు) ఉష్ణ శక్తిని విద్యుత్ శక్తిగా మారుస్తాయి. ఒక బల్బు విద్యుత్ శక్తిని కాంతిగా మారుస్తుంది. కాబట్టి అక్కడ కేవలం శక్తి మార్పిడి చెందుతోంది తప్ప నాశనం కావడం లేదు. బల్బు జీవితకాలం పరిమితం. అది కాలిపోతే కొత్త బల్బును పెడతాం. కానీ విద్యుత్ అలాగే ఉంటుంది. ఇది జీర్ణమైన వస్త్రాలను విడిచిపెట్టి, కొత్తవాటిని తొడుక్కోవడం లాంటిది.

మనకు మరణం ఒక అనుమానం మాత్రమే తప్ప అనుభవం కాదు. అంటే ఇతరులు చనిపోవడం చూసినప్పుడు... మనందరం కూడా ఏదో ఒక రోజు మరణిస్తామని అనుమానిస్తాం. చావు గురించి మనకు తెలిసింది, మనం అర్థం చేసుకున్నది... దేహం కదలకపోవడం, ఇంద్రియాలు పనిచేయకపోవడం మాత్రమే. మన భౌతిక మరణం గురించి తెలుసుకొనే అవకాశం కానీ, దాన్ని అనుభూతి చెందే మార్గం కానీ మనకు తెలీదు. మనందరికీ మరణం తథ్యమని అనుకుంటాం. మన జీవితాలు మరణం చుట్టూ, దానికి సంబంధించిన భయాల చుట్టూ తిరుగుతాయి. అయితే "ఏదైనా సాధ్యమే కానీ మరణం సాధ్యం కాదు. ఎందుకంటే అది ఒక భ్రమ" అంటాడు శ్రీకృష్ణుడు. వస్త్రాలు చిరిగిపోయినప్పుడు అవి మనల్ని పరిసరాల నుంచి రక్షించలేవు. అందుకే కొత్తవాటిని వేసుకుంటాం. అలాగే మన భౌతిక దేహం దాని ధర్మాలను నిర్వహించలేనప్పుడు... మార్పునకు గురవుతుంది.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సమాచారం



చతురాయతన సహిత శత చండీయాగం

తెలంగాణలోని యాదాద్రి జిల్లాలోని కొలనుపాక గ్రామంలో దేశీయ గోవుల సంరక్షణ కోసం కృషి చేస్తున్న శ్రీ మాతా పితృ గోక్షేత్రంలో 'చతురానన సహిత శత చండీ యాగం' వచ్చేనెల (జనవరి) ఎనిమిది నుంచి 12వ తేదీ వరకు జరుగుతుంది. ఈ యాగాన్ని హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి ప్రారంభిస్తారు. ప్రతిరోజూ ఉదయం గోపూజ, వేదస్వస్తితో మొదలయ్యే కార్యక్రమాలు రాత్రి వరకూ జరుగుతాయి. రెండో రోజైన 9వ తేదీన శ్రీలక్ష్మీనారసింహ, సుదర్శన హోమం, పవమాన హోమం నిర్వహిస్తారు. కాకినాడ శ్రీపీఠానికి చెందిన శ్రీ పరిపూర్ణానందస్వామి అనుగ్రహభాషణం చేస్తారు. మూడోరోజైన 10వ తేదీన అరుణ హోమం జరుగుతుంది. ఆదిలాబాద్ శ్రీ గోపాలకృష్ణ మఠానికి చెందిన యోగానంద సరస్వతి స్వామీజీ అనుగ్రహభాషణం చేస్తారు. నాలుగో రోజైన 11వ తేదీన రుద్ర హోమాన్ని నిర్వహిస్తారు. చివరిరోజైన 12వ తేదీన పూర్ణాహుతి తదితరాలతో ముగిసే కార్యక్రమానికి తెలంగాణ ముఖ్య కార్యదర్శి ఎం.శాంతికుమారి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. వీటితోపాటు నిత్యం శ్రీగోపాలకృష్ణస్వామికి అభిషేకాలు, శ్రీలలితాదేవి లక్ష కుంకుమార్చన లాంటి కార్యక్రమాలు ఉంటాయి. ఈ యాగానికి పులి సీతారామశర్మ ఆధ్వర్యం వహిస్తారు. యాగంలో పాల్గొనాలనుకొనేవారు 7569634125 ఫోన్‌నెంబర్‌లో నిర్వాహకులను సంప్రదించవచ్చు.

వ్యక్తిత్వ వికాసమార్గం... భక్తి

వికాసం

మానవ ప్రయత్నంతోపాటు దైవానుగ్రహం కూడా కలిసివస్తేనే మనుషులు ఏదైనా సాధించగలరు. దేవాలయాలు భక్తి, వైరాగ్య భావనలకు ప్రతీకలు. శ్రీకృష్ణ దేవరాయల అష్టదిగ్గజాలలో ధూర్జటి ఒక ప్రధాన కవి. ఆయన 'శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం', 'శ్రీకాళహస్తీశ్వర శతకం' అనే రెండు మహోన్నత రచనలు చేశాడు. శివనామ స్మరణ వల్లనే సర్వం స్వాధీనమవుతాయని నమ్మిన భక్త మహాకవి ధూర్జటి. భక్తిమార్గం ద్వారా వ్యక్తిత్వ వికాసం కూడా సాధ్యమవుతుందని అతను విశ్వసించాడు.

యోగ పంచాక్షరి

'నమఃశ్శివాయ'... ఇది పంచాక్షరి మంత్రంగా ప్రసిద్ధి చెందింది. జల, వాయు, శబ్ద కాలుష్యాల మాదిరిగానే... కన్ను, చెవి, నాలుక, ముక్కు, చర్మం ద్వారా హానికరమైనవి కొన్ని లోపలికి ప్రవేశించి, మనసు కలుషితమవుతుంది. ఏకాగ్రతకు భంగం కలుగుతుంది. ఇటువంటి సందర్భాలలో ఇంద్రియ కాలుష్యానికి విరుగుడుగా... శివ పంచాక్షరిని 'యోగ పంచాక్షరి'గా రమణ మహర్షి ప్రతిపాదించారు. అంటే ఇంద్రియాలను జయించినవారికి పరమేశ్వరునితో అనుసంధాన యోగం సిద్ధిస్తుంది. కాబట్టే శివ పంచాక్షరిని యోగ పంచాక్షరిగా సూత్రీకరించారు. మరొక విరుగుడు శివానందలహరి. ఎంతో ఏకాగ్రతను సాధించగలిగే మధుర, మనోహర శివస్తుతే కాకుండా... ఇది పరమ శివుడి జటాఝూటం పైనుంచి భక్తుల హృదయ సరోవరానికి చేరే గంగానది.



బలి వృత్తాంతం

ఈ లోకంలో ఎవరూ శాశ్వతంగా ఉండిపోరు. సంపదలు, పదవులు శాశ్వతం కాదు. దురాశ వదిలి, ఉన్నదానితో సంతృప్తి చెంది... కీర్తి ప్రతిష్ఠలు పెంచుకోవాలి. శక్తిమేరకు దానధర్మాలు చేయాలి. రాక్షస రాజైన బలి చక్రవర్తి పూర్వం నర్మదానదీ తీరంలోని భృగుకచ్ఛం అనే ప్రాంతంలో తపస్సు చేస్తూ ఉండగా... అది తెలుసుకున్న వామనుడు ఆ ప్రదేశానికి వెళ్ళాడు. దివ్యమైన తేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ వామన బ్రహ్మచారికి బలి చక్రవర్తి ఎంతో వినయ విధేయతలతో స్వాగతం పలికాడు. సముచితమైన ఆసనం మీద కూర్చోబెట్టి "ఏం కావాలో కోరుకోండి. దానంగా ఇస్తాను" అని చెప్పాడు. దానికి సమాధానంగా వామనుడు మూడు అడుగుల నేలను మాత్రమే దానంగా ఇమ్మని కోరుకున్నాడు. తాను తలచుకుంటే ఈ భూమండలాన్నే దానంగా ఇవ్వగలననని బలి చక్రవర్తి చెప్పగా... వామనుడు మందహాస వదనంతో తాను నిలవడానికి మూడు అడుగుల నేల చాలు, అదే ఇవ్వాలని అడిగాడు. చేసేదే లేక "సరే" అని బలిచక్రవర్తి వాగ్దానం చేశాడు. దానవ గురువైన శుక్రాచార్యుడు ఇదంతా గ్రహించి, బలిచక్రవర్తిని వద్దని వారించాడు. తను చేసిన వాగ్దానాన్ని ప్రాణం పోయినా తప్పనని చెప్పి... భూమిని దానం చెయ్యడానికి బలి సంసిద్ధుడయ్యాడు. ఆ వెంటనే వామనుడు త్రివిక్రముడిగా భూమండలం అంతా వ్యాపించి ఒక పాదం మోపాడు. రెండో పాదంతో స్వర్గమంతా ఆక్రమించాడు. మూడో పాదాన్ని బలి చక్రవర్తి తలపై పెట్టి అణగదొక్కాడు. కాబట్టి శక్తిని మించి ఏ పనీ చేయరాదని దీని ద్వారా మనకు తెలుస్తోంది.

శరణాగతితో దైవానుగ్రహం

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, సత్యహరిశ్చంద్రుడు, హనుమంతుడు, శిబి చక్రవర్తి, బలి చక్రవర్తి... వీరి జీవితాలు మనకు ఆదర్శప్రాయమే కాదు వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదం చేస్తాయి. భగవద్గీత కూడా ఒక వ్యక్తిత్వ వికాస శిక్షణ గ్రంథం. అలాగే 1893 సెప్టెంబరులో షికాగో నగరంలో వివేకానందుడు చేసిన ఉపన్యాసం భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక చింతనకు దర్పణంగా నిలిచింది. జాతి మొత్తాన్ని ఉత్తేజపరచిన చారిత్రాత్మక మహోపన్యాసంగా చెరగని ముద్ర వేసింది. గజేంద్రుడి మొర ఆలకించి... మహా విష్ణువు వైకుంఠం నుంచి తరలి వచ్చి, మొసలిని మట్టుపెట్టిన సందర్భం ద్వారా, శరణాగతి కోరిన ద్రౌపదిని శ్రీకృష్ణ భగవానుడు రక్షించిన సంఘటన ద్వారా దైవానుగ్రహం ఎంతటిదో నిరూపితమవుతోంది. మనల్ని అన్ని రకాల కష్టాలనుంచి రక్షించే దైవం ఉన్నాడనే భావన, నమ్మకం, మన పనిలో నిబద్ధత, దురాశ లేకుండా ఉండడం... ఇవన్నీ మనకు ఎంతో ధైర్యాన్ని కలుగజేస్తాయి. కష్టాలు ఎదురై, విపత్కర పరిస్థితిలో ఉన్నప్పుడు... దైవాన్ని శరణు వేడి ప్రార్థిస్తే... మనకు లభించే ధైర్యమే విజయానికి సోపానం. అదే మనకు శ్రీరామరక్ష.

• శ్రీగిరి గోపాలకృష్ణ

ముత్యాల ముగ్గు

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్,
జూబ్లీ హిల్స్,
హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com

15 చుక్కలు
వరుస వచ్చేవరకు
15x1x1



పూజారి విజయ, నల్లగొండ







వీడ్కోలు 2024

వంద కోట్ల వీరులు



ఈ ఏడాది ఎన్నో భారీ బడ్జెట్ చిత్రాలు.. మరెన్నో చిన్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి. వాటిలో అంచనాలను అందుకున్నవి కొన్ని. అంచనాలను తలకిందులు చేసినవి మరికొన్ని. ఏ అంచనాలు లేకుండా అనూహ్యంగా విజయం సాధించినవీ ఉన్నాయి. అలా ఈ ఏడాది రూ. వంద కోట్ల వసూళ్లు సాధించిన చిత్రాలివే.

పుష్ప 2: అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ తెరకెక్కించిన 'పుష్ప 2' ఈ నెల 5న విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం ఇప్పటికే రూ.1700 కోట్ల గ్రాస్ సాధించిందని నిర్మాతలు ప్రకటించారు. నార్త్‌లో ఈ సినిమా రూ.700 కోట్ల గ్రాస్ కలెక్షన్‌తో సరికొత్త రికార్డులు నెలకొల్పింది. లాంగ్‌రన్‌లో ఈ చిత్రం మొత్తం ఎన్ని కోట్ల కలెక్షన్లు సాధిస్తుందనేది తెలియాల్సి ఉంది.

కల్కి 2898 ఏ.డీ: ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ తెరకెక్కించిన ఈ ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రం జూన్ 27న విడుదలైంది. ఈ సినిమా రూ.1100 కోట్ల పైచిలుకు కలెక్షన్స్ సాధించింది. ఈ సినిమాతో వెయ్యి కోట్ల క్లబ్‌లోకి రెండు సార్లు(బాహుబలి 2, కల్కి 2898 ఏ.డీ) చేరిన తొలి దక్షిణాది హీరోగా ప్రభాస్ నిలిచారు.



దేవర: ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ సినిమా సెప్టెంబరు 27న విడుదలైంది. ఇందులో దేవర, వరగా రెండు పాత్రల్లో అభిమానులను ఆకట్టుకున్నారు ఎన్టీఆర్. ఈ సినిమా దాదాపు రూ.450 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. ఈ సినిమాకూ కొనసాగింపుగా పార్ట్ 2 ఉంటుందని టాక్.



హను-మాన్: తేజసజ్జా, అమృతఅయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.300 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. ఈ దర్శకుడి సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది మొదటి చిత్రం. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'జై హనుమాన్' చిత్రం ఉంటుందని ప్రకటించారు.

గుంటూరు కారం: మహేశ్‌బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత దాదాపు 15 ఏళ్లకు వచ్చిన మూడో చిత్రం 'గుంటూరు కారం'. భారీ బడ్జెట్‌తో సంక్రాంతికి రిలీజైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర దాదాపు రూ.180 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. మహేశ్, త్రివిక్రమ్ కాంబో నుంచి ఎటువంటి ఎంటర్టైన్‌మెంట్‌ను ఆశిస్తారో సరిగ్గా అలాంటి వినోదాన్నే పంచిన ఈ చిత్రం, మహేశ్ అభిమానులను ఖుషీ చేసింది.

టిల్లు స్క్వేర్: 'డీజే టిల్లు'కి కొనసాగింపుగా వచ్చిన రెండో భాగం 'టిల్లు స్క్వేర్'. సిద్ధు జొన్నలగడ్డ మార్క్ డైలాగ్స్, మేనరిజమ్స్‌తో పాటు అనుపమ గ్లామర్ ఈ సినిమాకు స్పెషల్ అస్సెట్‌గా నిలిచాయి. ఈ సినిమా దాదాపు రూ.100 కోట్ల గ్రాస్ సాధించింది.

సరిపోదా శనివారం: నాని, ప్రియాంక మోహన్ జంటగా వివేక్ ఆత్రేయ తెరకెక్కించిన ఈ చిత్రం ఆగస్టు 29న విడుదలైంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.100 కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించింది.

తమిళ చిత్రాలు



గోట్: తమిళ నటుడు విజయ్ నటించిన ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదలైంది. వెంకట్ ప్రభు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.460 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. విజయ్ ఇందులో డ్యూయెల్ రోల్‌లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

అమరన్: శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కించిన చిత్రం 'అమరన్'. మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబరు 31న విడుదలైంది. సూపర్ హిట్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం దాదాపు రూ.320 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది.

వేట్టయాన్: రజనీకాంత్ కథానాయకుడిగా టీజే.జ్ఞానవేల్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబరు 10న విడుదలైంది. అమితాబ్ బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా దాదాపు రూ.240 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది.

మహారాజ: విజయ్‌సేతుపతి నటించిన ఈ చిత్రం జూన్ 13న విడుదలైంది. ఇటీవలే చైనాలోనూ విడుదలైన ఈ సినిమా దాదాపు రూ.190 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది.

కెప్టెన్ మిల్లర్.. రాయన్: ధనుశ్ నటించిన కెప్టెన్ మిల్లర్ జనవరి 12న తమిళనాట విడుదలై దాదాపు రూ.100 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. అరుణ్ మాథేశ్వరన్ ఈ పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌కు దర్శకత్వం వహించారు. 1930లో బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన ఓ తెగకు నాయకుడిగా ధనుశ్ ఇందులో నటించారు. వంద కోట్ల క్లబ్‌లోకి చేరిన మరో ధనుశ్ చిత్రం 'రాయన్'. ఆయన స్వీయ దర్శకత్వంలో జూలై 26న విడుదలైన ఈ చిత్రం దాదాపు రూ.150 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇది ధనుశ్‌కు 50వ చిత్రం కావడం విశేషం.

అరణ్మనై 4: సుందర్.సి దర్శకత్వంలో తమన్నా భాటియా, రాశీ ఖన్నా నటించిన ఈ చిత్రం మే 3న విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద ఈ హారర్ సినిమా దాదాపు రూ.100 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది.

మలయాళ చిత్రాలు

మంజుమ్మెల్ బాయ్స్: ఈ సినిమా మలయాళ బాక్సాఫీస్ వద్ద రూ.200 కోట్లు కలెక్ట్ చేసిన మొట్టమొదటి చిత్రంగా నిలిచి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ సినిమా దాదాపు రూ.240 కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసింది.

ద గోట్ లైఫ్: పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన సర్వైవల్ థ్రిల్లర్ 'ద గోట్ లైఫ్-ఆడు జీవితం'. మార్చి 28న విడుదలైన ఈ చిత్రానికి బ్లెస్సీ దర్శకత్వం వహించారు. 2008లో రచయిత బెన్యామిన్ రచించిన మలయాళ బెస్ట్ సెల్లర్ 'ఆడుజీవితం' పుస్తకం ఆధారంగా ఈ సినిమాని తెరకెక్కించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.150 కోట్ల గ్రాస్‌ను రాబట్టింది.

ప్రేమలు: గిరీశ్ ఏ.డీ దర్శకత్వంలో నెస్లెన్.కె.గఫూర్, మమితా బైజు నటించిన రొమాంటిక్ కామెడీ 'ప్రేమలు'. ఫిబ్రవరి 9న విడుదలైన ఈ చిత్రం సూపర్‌హిట్ టాక్‌ను తెచ్చుకుని దాదాపు రూ.130 కోట్ల గ్రాస్ వసూళ్ల రాబట్టింది.

సంక్రాంతి కోసం వెంకీ పాట



వెంకటేశ్, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్ నటిస్తున్న ట్రయాంగులర్ క్రైమ్ కామెడీ 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన రెండు పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అయితే, ఈ సినిమాకు ప్రధానాకర్షణగా ఉండే ఓ పాటను వెంకటేశ్ పాడుతున్నారు. సంక్రాంతి స్పెషల్‌గా ఈ పాట ఉండనుందట. వచ్చే ఏడాది జనవరి 14న చిత్రం విడుదల కానుంది. కాగా, వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో ఇది వరకు వచ్చిన 'ఎఫ్ 2'.. 'ఎఫ్ 3' చిత్రాలు మంచి విజయం సాధించాయి.

రొమాంటిక్ కామెడీ



సుహాస్, మాళవిక మనోజ్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఓ భామా అయ్యో రామ'. అలీ, బబ్లు పృథ్వీరాజ్, ప్రభాస్ శ్రీను, అనిత హస్సనందిని కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామ్ గోదాల దర్శకత్వంలో హరీశ్ నల్ల నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో లీడ్ పెయిర్ సుహాస్, మాళవిక మనోజ్ మధ్య నున్న కెమిస్ట్రీ, విజువల్స్, సంభాషణలు ఆకట్టుకున్నాయి. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: భవిన్ ఎమ్.షా, సినిమాటోగ్రాఫర్: ఎస్.మణికందన్, సంగీతం: రధన్.

కుటుంబ చిత్రం



రామ్‌కిరణ్, మేఘ ఆకాశ్ జంటగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'సఃకుటుంబానాం'. రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, సత్య, శుభలేఖ సుధాకర్, నవీన్.జీ.పీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఉదయ్‌శర్మ దర్శకత్వంలో మహాదేవ గౌడ, హెచ్.నాగరత్న నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'అది దా సారు' అనే పాటని ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు విడుదల చేశారు. అనంత్ శ్రీరామ్ రచించిన ఈ గీతానికి మణిశర్మ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: శశాంక్ మాలి, డీఓపీ: మధు దాసరి.

విడుదలకు సిద్ధం



'జనతా గ్యారేజ్' చిత్రంతో తెలుగులోనూ గుర్తింపు తెచ్చుకున్నారు మలయాళ నటుడు ఉన్ని ముకుందన్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మార్కో'. యుక్తి తరేజా, కబీర్ దుహన్ సింగ్ కీలక పాత్రలు పోషించారు. హనీఫ్ అదేని దర్శకత్వంలో షరీఫ్ మహమ్మద్ నిర్మించారు. ఇటీవలే మలయాళంలో విడుదలైన ఈ చిత్రం హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సినిమా తెలుగులోనూ విడుదలకు సిద్ధమైంది. వచ్చే ఏడాది, జనవరి 1నసినిమాను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఓ పోస్టర్ ద్వారా ప్రకటించారు.

పవర్‌ఫుల్ రోల్‌లో...



ఆది సాయికుమార్ యుగంధర్ ముని దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'శంబాల'. అర్చన అయ్యర్ కథానాయిక. భారీ బడ్జెట్‌తో రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఎవరూ టచ్ చేయని పాయింట్, కథతో ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో శిక్షణ పొందిన యుగంధర్ ముని అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఆది పవర్‌ఫుల్ రోల్ పోషిస్తున్నట్టుగా కనిపిస్తోంది.

పాటలు ప్రత్యేకాకర్షణగా



పృథ్వీ ప్రవీణ్, వైష్ణవి, యాశిక ప్రధాన పాత్రల్లో వై.రమణా రెడ్డి, మధుసూదన్, ఈశ్వర్ నిర్మిస్తున్న చిత్రం 'మహిషా'. ప్రవీణ్ కె.వి. దర్శకుడు. ఈ చిత్రం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు, హీరో ప్రవీణ్ మాట్లాడుతూ 'సినిమా బాగా వచ్చింది. నటుడిగా, దర్శకుడిగా ఈ చిత్రం నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది. తప్పకుండా అందరూ సపోర్ట్ చేయాలని కోరుతున్నా' అని అన్నారు. నిర్మాత మధుసూదన్‌రావు మాట్లాడుతూ 'ఈ చిత్రంలో పాటలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. గోవాలో తీసిన సాంగ్ హైలెట్‌గా నిలుస్తుంది' అని అన్నారు.

నాలుగు పాత్రల మధ్య



పూర్ణ ప్రధాన పాత్రలో నటించగా జి.ఆర్.ఆదిత్య దర్శకత్వంలో సురేశ్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రం 'డార్క్ నైట్'. పూర్ణ సరసన త్రిగుణ్(ఆదిత్ అరుణ్) నటించారు. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్మాత సురేశ్ రెడ్డి మాట్లాడుతూ 'పూర్ణ నటన ఈ సినిమాకు హైలెట్‌గా నిలుస్తుంది. ఎమోషనల్‌గా సాగే థ్రిల్లర్ కథతో నిర్మించాం. రచయిత, దర్శకుడు జి.ఆర్.ఆదిత్య నాలుగు ప్రధాన పాత్రల మధ్య సంక్లిష్టంగా అల్లిన భావోద్వేగాలతో ఉత్కంఠభరితమైన కథనాన్ని అందించారు. సినిమా ఆద్యంతం ప్రేక్షకులకు ఉత్కంఠ కలిగించేలా సన్నివేశాలు ఉంటాయి' అని తెలిపారు.

స్పోర్ట్స్

వరంగల్ ● శుక్రవారం 27 డిసెంబరు 2024

ఖలిస్థాన్ వాదులను అడ్డుకున్న ఫ్యాన్స్

బాక్సింగ్ డే టెస్ట్ సందర్భంగా మైదానంలోనే కాదు.. బయట కూడా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. జాతీయ జెండాను అవమానిస్తున్న ఖలిస్థాన్ మద్దతుదార్లతో దేశ అభిమానులు ఘర్షణకు దిగారు. అయితే, పోలీసులు అడ్డుకొని ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపేశారు. స్టేడియం బయట కొందరు ఖలిస్థానీ జెండాలు పట్టుకొని భారత్‌ను కించపరిచే విధంగా మైక్‌లో మాట్లాడుతూ మీడియా దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు.



కోహ్లీ x కాన్‌స్టాస్
విరాట్‌కు జరిమానా

అరంగేట్రం ఆటగాడు కాన్‌స్టాస్‌ను కవ్వించే ప్రయత్నం చేసిన కోహ్లీపై ఐసీసీ క్రమశిక్షణ చర్యలు తీసుకొంది. అతడి మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా జోడించింది. ఇన్నింగ్స్ 10వ ఓవర్ ముగిశాక బంతి తీసుకొని కోహ్లీ మరో ఎండ్‌కు వస్తున్నాడు. మరోవైపు నాన్‌స్ట్రయికర్‌తో మాట్లాడేందుకు కాన్‌స్టాస్ కూడా ముందుకు వెళ్తున్నాడు. ఈ సమయంలో విరాట్ భుజం కాన్‌స్టాస్‌కు తగిలింది. అయితే, కోహ్లీ చర్యను తప్పుబట్టిన మ్యాచ్ రెఫరీ లెవల్-1 ఉల్లంఘన కింద అతడిపై జరిమానా విధించాడు. ఆసీస్ మాజీ ఆటగాళ్లు కూడా కోహ్లీ తీరును తప్పుబట్టారు. విరాట్ ఉద్దేశపూర్వకంగానే వచ్చి తగిలినట్టుగా వీడియోలో కనిపిస్తోందని పాంటింగ్ అన్నాడు. కింగ్ లాంటి కోహ్లీ.. 19 ఏళ్ల పిల్లాడితో ఇలా వ్యవహరించడం సబబు కాదని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ వ్యాఖ్యానించాడు.





ఆసీస్ ఆడేసుకుంది



కాన్‌స్టాస్ (60)

టాప్-4 బ్యాటర్ల హాఫ్ సెంచరీలు
ఆకట్టుకున్న టీనేజర్ కాన్‌స్టాస్
తొలి ఇన్నింగ్స్ 311/6
బాక్సింగ్ డే టెస్టు

మెల్‌బోర్న్: బాక్సింగ్ డే టెస్టును ఆతిథ్య ఆస్ట్రేలియా ఘనంగా ఆరంభించింది. సిరీస్‌లో ఇప్పటిదాకా అంతగా ప్రభావం చూపని టాపార్డర్ మెల్‌బోర్న్ మైదానంలో కలిసికట్టుగా కదం తొక్కింది. లబుషేన్ (72), స్మిత్ (68 బ్యాటింగ్), అరంగేట్ర టీనేజర్ కాన్‌స్టాస్ (60), ఖవాజా (57) ఇలా తొలి నలుగురు బ్యాటర్లు అర్ధసెంచరీలతో బ్యాట్లు ఝుళిపించారు. దీంతో గురువారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 6 వికెట్లకు 311 పరుగులు సాధించింది. క్రీజులో స్మిత్‌తో పాటు కమిన్స్ (8 బ్యాటింగ్) ఉన్నాడు. బుమ్రాకు మూడు వికెట్లు దక్కాయి. ఇక రెండో రోజు శుక్రవారం ఆటలో జోరు మీదున్న స్మిత్‌ను ఆరంభంలోనే కట్టడి చేయడంతో పాటు మిగతా వికెట్లను కూడా వేగంగా తీయాల్సి ఉంటుంది. లేకుంటే ఆసీస్ భారీ స్కోరును అడ్డుకోవడం కష్టమే.

కాన్‌స్టాస్ కేక..

19 ఏళ్లకే టెస్టు జట్టులో చోటు దక్కించుకున్న ఓపెనర్ సామ్ కాన్‌స్టాస్ అరంగేట్రం మ్యాచ్‌లో అదరగొట్టాడు. భారత బౌలర్లను దీటుగా ఎదుర్కోగలడా? అనే సందేహాలు వ్యక్తమైనా.. బరిలోకి దిగాక అతడి జోరును చూసి క్రికెట్ పండితులే ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. అపార అనుభవజ్ఞుడిలా అతడు ఆడిన షాట్లకు ఎంసీజీలో ప్రేక్షకులు ఫిదా అయ్యారు. తాజా సిరీస్‌లో భారత స్టార్ పేసర్ బుమ్రాను ఎదుర్కొనేందుకు ఆసీస్ బ్యాటర్లు అష్టకష్టాలు పడుతుండగా.. కాన్‌స్టాస్ మాత్రం అతడిని ఓ సాధారణ బౌలర్‌గా మార్చేశాడు. తాను ఎదుర్కొంటోంది ప్రపంచ అగ్రశ్రేణి బౌలర్ అనే ఒత్తిడి, జంకు ఏమాత్రం లేకుండా స్కూప్, రివర్స్ స్కూప్ షాట్లతో అతనాడిన తీరు భారత జట్టును షాక్‌కు గురిచేసింది. ఇంకా క్రీజులో కుదురుకోకముందే ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో అతడు ఇదే తరహాలో వికెట్ల వెనకాల 4,6,4 బాది అవాక్కయ్యేలా చేశాడు. బుమ్రా మరో ఓవర్‌లోనూ 4,6,4తో వేగంగా పరుగులను రాబట్టాడు. ఈజోరుతో కాన్‌స్టాస్ 52 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ జడేజా అతడి దూకుడును అడ్డుకోవడంతో తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. లంచ్ విరామానికి ఆసీస్ 112/1తో నిలిచింది.

బౌలర్ల కట్టడి

కొత్త బంతితో ప్రభావం చూపని భారత బౌలర్లు రెండో సెషన్‌లో మాత్రం కట్టడి చేయగలిగారు. అర్ధసెంచరీ పూర్తి చేశాక మరో ఓపెనర్ ఖవాజాను బుమ్రా అవుట్ చేశాడు. ఈ సెషన్‌లో ఆసీస్ కోల్పోయిన వికెట్ ఇదొక్కటే. లబుషేన్, స్మిత్ జాగ్రత్తగా ఆడడంతో ఈ సెషన్‌లో ఆసీస్ 23 ఓవర్లలో 64 పరుగులు మాత్రమే చేయగలిగింది. అయితే ఆఖరి సెషన్‌లో మాత్రం వికెట్లను పడగొట్టగలిగారు. స్మిత్, లబుషేన్ దీటుగా ఆడుతూ బౌలర్లను విసిగించారు. డ్రింక్స్ విరామం తర్వాత లబుషేన్ స్పిన్నర్ సుందర్ ఓవర్‌లో ఫ్రంట్‌ఫుట్ ఆడే ప్రయత్నంలో విరాట్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో మూడో వికెట్‌కు 83 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ప్రమాదకర హెడ్ (0)తో పాటు మార్ష్ (4)ను బుమ్రా వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో భారత శిబిరంలో జోష్ కనిపించింది. కానీ క్యారీ అండతో స్మిత్ చెలరేగాడు. ఈ జోడీ ఆరో వికెట్‌కు 53 రన్స్ జోడించింది. ఆట చివర్లో క్యారీని పేసర్ ఆకాశ్ అవుట్ చేశాడు.

గిల్‌ను అందుకే తప్పించాం..

శుభ్‌మన్ గిల్‌ను నాలుగో టెస్టులో ఆడించకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. అతడి స్థానంలో రెండో స్పిన్నర్‌గా సుందర్‌ను ఎంపిక చేశారు. గిల్‌పై వేటు విషయమై బ్యాటింగ్ కోచ్ అభిషేక్ నాయర్ స్పందించాడు. 'ఇక్కడి పిచ్‌ను పరిశీలిస్తే బంతి పాతదిగా మారాక సుందర్ వైవిధ్యమైన బౌలింగ్ ప్రయోజనకరంగా ఉంటుందని భావించాం. అందుకే జడ్డూతో కలిసి సుందర్‌ను ఆడించాలనుకున్నాం. ఇక రోహిత్ టాపార్డర్‌లో వస్తాడు' అని నాయర్ తెలిపాడు.


బుమ్రా (3 వికెట్లు)

1 భారత్‌పై టెస్టు అరంగేట్రంలోనే హాఫ్ సెంచరీ సాధించిన అతిపిన్న వయస్కుడి (19)గా కాన్‌స్టాస్. అలాగే ఈ ఫార్మాట్‌లో ఆసీస్ తరఫున 50+ స్కోరు సాధించిన రెండో పిన్న వయస్కుడిగా నిలిచాడు. ఇయాన్ క్రెయిగ్ (17) టాప్‌లో ఉన్నాడు.

4483 బుమ్రా ఓవర్‌లో ఓ బ్యాటర్ సిక్సర్ బాదక మూడేళ్లవుతోంది. తాజాగా బాక్సింగ్ డే టెస్టులో ఆ రికార్డును టీనేజర్ కాన్‌స్టాస్ బ్రేక్ చేశాడు. దీంతో సరిగ్గా బుమ్రా తన 4483 బంతుల తర్వాత టెస్టుల్లో సిక్సర్ సమర్పించుకోవడం గమనార్హం.

స్కోరుబోర్డు
ఆసీస్ తొలి ఇన్నింగ్స్: కాన్‌స్టాస్ (ఎల్బీ) జడేజా 60; ఖవాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 57; లబుషేన్ (సి) కోహ్లీ (బి) సుందర్ 72; స్మిత్ (బ్యాటింగ్) 68; హెడ్ (బి) బుమ్రా 0; మార్ష్ (సి) పంత్ (బి) బుమ్రా 4; క్యారీ (సి) పంత్ (బి) ఆకాశ్ 31; కమిన్స్ (బ్యాటింగ్) 8; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 86 ఓవర్లలో 311/6. వికెట్ల పతనం:** 1-89, 2-154, 3-237, 4-240, 5-246, 6-299; **బౌలింగ్:** బుమ్రా 21-7-75-3; సిరాజ్ 15-2-69-0; ఆకాశ్ 19-5-59-1; జడేజా 14-2-54-1; నితీశ్ 5-0-10-0; సుందర్ 12-2-37-1.


లబుషేన్ (72)

ముందుగా అనుకున్నదే..

'బుమ్రా ఓ దిగ్గజ బౌలర్. అతడిని దీటుగా ఎదుర్కొని ఒత్తిడిలో పడేయాలని భావించా. అందుకే ఆరంభంలోనే ర్యాంప్ షాట్లతో ఎదురుదాడికి దిగా. ఆ షాట్లే నా బలం. వాటి కోసం తీవ్రంగా సాధన చేశా. చివరికి అనుకున్నది సాధించా. కెప్టెన్ కమిన్స్ నా సహజశైలిలోనే ఆడాలని సూచించాడు'

- సామ్ కాన్‌స్టాస్

పాకిస్థాన్ 211 ఆలౌట్
దక్షిణాఫ్రికాతో మొదటి టెస్ట్

సెంచూరియన్ : పేసర్ డేన్ పాటర్సన్ (5/61) ఐదు వికెట్లతో చెలరేగడంతో దక్షిణాఫ్రికాతో గురువారం ప్రారంభమైన తొలి టెస్ట్‌లో పాకిస్థాన్ 211 పరుగులకే ఆలౌటైంది. కమ్రాన్ గులామ్ (54) రాణించాడు. మరో పేసర్ కార్బిన్ బాష్ (4/63) నాలుగు వికెట్లు సాధించాడు. అనంతరం దక్షిణాఫ్రికా ఆట ఆఖరికి మూడు వికెట్లకు 82 పరుగులు చేసింది. కాగా పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ క్రికెట్ మూడు ఫార్మాట్లలో నాలుగు వేలకుపైగా పరుగులు సాధించిన మూడో ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఈక్రమంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ సరసన చేరాడు

సెమీస్‌కు బెంగాల్

హైదరాబాద్: బెంగాల్ జట్టు సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన క్వార్టర్స్‌లో బెంగాల్ 3-1తో ఒడిశాను ఓడించింది. నరోహరి శ్రేష్ఠ (45వ), రోబీ హన్స్‌దా (77వ), మనోతోస్ మాజీ (90వ) నిమిషాల్లో గోల్స్ చేయగా.. ఒడిశా తరఫున రాకేస్ ఓరమ్ (25వ) ఏకైక గోల్ సాధించాడు.



కాలినడకన తిరుమలకు సింధు దంపతులు

తిరుమల (ఆంధ్రజ్యోతి): కొత్త జంట పీవీ సింధు, దత్తసాయి గురువారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. అలిపిరి మెట్ల మార్గంద్వారా వీరు కొండపైకి వెళ్లారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు.

భారత్ x వెస్టిండీస్
అమ్మాయిల మూడో వన్డే నేడు

ఉ. 9.30 నుంచి స్పోర్ట్స్ 18లో

వడోదర: తొలి రెండు వన్డేలలో వెస్టిండీస్‌ను చిత్తుచేసిన భారత అమ్మాయిలు మూడో వన్డేలోనూ నెగ్గి.. 3-0తో సిరీస్ సాధించాలని పట్టుదలతో ఉన్నారు. ఈ క్రమంలో వెస్టిండీస్‌తో శుక్రవారం జరిగే ఆఖరిపోరుకు భారత్ సిద్ధమైంది.

హైదరాబాద్‌కు మరో ఓటమి

అహ్మదాబాద్: విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్‌కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. గ్రూప్-సిలో గురువారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో సౌరాష్ట్ర చేతిలో చిత్తయింది. తొలుత హైదరాబాద్ 50 ఓవర్లలో 244/8 స్కోరు చేసింది. తిలక్ వర్మ (57), అవనీష్ (52) రాణించారు. అనంతరం సౌరాష్ట్ర 42.5 ఓవర్లలో 4 వికెట్లకు 248 రన్స్ చేసి గెలిచింది. హర్విక్ దేశాయ్ (125 నాటౌట్) సెంచరీతో అదరగొట్టాడు. ముంబైలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు సిక్కింపై 8 వికెట్ల తేడాతో నెగ్గింది. ఇక దేశవాళీ క్రికెట్‌లో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా యూపీ అండర్-23 జట్టు రికార్డులకెక్కింది. స్టేట్-ఎ వన్డే ట్రోఫీలో గురువారం జరిగిన మ్యాచ్‌లో విదర్భ నిర్దేశించిన 407 పరుగుల లక్ష్యాన్ని యూపీ 41.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

సెమీస్‌లో యూపీ, పట్నా

పుణె: ప్రో కబడ్డీ తాజా సీజన్ తుది అంకానికి వచ్చేసింది. సెమీఫైనల్లో తలపడే జట్లేవో తేలిపోయింది. శుక్రవారం జరిగే తొలి సెమీస్‌లో హరియాణా స్టీలర్స్‌-యూపీ యోధా, రెండో సెమీఫైనల్లో దబాంగ్ ఢిల్లీ కేసీ-పట్నా పైరేట్స్ ఢీకొంటాయి. గురువారం ఏకపక్షంగా జరిగిన ఎలిమినేటర్-1లో యూపీ యోధాస్ 46-18తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను చిత్తు చేసింది. భవానీ రాజ్‌పుత్ 12 పాయింట్లతో యూపీ విజయంలో కీలక భూమిక పోషించాడు. హితేష్ హై-5తో మెరిశాడు. ఎలిమినేటర్-2లో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్ 31-23తో యు ముంబాపై గెలుపొందింది.


యూపీ-జైపూర్ మ్యాచ్ దృశ్యం

సంస్కరణాద్యుడా.. సెలవిక..

బిజినెస్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపట్ల సంతాపం తెలిపిన పారిశ్రామిక ప్రముఖులు



మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల పలువురు పారిశ్రామిక ప్రముఖులు సంతాపం తెలిపారు. దేశంలో తొలి తరం ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, ఆధునిక ఆర్థిక భారత నిర్మాతగా మన్మోహన్ సింగ్‌ను కొనియాడారు.

భారత్ రూపు మార్చిన, ప్రపంచానికి మన తలుపులు తెరిచిన 1991 ఆర్థిక సంస్కరణల రూపకల్పనలో ఆయన పోషించిన కీలకపాత్రను చరిత్ర ఎప్పటికీ గౌరవిస్తుంది. మృదువుగా మాట్లాడినప్పటికీ తన చర్యల ద్వారా చిరస్మరణీయ పురోగతిని సాధించిన అరుదైన నాయకుడు ఆయన. నాయకత్వం, వినయం, దేశ సేవలో డాక్టర్ మన్మోహన్ సింగ్ జీవితం ఆదర్శదాయకం, భావితరాలకు స్ఫూర్తిదాయకం.

- గౌతమ్ అదానీ, అదానీ గ్రూప్ చైర్మన్

డాక్టర్ మన్మోహన్ సింగ్ నిజమైన రాజనీతిజ్ఞుడు. ఆర్థిక సంస్కరణల రూపశిల్పి. తన మేధస్సు, దయ, సమగ్రతతో భారత్‌ను ఆధునిక ఆర్థిక దేశంగా తీర్చిదిద్దారు. ఆయన మాటల కంటే చేతల్లో చూపించారు. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక.

- హర్ష్ గోయెంకా, ఆర్‌పీజీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్

డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు వీడ్కోలు. మీరు ఈ దేశాన్ని ప్రేమించారు. దేశానికి మీరు అందించిన సేవలు సుదీర్ఘకాలం గుర్తుండిపోతాయి.

- ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూప్ చైర్మన్

మన్మోహన్ సింగ్ వివేకవంతమైన ఆర్థికవేత్త, గొప్ప సమగ్రత కలిగిన వ్యక్తి. తన సంస్కరణలతో భారత్‌ను తిరిగి ప్రగతిబాట పట్టించినందుకు గాను మేమెప్పుడూ మీకు రుణపడి ఉంటాం.

- కిరణ్ మజుందార్ షా, బయోకాన్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్

మన్మోహన్ సింగ్ గొప్ప శ్రోత. ఆయన చాలా తక్కువగా మాట్లాడేవారు. కానీ, ఆయన మాట్లాడినప్పుడల్లా సారాంశం మాత్రమే మాట్లాడేవారు.

- దువ్వూరి సుబ్బారావు, ఆర్‌బీఐ మాజీ గవర్నర్

చిన్న షేరు.. తళుక్కు!



ఈ ఏడాది 28.45% పెరిగిన బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ

- మిడ్‌క్యాప్ ఇండెక్స్ 25.61% అప్
- వచ్చే ఏడాదీ కొనసాగనున్న జోరు!?

ఈ ఏడాదీ దలాల్ స్ట్రీట్‌లో చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లే తళుక్కుమన్నాయి. ప్రధాన కంపెనీల స్టాక్స్ కంటే ఆకర్షణీయ ప్రతిఫలాలు పంచాయి. మార్కెట్లో ఆశావహ ట్రెండ్‌తో పాటు రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర గణనీయంగా పెరగడం ఇందుకు దోహదపడింది. 2024లో ఈక్విటీ సూచీలు వరుస రికార్డుల మోత మోగించాయి. మ్యూచువల్ ఫండ్ల ద్వారా, ముఖ్యంగా క్రమానుగత పెట్టుబడుల (సిప్) రూపంలో మార్కెట్లోకి ద్రవ్య ప్రవాహం భారీగా పెరగడంతోపాటు బలమైన ఆర్థిక మూలాలు, విధానపరమైన సానుకూలత తోడ్పడ్డాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రభుత్వ విధానపరమైన చర్యలు, సానుకూల పరిస్థితులతో లబ్ధి పొందిన రియల్టీ, మౌలికం, హెల్త్‌కేర్, పునరుత్పాదక ఇంధనం రంగాలు మెరుగైన పనితీరు కనబరచడం ఈ ఏడాది స్మాల్, మిడ్ క్యాప్ సూచీల వృద్ధికి ప్రధానంగా దోహదపడ్డాయని మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ డైరెక్టర్ ఆరోరా చోప్రా అన్నారు. దేశంలో వినియోగం పుంజుకోవడంతో పాటు సాంకేతిక పురోగతి, ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) వంటి పథకాలతో చిన్న కంపెనీల పనితీరు మెరుగైందన్నారు.

వచ్చే ఏడాదిలోనూ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ స్టాక్స్ హవా కొనసాగనుందని వారు భావిస్తున్నారు. దేశీయంగా బలమైన వినియోగం, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం భారీగా వెచ్చిస్తుండటం ఇందుకు కలిసిరానున్నాయని వారు అభిప్రాయపడ్డారు. అయితే, స్మాల్, మిడ్‌క్యాప్ విభాగాల్లో ఇప్పటికే చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతుండటంతో పాటు కొన్ని రంగాల వృద్ధి మందగించిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెట్టుబడుల విషయంలో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆకర్షణీయ ధరకు లభిస్తున్న నాణ్యమైన స్టాక్స్‌ను ఎంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో మెరుగైన ప్రతిఫలాలు అందుకునే వీలుంటుందన్నారు.

- ఈ ఏడాదిలో ఇప్పటివరకు (ఈ నెల 23 నాటికి) బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 12,144.15 పాయింట్లు (28.45 శాతం) వృద్ధి చెందగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 9,435.09 పాయింట్లు (25.61 శాతం) ఎగబాకింది. కాగా, ప్రధాన కంపెనీల ప్రాతినిధ్య సూచీ బీఎస్ఈ సెన్సెక్స్ మాత్రం 6,299.91 పాయింట్లు (8.72 శాతం) పెరిగింది.
- ఈ నెల 12న స్మాల్‌క్యాప్ సూచీ 57,827.69 పాయింట్ల వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేయగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ సెప్టెంబరు 24న 49,701.15 వద్ద ఆల్‌టైం గరిష్ఠాన్ని రికార్డు చేసింది. కాగా, సెన్సెక్స్ రికార్డు గరిష్ఠం సెప్టెంబరు 27న 85,978.25 వద్ద నమోదైంది.
- 2023లో సెన్సెక్స్ 11,399.52 పాయింట్లు (18.73 శాతం) వృద్ధి చెందగా.. స్మాల్‌క్యాప్ సూచీ 13,746.97 పాయింట్లు (47.52 శాతం), మిడ్‌క్యాప్ 11,524.72 పాయింట్లు (45.52 శాతం) ఎగబాకాయి.
- 2022లో మాత్రం స్మాల్‌క్యాప్ 1.80 శాతం, మిడ్‌క్యాప్ 1.37 శాతం వృద్ధికి పరిమితం కాగా.. సెన్సెక్స్ 4.44 శాతం పెరిగింది.




2025లో రూ.2 లక్షల కోట్లపైనే!
ఐపీఓ ద్వారా నిధుల సమీకరణపై పాంటోమత్ గ్రూప్ అంచనా

అత్యధిక కంపెనీలు పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ)కు వస్తున్న దేశాల్లో భారత్‌దే అగ్రస్థానం. ఈ ఏడాది అమెరికాతో పోలిస్తే రెండింతలు, యూరప్ కంటే 2.5 రెట్లు కంపెనీలు భారత్‌లో పబ్లిక్ ఇష్యూకు వచ్చాయని పాంటోమత్ గ్రూప్ అధ్యయన నివేదిక వెల్లడించింది. ఈ ఏడాదిలో నవంబరుతో ముగిసిన 11 నెలల్లో 76 కంపెనీలు ఐపీఓల ద్వారా మొత్తం రూ.1.3 లక్షల కోట్లు సమీకరించాయి. వచ్చే ఏడాది ఐపీఓ నిధుల సమీకరణ రూ.2 లక్షల కోట్ల మైలురాయిని దాటవచ్చని పాంటోమత్ గ్రూప్ అంచనా వేసింది. వచ్చే ఏడాదిలో ఆఫర్‌ను ప్రారంభించేందుకు వీలుగా 34 కంపెనీలు ఇప్పటికే సెబీ అనుమతి పొందాయని.. వాటి మొత్తం నిధుల సమీకరణ లక్ష్యం రూ.41,462 కోట్లుగా ఉందని రిపోర్టులో వెల్లడించింది. మరో రూ.98,672 కోట్ల విలువైన 55 కంపెనీల ఐపీఓలు సెబీ అనుమతి కోసం వేచి చూస్తున్నాయని. వచ్చే ఏడాదిలో వీటికీ గ్రీన్‌సిగ్నల్ లభించే అవకాశాలున్నాయంది.

6 నెలలు.. రూ.21,367 కోట్లు

2024-25 ప్రథమార్ధంలో బ్యాంకుల్లో 8 రెట్లు పెరిగిన మోసాలు.. ఆర్‌బీఐ నివేదిక వెల్లడి

ముంబై: ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా బ్యాంకుల్లో మోసాలు మాత్రం తగ్గడం లేదు. ఏదోలా మాయ చేసి కేటుగాళ్లు దర్జాగా బ్యాంకుల నుంచి కోట్లకు కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలల్లోనే దేశంలోని బ్యాంకుల్లో 18,461 మోసపూరిత కేసులు నమోదయ్యాయి. ఈ మోసాలతో కొట్టేసిన సొమ్ము రూ.21,367 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం (2023 -24) ఇదే కాలంలో నమోదైన రూ.2,623 కోట్లతో పోలిస్తే ఇది ఎనిమిదింతలు ఎక్కువ. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గురువారం దీనికి సంబంధించి 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2023-24' పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది. ఈ మోసాలతో బ్యాంకింగ్ వ్యవస్థ పేరు ప్రతిష్ఠలతో పాటు నిర్వహణ, వ్యాపారపరమైన ఇబ్బందులు, వాటి ఆర్థిక స్థిరత్వం, ఖాతాదారుల నమ్మకానికి సవాల్‌గా మారాయని తెలిపింది.



పీఎస్‌బీల వాటానే ఎక్కువ

గత ఆర్థిక సంవత్సరం దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో నమోదైన ఇంటర్నెట్, కార్డు మోసాల్లో 67.1 శాతం ప్రైవేట్ బ్యాంకుల్లో నమోదయ్యాయని ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. అయితే నష్టపోయిన సొమ్ము పరంగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లే అత్యధికంగా నష్టపోయాయి. ఇటీవల కొన్ని డిజిటల్ లెండింగ్ సంస్థలు ఆర్‌బీఐ నియంత్రణలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థల అనుబంధ సంస్థలమని చెప్పుకుని మోసం చేయడమూ పెరిగిపోయిందని నివేదిక పేర్కొంది. దీంతో ఈ మోసాలకు చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ మోసాలకు పాల్పడే డిజిటల్ లెండింగ్ యాప్స్ పేర్ల తో ఒక జాబితా రూపొందించేందుకు సిద్ధమవుతోంది.

రూ.3.5 లక్షల కోట్ల నికర లాభాలు

మోసాలు పెరిగి పోతున్నా దేశంలోని వాణిజ్య బ్యాంకులు వరుసగా ఆరో సంవత్సరంలోనూ లాభాలు నమోదు చేయడం విశేషం. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో బ్యాంకులు రూ.3.5 లక్షల కోట్ల నికర లాభాలు నమోదు చేశాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే ఇది రూ.87,000 కోట్లు ఎక్కువ. మళ్లీ ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) వాటానే రూ.1.48 లక్షల కోట్లుగా ఉంది.

ఆరంభ లాభాలు ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం మిశ్రమంగా ముగిశాయి. మార్కెట్‌ను ముందుకు నడిపించే అంశాలేమీ లేకపోవడంతో పాటు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం ఇందుకు కారణమైంది. ప్రారంభ ట్రేడింగ్‌లో 425 పాయింట్ల వరకు ఎగిసిన సెన్సెక్స్.. తొలి గంటలోనే లాభాలను పూర్తిగా కోల్పోయింది. ఆ తర్వాత అతి స్వల్ప లాభ, నష్టాల మధ్య కదలాడిన సూచీ.. చివరికి 0.39 పాయింట్ల నష్టంతో 78,472.48 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 22.55 పాయింట్ల పెరుగుదలతో 23,750.20 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 నష్టపోయాయి. అందులో టైటాన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ఒక శాతానికి పైగా క్షీణించాయి. మార్కెట్ స్తబ్దుగా కొనసాగినప్పటికీ, అదానీ గ్రూప్‌లోని 10 కంపెనీల షేర్లు లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 5 శాతానికి పైగా పుంజుకుంది. బీఎస్ఈలోని స్మాల్ క్యాప్ సూచీ 0.24 శాతం తగ్గగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.11 శాతం పెరిగింది. రంగాలవారీ సూచీల్లో సర్వీసెస్ 1.80 శాతం ఎగబాకగా.. ఆటో 0.81 శాతం పెరిగింది. కమోడిటీ, ఇండస్ట్రియల్స్, టెలికాం, మెటల్, ఐటీ, బ్యాంకింగ్ సూచీలు మాత్రం నష్టపోయాయి.

అయ్యో.. రూపాయి!

భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 12 పైసలు క్షీణించి రూ.85.27 వద్ద ముగిసింది. రూపీ బలహీనపడటం వరుసగా ఇది మూడో రోజు. అంతర్జాతీయంగా డాలర్ మరింత బలపడటంతో పాటు బ్రెంట్ ముడిచమురు ధర మళ్లీ 74 డాలర్లకు ఎగబాకడం ఇందుకు ప్రధాన కారణాలు. అమెరికా కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ సుంకాల వడ్డన హెచ్చరికల నేపథ్యంలో దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరిగిందని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.ల్లో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,730 ▲	71,250 ▲	1,00,000 ▲
విజయవాడ	78,500 ▼	73,000 ▲	92,000 ▲
విశాఖపట్నం	76,890 ▲	70,480 ▲	89,740 ▲
రాజమండ్రి	77,730 ▲	71,250 ▲	90,500 ▲
ప్రొద్దుటూరు	78,500 ▲	72,690 ▲	90,500 ▲
ముంబై	76,336 ▲	69,924 ▲	88,040 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	103	విజయవాడ	109
వరంగల్	103	గుంటూరు	112
కరీంనగర్	103	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	96
కర్నూలు	103	నెల్లూరు	96
విశాఖపట్నం	108	అనంతపురం	96
గోదావరి	109		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ			
హైదరాబాద్	585	విజయవాడ	600
వరంగల్	587	గోదావరి	600
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	



మన్మోహన్ మరణంపై ప్రముఖుల సంతాప సందేశాలు

మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు. దేశ ఆర్థికవ్యవస్థను సంస్కరించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. దేశానికి ఆయన చేసిన సేవ, రాజకీయ జీవితం, వినయంతో కూడిన నడవడిక ఎప్పటికీ గుర్తుండిపోతాయి

- ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి

మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చారు. ఆర్థిక సరళీకరణ రూపశిల్పి. కఠిన నిర్ణయాలతో దేశం ముందుకు సాగేలా చేశారు.

- జగదీప్ ధన్‌ఖడ్, ఉపరాష్ట్రపతి

దేశంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మన్మోహన్ సింగ్ చిరస్మరణీయులు. ఆయన నిబద్ధత, క్రమశిక్షణ, నిరాడంబరత అందరికీ ఆదర్శం

- వెంకయ్య నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి

మన్మోహన్ సింగ్ నిజాయితీ మాకు నిరంతర స్ఫూర్తి. ప్రత్యర్థుల నుంచి వ్యక్తిగత దాడులు జరుగుతున్నా ఆయన దేశ సేవలో అంకితభావంతో నిమగ్నమయ్యారు.

- ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్ ఎంపీ

1991 నుంచి 2014 వరకు మన్మోహన్ సింగ్ చేసిన సేవలు దేశ చరిత్రలో స్వర్ణ యుగమే. ఆయన వినయవిధేయతలున్న వ్యక్తిని నేను ఇప్పటివరకు కలవలేదు. లభించిన విజయాలు తన వల్లే అని ఆయన ఏనాడూ చెప్పుకోలేదు

- చిదంబరం, మాజీ ఆర్థిక మంత్రి

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు, జ్ఞానం, వినయం, సమగ్రత మూర్తీభవించిన ఆయన గొప్ప మేధావి, రాజనీతిజ్ఞుడు.

- చంద్రబాబు, ఏపీ ముఖ్యమంత్రి



మన్మోహన్ సింగ్‌తో రేవంత్ రెడ్డి (ఫైల్)

దేశ నిజమైన వాస్తుశిల్పుల్లో ఒకరు: రేవంత్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిష్కళంకమైన పాలన, అత్యున్నత మానవతావాది అయిన మన్మోహన్ సింగ్ ఆధునిక భారతదేశానికి నిజమైన వాస్తుశిల్పుల్లో ఒకరని కొనియాడారు. దేశంలో ఆర్థిక సంస్కరణల అమలుతోపాటు దేశ అభివృద్ధికి ఆయన తీసుకున్న అనేక చారిత్రాత్మక నిర్ణయాలను చరిత్ర సదా గుర్తు పెట్టుకుంటుందని ఆయన అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టి గ్రామీణ పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. దూరదృష్టి గల నాయకుడు, ప్రఖ్యాత ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని మంత్రి సీతక్క అన్నారు. మన్మోహన్ సంస్కరణల రూపశిల్పి అని దేశాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించిన గొప్ప ఆర్థిక మేధావి అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

తెలంగాణకు సంపూర్ణ మద్దతు: కేసీఆర్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మన్మోహన్ సింగ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు. ఆధునిక భారతదేశ నిశ్శబ్ద వాస్తుశిల్పి మన్మోహన్ అని కేటీఆర్ కొనియాడారు.

ప్రతి పదవికీ వన్నె తెచ్చారు: కిషన్ రెడ్డి

మన్మోహన్‌సింగ్.. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ప్రణాళికా సంఘం సభ్యుడిగా, యూజీసీ చైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధానిగా చేసిన ప్రతి పదవికీ వన్నె తెచ్చారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, దేశ ఆర్థిక మంత్రిగా.. దేశంలో సంస్కరణలు తీసుకురావడంలో ఆయన పోషించిన పాత్రను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. దేశానికి మన్మోహన్ అందించిన సేవలు మరువలేనివని కేంద్రమంత్రి బండిసంజయ్ కొనియాడారు.

ప్రధానిగా అత్యున్నత సేవలు: నారాయణ

యూపీఏ హయాంలో పదేళ్ల పాటు మన్మోహన్ సింగ్ దేశానికి ప్రధానిగా అత్యున్నత సేవలు అందించారని సీపీఐ జాతీయ నేత కే.నారాయణ కొనియాడారు. కొల్లేరు ప్రక్షాళనపై పోరాడినందుకు తనను ఓసారి ఢిల్లీలో అభినందించారని, కాలుష్యంపై శ్రద్ధ చూపినందుకు ప్రత్యేకంగా ప్రశంసించారని ఆయన గుర్తుచేసుకున్నారు.

ఆర్థిక మార్గదర్శి

జననం 26-09-1932
మరణం 26-12- 2024

అస్తమయం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన్ను ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో వైద్యులు ఆయనను కాపాడడానికి ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని.. రాత్రి 9.51 గంటలకు ఆయన తుది శ్వాస విడిచారని ఎయిమ్స్ ఆస్పత్రి ఒక ప్రకటనలో వెల్లడించింది. మన్మోహన్‌సింగ్‌కు భార్య గురుశరణ్, ముగ్గురు కుమార్తెలు ఉపిందర్, అమృత్, దమన్ ఉన్నారు. మన్మోహన్‌ను ఆస్పత్రిలో చేర్పించారన్నవార్త తెలిసిన వెంటనే.. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఆ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ హుటాహుటిన ఎయిమ్స్‌కు చేరుకుని ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇక.. కర్ణాటకలోని బెలగావీలో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో పాల్గొన్న పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ.. మన్మోహన్ మరణవార్త తెలియగానే ఢిల్లీకి పయనమయ్యారు. ఆయన గౌరవార్థం.. పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సహా వచ్చే ఏడు రోజులపాటు నిర్వహించతలపెట్టిన అన్ని కార్యక్రమాలనూ రద్దు చేసుకుంటున్నట్టు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. 2025 జనవరి 3న పార్టీ కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమవుతాయని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు. అప్పటిదాకా పార్టీ జెండాను అవనతం చేస్తామని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాగా.. మన్మోహన్ సింగ్ పార్థివ దేహాన్ని గురువారం రాత్రే ఎయిమ్స్ ఆస్పత్రి నుంచి ఆయన నివాసానికి తరలించారు. మన్మోహన్ మృతిపట్ల సంతాపం తెలిపిన ప్రధాని మోదీ.. ఆయనకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆ ఏర్పాట్లపై చర్చించేందుకు కేంద్ర క్యాబినెట్ శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశం కానుంది. కాగా.. ఆయన గౌరవార్థం కేంద్రం ఏడురోజులు జాతీయ సంతాపదినాలుగా ప్రకటించింది.

మోహనా.. మోహనా..

నెహ్రూ అంతటి వ్యక్తే స్వయంగా పిలిచినా.. 'నేను పాఠాలు చెప్పుకొంటాను తప్ప, రాజకీయాల్లోకి రాను' అన్న మన్మోహన్.. ప్రస్తుత పాకిస్థాన్‌లోని గహ్‌లో 1932 సెప్టెంబరు 26న గురుముఖ్ సింగ్ కోహ్లీ, అమృత్‌కౌర్ దంపతులకు జన్మించారు. చిన్నవయసులోనే తల్లి చనిపోవడంతో.. మన్మోహన్ తన అమ్మమ్మ జమ్నాదేవి వద్దే పెరిగారు. చిన్నతనంలో అందరూ ఆయనను ముద్దుగా మోహనా.. మోహనా అని పిలిచేవారు. ఆయన పెరిగిన ఊళ్లో స్కూలు కూడా లేదు. రోజూ స్నేహితుడితో కలిసి 5 కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకున్నారు. పదో ఏడు వచ్చేదాకా ఆయన విద్యాభ్యాసం ఉర్దూ మాధ్యమంలోనే జరిగింది. అందుకే.. ఆయన జీవితమంతా తన హిందీ ప్రసంగాలను కూడా ఉర్దూలోనే రాసుకుని చదివేవారు (కొన్నికొన్నిసార్లు తన మాతృభాష అయిన పంజాబీలో రాయడానికి గురుముఖి లిపిని వాడేవారు). దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం పాకిస్థాన్ నుంచి ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ నగరానికి వచ్చింది. ఆ తర్వాత ఏడాదికే.. అంటే 1948లో అమృత్‌సర్‌కు వెళ్లి అక్కడ స్థిరపడింది. మన్మోహన్ అక్కడే హిందూ కాలేజీలో చేరారు. పంజాబ్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో డిగ్రీ (1952లో), పీజీ (1954లో) పూర్తి చేశారు. 1957లో కేంబ్రిడ్జి వర్సిటీలో ఆర్థికశాస్త్రంలో ఆనర్స్ పూర్తిచేశారు. పాఠశాల స్థాయి నుంచి కేంబ్రిడ్జి దాకా.. చదువులో ఆయన ఎప్పుడూ టాపరే. స్కాలర్‌షిప్స్‌తోనే ఆయన చదువులన్నీ సాగాయి. డాక్టరేట్ చేసిన తొలి భారత ప్రధాని కూడా ఆయనే. మానవ జీవితాలను రాజకీయాలు ఎలా ప్రభావితం చేస్తాయనే విషయాన్ని తాను కేంబ్రిడ్జి వర్సిటీలో ఉన్న రోజుల్లోనే తెలుసుకున్నానని మన్మోహన్ 2005లో ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. కేంబ్రిడ్జిలో ఉన్నత విద్య పూర్తిచేసుకున్న అనంతరం భారతదేశానికి తిరిగివచ్చిన ఆయన.. పంజాబ్ వర్సిటీలో విద్యార్థులకు పాఠాలు చెప్పారు. మళ్లీ 1960లో ఇంగ్లండ్‌కు వెళ్లి ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో డీఫిల్ చేశారు. 'ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ పెర్ఫార్మెన్స్, 1951-1960, ఎక్స్‌పోర్ట్ ప్రాస్పెక్ట్ అండ్ పాలసీ ఇంప్లికేషన్స్' అనే అంశంపై డాక్టొరల్ థీసిస్ రాశారు. దరిమిలా ఆ థీసిస్ ఆధారంగానే.. 'ఇండియాస్ ఎక్స్‌పోర్ట్ ట్రెండ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఫర్ సెల్ఫ్ సస్టెయిన్డ్ గ్రోత్' అనే పుస్తకం రాశారు. డీఫిల్ పూర్తయ్యాక మళ్లీ ఇండియాకు తిరిగొచ్చి పంజాబ్ వర్సిటీలో రీడర్‌గా పనిచేశారు. 1963 నుంచి 1965 దాకా ఆర్థిక శాస్త్ర ఆచార్యుడిగా వ్యవహరించారు. 1966 నుంచి 1969 దాకా 'యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్'కు పనిచేశారు. ఆర్థికవేత్తగా ఆయన ప్రతిభను గుర్తించిన అప్పటి కాంగ్రెస్ ఎంపీ లలిత్‌నారాయణ్ మిశ్రా.. ఆయన్ను విదేశీ వాణిజ్య శాఖలో సలహాదారుగా నియమించారు. బ్యూరోక్రాట్‌గా మన్మోహన్ ప్రస్థానం అలా ప్రారంభమైంది. 1969 నుంచి 1971 దాకా 'ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్'లో ప్రొఫెసర్‌గా అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించిన పాఠాలు బోధించారాయన.



మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం తదితరులతో మన్మోహన్

ప్రభుత్వంలోకి..

1972లో ఆర్థిక శాఖ ప్రధాన ఆర్థిక సలహాదారుగా.. 1976లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. 1980-1982 నడుమ ప్రణాళిక సంఘంలో పనిచేసిన మన్మోహన్‌ను.. 1982లో నాటి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా నియమించారు. 1985 దాకా ఆయన ఆ పదవిలో కొనసాగారు. 1985-87 నడుమ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1987 నుంచి 1990 దాకా జెనీవాలోని ఎకనమిక్ పాలసీ థింక్ ట్యాంక్ 'సౌత్ కమిషన్'కు సెక్రటరీ జనరల్‌గా వ్యవహరించారు. 1990 నవంబరులో భారత్‌కు తిరిగొచ్చి.. అప్పటి ప్రధాని చంద్రశేఖర్‌కు ఆర్థిక వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు. 1991లో ప్రభుత్వం ఆయన్ను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్‌గా నియమించింది. 1991 జూన్‌లో.. మైనారిటీ ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన నాటి ప్రధాని పీవీ నరసింహారావు దేశాన్ని సంస్కరణల పథంలో నడపాలంటే మన్మోహన్ వంటి ఆర్థికవేత్త అవసరమని భావించి ఆయనకు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు! తొలుత ఆ విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా మన్మోహన్‌కు పీవీ తెలియపరచగా.. ఆయన దాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. దాంతో పీవీ.. వెంటనే చక్కగా తయారై రాష్ట్రపతి భవన్‌కు రావాలంటూ మన్మోహన్‌ను ఆదేశించారు. అలా రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన మన్మోహన్‌తో మంత్రిగా ప్రమాణం చేయించి.. ఆర్థిక శాఖను అప్పజెప్పారు! ఆయన ఆర్థిక శాఖ పగ్గాలు చేపట్టేనాటికి మన దేశ ద్రవ్యలోటు జీడీపీలో 8.5 శాతానికి.. కరెంటు ఖాతా లోటు 3.5శాతానికి దగ్గర్లో ఉన్నాయి. మన విదేశీ మారక నిల్వలు కేవలం 2వారాల దిగుమతులకు సరిపడా మాత్రమే (దాదాపు 100 కోట్ల డాలర్లు) ఉన్నాయి!! అలాంటి ఆర్థిక వ్యవస్థను ఆయన.. ప్రధాని పీవీ సహకారంతో సంస్కరణల పథంలో నడిపించి గాడిన పెట్టారు. పర్మిట్‌రాజ్‌కు చుక్క పెట్టి.. ఆర్థికవ్యవస్థను సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ(ఎల్‌పీజీ) బాట పట్టించి దేశ ఆర్థిక ముఖచిత్రాన్నే మార్చేశారు. 2009లో ప్రధానిగా ఆయన తొలి పదవీకాలం పూర్తిచేసే సమయానికి మన విదేశీ మారక నిల్వలు ఏకంగా 600 బిలియన్ డాలర్లకు చేరాయంటే.. నాడు ఆర్థిక మంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలే అందుకు పునాదిరాళ్లనడంలో సందేహం లేదు.

డాక్టర్‌గా వద్దనుకొని.. ఆర్థికవేత్తగా మారి!

ప్రధానిగా, ఆర్థిక శాఖ మంత్రిగా దేశ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తెచ్చిన మన్మోహన్ సింగ్.. తొలుత తండ్రి కోరిక మేరకు డాక్టర్ కావాలని ప్రీ-మెడికల్ కోర్సులో చేరారు. అయితే ఆ తర్వాత కొద్ది రోజులకే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఈ విషయాన్ని మన్మోహన్ కూతురు దమన్ సింగ్ తన పుస్తకమైన 'స్ట్రిక్ట్లీ పర్సనల్: మన్మోహన్ అండ్ గురుశరణ్'లో వెల్లడించారు.



విద్యా సంస్థలకు నేడు సెలవు

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మన్మోహన్ సింగ్ మృతి నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సెలవు ప్రకటించింది. అలాగే వారం రోజులు సంతాప దినాలను పాటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రధానిగా..

అనూహ్య పరిస్థితుల్లో 2004 మే 22న ప్రధాన మంత్రిగా పగ్గాలు చేపట్టిన మన్మోహన్ సింగ్.. 2014 దాకా ఆ పదవిలో కొనసాగారు. ఆర్థిక మంత్రి హోదాలో కొనసాగించిన పాత ఒరవడినే అందిపుచ్చుకుని సంస్కరణల పథంలో ముందుకు సాగారు. దీంతో అనతికాలంలోనే మన ఆర్థిక వృద్ధిరేటు పెరగడం ప్రారంభించి.. 2007లో అత్యధికంగా 9% మైలురాయిని దాటింది. ఆయన హయాంలో వచ్చిన జాతీయ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం దేశచరిత్రలోనే కొత్త అధ్యాయలను లిఖించాయి! వాజపేయి హయాంలో ప్రారంభించిన స్వర్ణ చతుర్భుజి వంటి కార్యక్రమాలను మన్మోహన్ సర్కారు కొనసాగించడంతో అభివృద్ధి ఎక్కడా కుంటుపడలేదు. 2009లో ఆయన హయాంలోనే విద్యాహక్కుచట్టం అమల్లోకి వచ్చింది. ఏపీ (ఉమ్మడి), బిహార్, గుజరాత్, ఒడిశా, పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో 8 ఐఐటీ విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. అలా పదేళ్లపాటు ప్రధానిగా దేశాన్ని ప్రగతిపథంలో నడిపిన మన్మోహన్ సింగ్ పదవీకాలం 2014 మే 17న ముగిసింది. 1991 అక్టోబరు 1 నుంచి 2024 దాకా 33 ఏళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగిన ఆయన రాజకీయ ప్రస్థానం.. ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీతో ముగిసింది. దేశ తొలి సిక్కు ప్రధానిగా.. నెహ్రూ తర్వాత ఐదేళ్ల పదవీకాలం పూర్తయ్యాక మళ్లీ ప్రధాని పదవి చేపట్టిన తొలి నేతగా.. నెహ్రూ, ఇందిరాగాంధీ, మోదీ తర్వాత ఎక్కువకాలం ప్రధాని పదవిలో ఉన్న నాయకుడిగా.. ఎన్నో ఘనతలు సాధించిన ఆయన దేశ ప్రజల మనోయవనికలపై తనదైన చెరగని ముద్ర వేశారు!

కేంబ్రిడ్జ్‌లో తమాషా

కేంబ్రిడ్జిలో చదువుకునే రోజుల్లో కూడా మన్మోహన్ చాలా సిగ్గరిగా ఉండేవారు. అక్కడ ఉన్నతంకాలం ఆ చలిలో కూడా చన్నీళ్ల స్నానమే చేసేవాడినని ఆయన ఒకసారి బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. "సర్దార్జీని కావడంతో నాకు పొడవాటి జుట్టు ఉండేది. వేడినీళ్లు వస్తున్నప్పుడు అందరూ స్నానాలు చేసేవారు. నేను వారితో కలిసి స్నానం చేయడానికి మొహమాటపడేవాడిని. తలపాగా తీస్తే నా పొడవాటి జుట్టు చూసి హేళన చేస్తారని వాళ్లంతా వెళ్లాక చన్నీళ్లతోనే స్నానం ముగించేవాడిని" అని మన్మోహన్ చెప్పుకొన్నారు.

నిజాయతీకి నిలువెత్తురూపం

నిజాయతీకి, నిబద్ధతకు మన్మోహన్ నిలువెత్తు ప్రతిరూపం అంటారు ప్రముఖ రచయిత ఖుష్వంత్ సింగ్. "1999లో ఆయన ఒకేసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. ఎన్నికల్లో పోటీ అంటే మాటలు కాదు. అంతకాలంగా పెద్ద ఉద్యోగాల్లో ఉన్నా ఆయన వద్ద డబ్బు ఉండేది కాదు. ఎన్నికల ఖర్చు కోసం రెండు లక్షలు కావాలని అడిగారు. ఆయన అల్లుడికి ఇచ్చి డబ్బు పంపాను. ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. ఆ మరుసటి రోజే నాకు ఫోన్ చేసి మా ఇంటికి వచ్చారు. డబ్బు నా చేతిలో పెట్టి.. "ఖర్చు కాలేదు. అలానే ఉంది. తీసుకోండి.. థ్యాంక్స్" అని వెళ్లిపోయారు.. అలాంటి మనుషులు అరుదుగా ఉంటారు" అన్నారు ఖుష్వంత్ సింగ్.

మారుతి 800 రెండు ఫ్లాట్లు

దశాబ్దాల పాటు ప్రభుత్వ ఉన్నత ఉద్యోగిగా, ఆర్థిక మంత్రిగా, పదేళ్లు ప్రధానిగా ఉన్నా ఆయన సాదాసీదా జీవితం గడిపేందుకే ఇష్టపడేవారు. పాత మారుతి 800 కారు, ఢిల్లీ, చండీగఢ్‌లలో రెండు అపార్ట్‌మెంట్లు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డిపాజిట్లు.. ఇవే ఆయన సంపాదించుకున్న ఆస్తిపాస్తులు!



పరస్పరం గౌరవించుకుంటూ..

మన్మోహన్‌కు మొహం చాటేసిన అధికారులు

బెల్లం చుట్టూ ఈగలు.. అధికారంలో ఉన్న నేతల చుట్టూ అనుచరగణాలు మూగడం నిత్యసత్యం. అదే అధికారం పోయాక.. అప్పటిదాకా చుట్టూ తిరిగినవారే క్షణాల్లో ముఖం చాటేస్తారు. అంతకుముందు వరకూ సెల్యూట్ చేసినవారే.. ఎదురుపడినా చూసీచూడనట్టు వెళ్లిపోతుంటారు. మన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కూ అలాంటి అనుభవం ఒకటి ఎదురైంది. బొగ్గు కుంభకోణానికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొనే సమయంలో.. దానికి సంబంధించిన వివరాల కోసం ఆయన తన హయాంలో పీఎంవోలో పనిచేసిన ఓ కీలక అధికారికి ఫోన్ చేశారు. కానీ, సదరు అధికారి మన్మోహన్ సింగ్ ఫోన్‌కాల్‌కు స్పందించలేదు. పోనీ.. అప్పుడు ఆయన ఏదో బిజీగా ఉండి ఉంటాడని సరిపెట్టుకున్నా.. కనీసం తిరిగి కాల్ కూడా చేయలేదు. దీంతో మన్మోహన్ చాలా బాధపడ్డారు. తనను తాను రక్షించుకోవడానికే ఆ అధికారి మొహం చాటేశారని ఆయన భావించారు. ఇటువంటి సంఘటనలతో ఆయన మనోధైర్యం సడలిందని ఆయన సన్నిహితులు చెబుతారు.

తామరాకుపై నీటిబొట్టు..!

33 ఏళ్లపాటు మన్మోహన్ స్వచ్ఛ రాజకీయాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అనూహ్యంగా ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టినా.. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్నే మార్చేశారు! నాటి ప్రధాని పీవీ నరసింహారావు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ.. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న దేశాన్ని గాడిలో పెట్టారు! 'యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్' అని.. 'కీలుబొమ్మ' అని రకరకాలుగా విమర్శలు చేసినా పట్టించుకోకుండా.. ప్రధాన మంత్రిగా పదేళ్లపాటు దేశాన్ని సమర్థంగా నడిపించారు. ఆయనే మన్మోహన్‌సింగ్. దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడిగా పేరొందిన ఆయన.. 33 ఏళ్ల పాటు రాజకీయాల్లో ఉన్నారు. కానీ, ఏనాడూ ఆ బురదను అంటించుకోలేదు. తామరాకుపై నీటిబొట్టులా.. చాకచక్యంగా వ్యవహరించారు. ఆర్థిక మంత్రి, ప్రధాన మంత్రి, రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా.. ఇలా ఏ హోదాలో ఉన్నా తనదైన ముద్ర వేశారు. "1991 జూన్ 21న భారత ప్రధాని పీవీ నరసింహారావు నుంచి ఫోన్ వచ్చింది. మన్మోహన్‌జీ మీరెక్కడున్నారు? అని పీవీ అడిగారు. నేను యూజీసీలో ఉన్నానని చెప్పా. మీకు అలెగ్జాండర్ ఏమీ చెప్పలేదా? అని పీవీ అడిగారు. చెప్పారు కానీ, నేను సీరియస్‌గా తీసుకోలేదని అన్నాను. 'లేదు.. ఇది చాలా సీరియస్, మీరు ఇంటికి వెళ్లి డ్రెస్ చేసుకుని ప్రమాణ స్వీకారానికి రండి' అని పీవీ చెప్పారు" అని తాను ఆర్థిక మంత్రిని ఎలా అయ్యానన్న విషయాన్ని స్వయంగా మన్మోహన్ సింగే వెల్లడించారు. 2018 డిసెంబరులో తన పుస్తకం 'చేంజింగ్ ఇండియా' ఆవిష్కరణ సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. యూజీసీ ఛైర్మన్‌గా విధులు నిర్వహిస్తుండగా ప్రధాని పీవీ ఫోన్ చేయడంతో వెళ్లి కేంద్ర ఆర్థిక మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని మన్మోహన్ చెప్పగా.. సభలో నవ్వులు విరిశాయి. అలా 1991లో అనూహ్యంగా ఆర్థిక మంత్రి అయిన మన్మోహన్ ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌ను ఒప్పించి భారత్‌ను ఆర్థిక సుడిగుండం నుంచి బయటపడేశారు. పీవీ ఇచ్చిన మనోధైర్యం వల్లే తాను ఆర్థిక సంస్కరణలను విజయవంతంగా అమలు చేయగలిగానని వెల్లడించారు. భారత ప్రాధాన్యాలకు అనుగుణంగా సంస్కరణలను అమలు చేస్తామంటూ అప్పటి ఐఎంఎఫ్ ఎండీ మైకేల్ కాండెస్సస్‌కు పీవీ చెప్పారన్నారు.



అటల్‌తో అనుబంధం..

రాజీనామా.. తిరస్కరించిన పీవీ..

పీవీ హయాంలో స్టాక్ మార్కెట్ కుంభకోణంపై నివేదిక సమర్పిస్తూ మన్మోహన్ సింగ్ మొద్దు నిద్ర పోతున్నారని జేపీసీ వ్యాఖ్యానించింది. మనస్తాపం చెందిన ఆయన రాజీనామా చేశారు. కానీ, పీవీ దాన్ని ఆమోదించలేదు. పీవీకి,మన్మోహన్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలుండేవి. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశాల్లో మన్మోహన్‌పై ఎన్ని విమర్శలు వచ్చినా వాటికి పీవీనే స్వయంగా జవాబిచ్చేవారు.

అనూహ్యంగా ప్రధానిగా బాధ్యతలు..

2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు సోనియాగాంధీ అనూహ్యంగా ప్రధాని బాధ్యతలు మన్మోహన్ సింగ్‌కు అప్పగించారు. విదేశీయురాలనే పేరుతో శరద్ పవార్, ములాయంసింగ్ యాదవ్‌లు సోనియా నాయకత్వాన్ని వ్యతిరేకించడం, సోనియా ప్రధాని అయితే తాను గుండు కొట్టించుకుంటానని బీజేపీ నేత సుష్మా స్వరాజ్ హెచ్చరించడంతో ప్రధాని పదవిని స్వీకరించలేదు. పాలనాదక్షుడైన మన్మోహన్‌ను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టారు. మన్మోహన్ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలపై దృష్టి కేంద్రీకరిస్తే.. తెర వెనక కూటమి సర్కారు రాజకీయాలను సోనియా నిర్వహించారు. 2009లో యూపీఏ రెండోసారి గెలిచినప్పుడు కూడా ప్రధాని పదవి ఆశిస్తున్న ప్రణబ్ ముఖర్జీ, చిదంబరాన్ని పక్కనపెట్టిన సోనియా.. మరోసారి మన్మోహన్‌పైనే భరోసా ఉంచారు. ఆయన రెండోసారి ప్రధానిగా ఉన్న కాలంలో 2జీ స్పెక్ట్రమ్ వేలం, బొగ్గు గనుల వేలం తదితర నిర్ణయాల్లో కుంభకోణాలు జరిగాయి. అయితే అదే సమయంలో కుంభకోణాలకు పాల్పడిన మంత్రులు, అధికారులు జైలు పాలైనా మన్మోహన్ సింగ్‌పై ఎలాంటి మచ్చా పడలేదు. రాజకీయాల్లో ప్రవేశించాలని నిర్ణయం తీసుకున్నప్పటి నుంచీ ఆయన తాను చేరిన కాంగ్రెస్ పార్టీకి విధేయంగా పనిచేశారు. తనకంటూ సొంత రాజకీయ బృందాన్ని ఏర్పాటు చేసుకోలేదు. ఏనాడు ఆయన అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు రాలేదు. పార్టీ వ్యవహారాల్లో ఏనాడూ జోక్యం చేసుకోలేదు. సోనియా, ఆమె రాజకీయ బృందం ఓవైపు.. మన్మోహన్ మరోవైపు.. ఎవరి రంగంలో వారు బలంగా పనిచేసేవారు. అదే సమయంలో కేబినెట్ సమావేశాల్లో మన్మోహన్‌దే తుది నిర్ణయంలా ఉండేది. ఆయన్ను సోనియా ఎన్నడూ అగౌరవపరిచిన దాఖలాలు లేవు. అయితే కోర్ గ్రూప్ సమావేశాలు సోనియా నివాసంలో జరిగేవని, కొన్నిసార్లు మన్మోహన్ అభిప్రాయాలకు భిన్నంగా నిర్ణయాలు, నియామకాలు జరిగేవని, ఆయన అసంతృప్తిగా ఉండేవారని ఆయన మీడియా సలహాదారుగా పనిచేసిన సంజయ్ బారు తన పుస్తకం 'యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'లో రాశారు. కానీ, మన్మోహన్ అధికార ప్రతినిధి ఈ విషయాలను ఖండించారు.

నాకంటే మన్మోహనే మంచి ప్రధాని..

'నాకంటే మన్మోహన్ సింగ్ మంచి ప్రధాని అవుతారని నాకు తెలుసు. అందుకే నేను ఆ పదవి తీసుకోలేదు' అని సోనియా ఓ సందర్భంలో చెప్పారు. కాంగ్రెస్ 2014లో ఓడినప్పటికీ అందుకు మన్మోహన్‌ను ఎవరూ నిందించలేదు. ఆయన్ను కీలుబొమ్మ అని ప్రతిపక్షాలు అనేక సందర్భాల్లో ఆరోపించినా పట్టించుకోలేదు. చివరిసారిగా 2019లో రాజ్యసభకు ఎన్నికైనప్పటికీ అనారోగ్యం వల్ల ఎక్కువ రోజులు హాజరు కాలేకపోయారు. చక్రాల కుర్చీలో వచ్చి పార్లమెంటు ఓటింగ్‌లో పాల్గొనేవారు.



సోనియా, రాహుల్‌తో..



రాజ్యసభ సమావేశాలకు వీల్‌చైర్‌లో హాజరైన మన్మోహన్



భార్య,కుమార్తెతో మన్మోహన్

జీడీపీ వృద్ధిలో ఉరకలు

ఎల్పీజీ సంస్కరణలు సమర్థంగా అమలు

దివాలా స్థాయి నుంచి.. దేశాన్ని గట్టెక్కించిన ఆర్థికవేత్త

ప్రధానిగా తనదైన శైలిలో పథకాలు

ఆర్టీఐ, ఉపాధిహామీ, ఆహార భద్రత వంటి.. కీలకమైన చట్టాల అమలు



న్యూఢిల్లీ, డిసెంబరు 26: అనిశ్చితితో అతలాకుతలమై.. దివాలా అంచులకు చేరుకున్న భారత ఆర్థిక రంగానికి తన సంస్కరణలతో ఊతమిచ్చిన గొప్ప ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్.! పరిశ్రమల స్థాపనలో 'లైసెన్స్ రాజ్' సంస్కృతికి చరమగీతం పాడి.. సరళీకరణలతో పెట్టుబడులకు దోహదపడ్డ అపర చాణక్యుడాయన.! ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలతో భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మన్మోహన్ సేవలను ప్రపంచ దేశాలు ఇప్పటికీ గుర్తిస్తాయి.! 90లలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ(ఎల్పీజీ) సంస్కరణలతో.. భారత్‌ను ముందుకు తీసుకెళ్లిన మార్గదర్శకుడిగా ఆర్థికరంగంపై ఆయన చెరగని ముద్ర వేసుకున్నారు. అంతేనా.! ప్రధానిగా భారత స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి రేటును ఉరకలు పెట్టించారు. ఆయన హయాంలో చాలా సందర్భాల్లో జీడీపీ 7.7-8.5 వృద్ధిని నమోదు చేసుకోవడం గమనార్హం.!

1991 వరకు నెలకొన్న అతలాకుతల పరిస్థితులతో స్వతంత్ర భారతదేశంలో తీవ్ర సంక్షోభంతో.. అత్యంత గడ్డు కాలం ఎదురైంది. దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల కోసం ఆందోళనలు.. అయోధ్య వివాదం, బాబ్రీ మసీదు కూల్చివేత, తదనంతర మతోన్మాద అల్లర్లు.. కశ్మీర్ లోయలో ఉగ్రవాద అగ్నికీలల్లో హాహాకారాలు.. పంజాబ్‌లో ఉగ్రవాదుల దారుణాలు.. ఇలా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు కుంటుపడ్డాయి. విదేశీ మారక నిల్వలు ఆవిరవుతూ.. దిగుమతులకు మూడువారాలకు సరిపడ నిల్వలే మిగిలాయి.! భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) బంగారు నిల్వలను కుదవ పెట్టినా.. ఎన్ని రోజులు గడుస్తాయో తెలియని పరిస్థితులు.? ఆ సమయంలో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు అనూహ్యంగా మన్మోహన్‌సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించారు. ఆ నిర్ణయమే.. దేశ ఆర్థిక స్థితి దశ-దిశలను మార్చేశాయి.

1982-85 కాలంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) గవర్నర్‌గా.. ఆ తర్వాత ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా భారత ఆర్థిక వ్యవస్థపై తనదైన ముద్ర వేసిన మన్మోహన్.. భారత్‌లో పరిస్థితులను తన సంస్కరణలతో సమర్థంగా గాడిలో పెట్టారు. పంచవర్ష ప్రణాళికల్లో బాగంగా గొప్ప కార్యక్రమాలను అమలు చేసినా.. సామ్యవాద విధానాలతో పేదరికం, నిరుద్యోగం, ఆకలి కేకలు తగ్గకపోవడంతో.. ఎల్పీజీ సంస్కరణల వైపు ఆయన మొగ్గుచూపారు. ఆర్బీఐ వద్ద ఉన్న బంగారాన్ని తాకట్టు పెడితే తప్ప పూటగడవని స్థితిలో.. దివాలా స్థితిలో అపంశయ్యపై ఉన్న దేశాన్ని గట్టెక్కించడానికి ఆయన అమలు చేసిన సంస్కరణలు..

- లైసెన్స్ రాజ్‌ను రద్దు చేసి.. 4 రంగాలు మినహా, మిగతా వాటిల్లో పరిశ్రమల ఏర్పాటు విధానాన్ని సరళీకరించారు. ఫలితంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) వరుసకట్టాయి. దేశంలో విదేశీ మారకనిల్వల వృద్ధి మొదలైంది.
- ఎల్పీజీ సంస్కరణలతో నిరుద్యోగం కొంతవరకు తగ్గడమే కాకుండా.. పెట్టుబడులు పెరిగాయి.
- మారకం రేటులో దిద్దుబాటు జరిగి.. భారత కరెన్సీ హెచ్చుతగ్గులు నియంత్రణలోకి వచ్చాయి.
- ఉత్పాదక రంగంలో ప్రపంచంతో భారత్ పోటీపడడం మొదలైంది.
- ఈ చర్యలతో 1991 నాటికి 100 కోట్ల డాలర్లు కూడా భారత విదేశీ మారక నిల్వలు.. 1995 నాటికి వెయ్యి కోట్ల డాలర్లకు చేరుకున్నాయి.

మన్మోహన్ హయాంలో వచ్చిన ఇతర కీలక పథకాలు, విధానాలు, చట్టాలు..

పీఎఫ్ఆర్డీఏ చట్టం; కంపెనీల చట్టం; అటవీ హక్కుల చట్టం ; ప్రత్యక్ష నగదు బదిలీ పథకం(డీబీటీ); జీరో బ్యాలెన్స్ బ్యాంకు ఖాతాలు; ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏకీకరణ; జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్(ఆశా); నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్; నేషనల్ హార్టికల్చర్ మిషన్; వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ కమిటీల సంస్కరణలపై నమూనా చట్టం; నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్ అండ్ కార్పొరేషన్; విలువ ఆధారిత పన్ను(వ్యాట్) అమలు.. తదనంతర కాలంలో జీఎస్టీ ప్రతిపాదనలు; సెక్యూరిటీలపై లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్ రద్దు. స్టాక్ ఎక్స్ఛేంజీల డీమ్యూచువలైజేషన్; కిరాణా వ్యాపారంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ); బొగ్గు గనుల్లో ప్రైవేటుకు అనుమతి; పెట్రోల్, డీజిల్‌పై సబ్సిడీల రద్దు; జెండర్ బడ్జెట్; జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్; పటిష్ఠమైన విదేశాంగ విధానం

ప్రధానిగా చెరగని ముద్ర

2004-14 మధ్య కాలంలో మన్మోహన్ రెండు పార్లు వరుసగా ప్రధానిగా పనిచేశారు. ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా, ఆర్థికమంత్రిగా పనిచేసిన అనుభవంతో.. ఆయన ప్రధానిగా తన హయాంలో జీడీపీ వృద్ధికి దోహదపడేలా ఆర్థిక సంస్కరణలు, ప్రభుత్వ పథకాలను పరిచయం చేశారు.

- భారత్-అమెరికా మధ్య అణు ఒప్పందం: నాన్ ప్రొలిఫరేషన్ ట్రీటీ(ఎన్‌పీటీ)లో బారత్ సంతకం చేయకున్నా.. అమెరికా అణు ఒప్పందం కుదుర్చుకోవడం మన్మోహన్ హయాంలో జరిగిన కీలక విజయం. అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్‌తో కలిసి.. మన్మోహన్ ఈ ఒప్పందంపై ప్రకటన చేశారు. దీని ప్రకారం భారత్ తన అణు కార్యకలాపాలను రెండుగా విభజిస్తుంది. అవి: సైన్య, పౌర సంబంధమైనవి. పౌర సంబంధ అణు కార్యకలాపాలను అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ(ఐఏఈఏ) పరిధిలోకి తీసుకువచ్చారు.
- విద్యా హక్కు చట్టం: 14 ఏళ్ల లోపు బాలలకు నిర్బంధ ఉచిత విద్యను అందించడమే ఈ చట్టం లక్ష్యం. ఇందుకోసం మన్మోహన్ సర్కారు రాజ్యాంగ సవరణ చేసి.. ప్రాథమిక హక్కుల్లో విద్యను ఒక హక్కుగా చేర్చారు.
- సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ): మన్మోహన్ సర్కారు తీసుకువచ్చిన విప్లవాత్మక చట్టాల్లో ఆర్టీఐ అత్యంత కీలకమైనది. ఈ చట్టంతో ప్రభుత్వంలో జవాబుదారీ పెరగడమే కాకుండా.. ప్రజలకు సమాచారం అందుబాటులో ఉంటుంది. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో అప్పిలేట్ అథారిటీలను ఏర్పాటు చేశారు.
- జాతీయ ఆహార భద్రత చట్టం: 2013లో వచ్చిన ఈ చట్టంతో దేశ జనాభాలో మూడింట రెండొంతుల మందికి సబ్సిడీతో కూడిన నిత్యావసరాలను అందజేయడం ప్రారంభమైంది. విద్యార్థులకు బడుల్లో మధ్యాహ్న భోజన పథకం, సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్), ప్రసూతి హక్కులు, అంగన్‌వాడీల ద్వారా మాతాశిశు సంరక్షణకు పౌష్టికాహారాన్ని అందజేయడం వంటి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.
- ఉపాధి హామీ పథకం: ఉపాధి హామీ కూడా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఓ చట్ట బద్ధమైన హక్కుగా మారింది. దీని ద్వారా సొంత ఊరిలోనే పౌరులకు 100 రోజుల పని దొరుకుతుంది.
- ఆధార్: పౌరుల గుర్తింపు కోసం అందరూ పాస్‌పోర్టు తీసుకోలేరు. దీంతో.. ఆధార్‌ను పరిచయం చేశారు. యూఐడీఏఐ ద్వారా దేశంలోని ప్రతి పౌరుడికి ఒక విశిష్ట సంఖ్యతో గుర్తింపు కార్డుల జారీని ప్రారంభించారు. తదనంతర కాలంలో ఆధారం చట్టం అమల్లోకి వచ్చింది.
- పంటల బీమా: ఆరుగాలం కష్టించి పండించిన పంట.. అతివృష్టి, అనావృష్టితో దెబ్బతింటే.. రైతన్నలకు తీరని నష్టం వాటిల్లుతుంది. దీంతో.. ఫసల్ బీమా పేరుతో మన్మోహన్ సర్కారు పథకాన్ని ప్రారంభించింది. తదనంతర కాలంలో ఈ బీమాను మరింత మెరుగుపరిచారు.

అగ్నిపరీక్షలో పీవీ దన్ను!

భారత్‌ను గట్టెక్కించిన 'ఆర్థిక' బంధం

ఏరికోరి మన్మోహన్‌ను నియమించిన పీవీ

నాడు దేశం దివాలా అంచున ఉంది. ఆర్థిక పరిస్థితి పూర్తిగా కునారిల్లింది. రాజకీయంగానూ అస్థిరత.. ఈ స్థితిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. పీవీ నరసింహారావు మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. దేశాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించాలంటే.. ఆర్థిక సంస్కరణలు అవసరం.. వాటిని ముందుకు నడిపేందుకు పీవీ ఏరికోరి మన్మోహన్‌సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించుకున్నారు. నాటి నుంచి ప్రారంభమైన బంధం.. పీవీ మరణానంతరం వరకు కొనసాగింది. యాదృచ్ఛికంగా ఆర్థిక మంత్రి అయిన మన్మోహన్‌సింగ్.. 2004లో అంతే యాదృచ్ఛికంగా ప్రధాని అయ్యారు. నాడు పీవీ సంపూర్ణ మద్దతుతో ప్రారంభించిన సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లారు. పీవీతో తనది 'ఆర్థిక' బంధమని అంటుండేవారు. పార్లమెంటు ఉభయసభల్లో మన్మోహన్ సంస్కరణలను ఎవరు ఆక్షేపించినా పీవీ ఆయనకు దన్నుగా నిలిచారు. 1990-91 లో పీవీ-మన్మోహన్ జోడీ వచ్చేనాటికి భారత విదేశీ మారకద్రవ్య నిల్వలు 100 కోట్ల డాలర్లకు పడిపోయాయి. ద్రవ్య లోటు నానాటికీ క్షీణిస్తుండడం.. ద్రవ్యోల్బణం డబుల్ డిజిట్‌కు చేరడం.. విదేశీ రుణాలు పతాకస్థాయికి చేరడంతో ప్రభుత్వానికి, సామాన్యుడికి కూడా ఊపిరాడని పరిస్థితి. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో మన్మోహన్-పీవీ రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇవి.. అంతర్జాతీయ పోటీ మార్కెట్లో భారతీయ ఉత్పత్తులకు అవకాశం దక్కేందుకు రూపాయి విలువ తగ్గింపు, విదేశీ మారక నిల్వలు పెంచుకోవడానికి బంగారం తాకట్టు పెట్టడం. ఈ నిర్ణయాలను కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్, పీవీ కేబినెట్‌లోనే ఉన్న అర్జున్‌సింగ్ గట్టిగా వ్యతిరేకించారు. అయితే బీజేపీ అగ్ర నేత, నాటి ప్రతిపక్ష నేత వాజపేయి మద్దతివ్వడంతో పీవీ-మన్మోహన్ ధైర్యంగా ముందుకెళ్లారు. 1996లో కాంగ్రెస్ ఓటమి తర్వాత పీవీ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని, అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేత పదవిని కోల్పోయినా.. వారి మధ్య సత్సంబంధాలు కొనసాగాయి. పీవీ చేపట్టిన సంస్కరణల వల్లే కాంగ్రెస్ నాశనమైందని ఆ పార్టీ సీనియర్లు బహిరంగంగానే విమర్శలు చేసినా ఈయన మాత్రం పట్టించుకోలేదు. తర్వాత్తర్వాత రాజకీయంగా పీవీని కాంగ్రెస్ ఏకాకిని చేసింది. పీవీ పలు కేసులను ఎదుర్కొన్నారు. జేఎంఎం ముడుపుల కేసులో 2000 అక్టోబరులో కోర్టు ఆయనకు మూడేళ్ల జైలు శిక్ష విధించినప్పుడు.. ఆయన కేబినెట్‌లో పనిచేసిన ఒక్క కాంగ్రెస్ నేత కూడా పరామర్శించలేదు. అయితే మన్మోహన్ ఒక్కరే ఆయన నివాసానికి వెళ్లి మాట్లాడి వచ్చారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో యూపీఏ గెలిచాక నాటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ మన్మోహన్‌ను ప్రధానిని చేశారు. ఆ ఏడాది మే 22న ఆయన ప్రధానిగా ప్రమాణం చేశారు. తన రాజకీయ గురువు పీవీ అని పార్లమెంటులోనే ఆయన ప్రకటించడం గమనార్హం. అదే ఏడాది డిసెంబరు 23న పీవీ మరణించినప్పుడు మన్మోహన్ ఎంతో దుఃఖించారు.

\- సెంట్రల్ డెస్క్



...లమంచిలి శివాజీతో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్

లోకం తీరు



దేశ గతిని మార్చిన 1991 బడ్జెట్

ఆర్థిక సంస్కరణల అమలుకు బాటలు

కేంద్ర ఆర్థిక మంత్రి హోదాలో మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలతో ప్రవేశపెట్టిన 1991-92 బడ్జెట్ దేశ గతిని మార్చింది. అప్పటి వరకూ దశాబ్దాల తరబడి 3.5శాతంగా కొనసాగుతున్న వృద్ధి రేటును పరుగులు పెట్టించడానికి దోహదపడింది. భారతదేశ కొత్త ఆర్థిక వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన మైలురాయిగా దీన్ని పేర్కొంటారు. 'సమయం వచ్చినప్పుడు ఒక ఆలోచనను ఈ భూమి మీద ఏ శక్తీ ఆపలేదు' అంటూ ఫ్రెంచ్ తత్వవేత్త విక్టర్ హ్యూగో మాటలను ఆనాటి బడ్జెట్ ప్రసంగంలో మన్మోహన్ ప్రస్తావించారు. భారత్ ప్రపంచ శక్తిగా, ఆర్థిక శక్తిగా మారడానికి సమయం ఆసన్నమైందని, దీన్నెవరూ ఆపలేరని ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు. 1991 జూలై 24న మన్మోహన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలో ఆర్థిక సంస్కరణలకు బాటలు వేసింది. ఓపెన్ ఎకానమీలో ప్రభుత్వ పెట్టుబడులను తగ్గించి, ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించాలని నిర్ణయించడంతో కంపెనీలకు పర్మిట్ రాజ్ నుంచి విముక్తి లభించింది. ఎగుమతులను ప్రోత్సహించడం, దిగుమతి లైసెన్సులు సడలించడం లక్ష్యంగా ఆనాటి బడ్జెట్‌లో మన్మోహన్ పలు మార్పులు ప్రకటించారు. ఎగుమతి-దిగుమతి విధానంలో విదేశీ పెట్టుబడులను స్వాగతించారు. 1991 బడ్జెట్‌ను కేవలం నెల రోజుల్లోనే మన్మోహన్ సింగ్ సిద్ధం చేయడం విశేషం. ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే ఆర్థిక సంస్కరణల ఫలాలు కనిపించడం మొదలైంది. విదేశీ పెట్టుబడులు వచ్చాయి. లక్షల సంఖ్యలో కొత్త ఉద్యోగాల సృష్టి జరిగింది. కోట్లాది మంది ప్రజలు మొదటిసారిగా దారిద్ర్య రేఖకు ఎగువకు చేరుకున్నారు. ఆధునిక భారతదేశ చరిత్రలో అతిపెద్ద నిర్ణయాలలో ఒకటిగా పరిగణించే ఈ బడ్జెట్ ఘనత మన్మోహన్‌తో పాటు నాటి ప్రధాని పి.వి. నరసింహారావుకు దక్కింది.

రాజ్యాంగానికి పెనుముప్పు

దాని నాశనమే ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రాజెక్టు.. సంఘ్ ప్రోద్బలంతోనే అంబేడ్కర్‌కు అమిత్‌షా అవమానం

- ఆయన రాజీనామా చేయాల్సిందే
- జాతికి క్షమాపణ చెప్పాల్సిందే
- గాంధీజీ వారసత్వాన్ని పరిరక్షిస్తాం
- కాంగ్రెస్ 'నవ సత్యాగ్రహ బైఠక్' రాజకీయ తీర్మానం
- బెళగావిలో వర్కింగ్ కమిటీ సమావేశం
- ఖర్గే, రాహుల్, ఏఐసీసీ నేతలంతా హాజరు
- గాంధీ చిత్రపటాలతో వేదిక వద్దకు ర్యాలీ
- పార్టీలో కొత్త తరానికి చాన్సివ్వాలి: ఖర్గే



సీడబ్ల్యూసీ సమావేశం వేదిక వద్దకు ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ నేతలు

బెంగళూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంతవరకు ఎదురుకాని పెనుముప్పును భారత రాజ్యాంగం ఎదుర్కొంటోందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆందోళన వ్యక్తంచేసింది. రాజ్యాంగాన్ని నాశనం చేయడం ఆర్ఎస్ఎస్-బీజేపీల దశాబ్దాల ప్రాజెక్టు అని ధ్వజమెత్తింది. సంఘ్ ప్రోద్బలంతోనే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంటులో బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను కించపరిచారని ఆరోపించింది. ఆయన కచ్చితంగా రాజీనామా చేసి తీరాలని స్పష్టం చేసింది. జాతికి క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తూ రాజకీయ తీర్మానాన్ని ఆమోదించింది. గాంధీజీపై తీవ్రంగా పోరాడిన సైద్ధాంతిక శక్తి (ఆర్ఎస్ఎస్).. ఆయన వారసత్వాన్ని టార్గెట్ చేసిందని ధ్వజమెత్తింది. ఆ వారసత్వాన్ని కాపాడేందుకు, పరిరక్షించడానికి, వ్యాప్తి చేసేందుకు పునరంకితమవుతామని సంకల్పం తీసుకుంది. రాజ్యాంగంపై దాడి, ధరల పెరుగుదల, అవినీతికి వ్యతిరేకంగా 13 నెలలపాటు పాదయాత్రలు సహా వివిధ రూపాల్లో ఉద్యమించేందుకు కార్యాచరణను ప్రకటించింది. 'నవ సత్యాగ్రహ బైఠక్' పేరిట వర్కింగ్ కమిటీ సమావేశం గురువారం కర్ణాటకలోని బెళగావి(బెల్గాం)లో ప్రారంభమైంది. 1924లో బెల్గాంలోనే జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభలో మహాత్మాగాంధీ జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. ఇది జరిగి వందేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఇప్పుడిక్కడ చరిత్రాత్మక భేటీని నిర్వహిస్తున్నారు. తొలుత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్ తదితరులు గాంధీజీ చిత్రపటాలు చేతబట్టి సమావేశ ప్రాంగణం 'వీరసౌధ'కు ప్రదర్శనగా తరలివచ్చారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి.. బైఠక్‌ను ఖర్గే ప్రారంభించారు. కొత్త ఏడాది 2025లో పార్టీ అనుసరించాల్సిన రోడ్‌మ్యాప్‌పై విస్తృతంగా చర్చించారు. రాజకీయ, ఎన్నికల సవాళ్లను ఎదుర్కొనడానికి కార్యాచరణను కూడా రూపొందించారు. సమావేశంలో ఖర్గే ప్రారంభోపన్యాసం చేశారు. అంబేడ్కర్‌కు జరిగిన అవమానం తాలూకు తప్పును అంగీకరించడానికి ప్రధాని మోదీ సిద్ధంగా లేరని ఆక్షేపించారు. రాజ్యాంగ రూపశిల్పిపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర అవమానకరంగా ఉన్నాయని మండిపడ్డారు. బాబాసాహెబ్ గౌరవం కోసం కాంగ్రెస్ పోరాడుతుందని చెప్పారు. 'భారత్ అనే భావనను పార్టీకి అనుసంధానిస్తాం. సైద్ధాంతిక నిబద్ధత ఉన్నవారిని, కాంగ్రెస్ సిద్ధాంతాలపై విశ్వాసం ఉన్నవారిని, రాజ్యాంగంపై పోరాటానికి సిద్ధంగా ఉన్నవారిని.. మనం ఎంచుకోవాలి. వారందరినీ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలి. సంస్థాగత బాధ్యతల్లో భాగస్వామ్యం కల్పించాలి. కష్టపడి పనిచేయడం ఒక్కటే చాలదు. సకాలంలో నిర్మాణాత్మక వ్యూహం, దిశానిర్దేశం అవసరం. కొత్త తరానికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అలాగే స్థానిక, నూతన నాయకత్వాన్ని తీర్చిదిద్దాలి' అని ఆయన నొక్కిచెప్పారు. కాంగ్రెస్‌కు సైద్ధాంతిక శక్తి, గాంధీ-నెహ్రూ, ఇతర గొప్ప నేతల వారసత్వం ఉన్నాయని.. నూతన సంకల్పం, కొత్త సందేశంతో బెళగావి నుంచి తిరిగి వస్తామని తెలిపారు. ఇవాళ రాజ్యాంగ పదవిలో ఉన్నవారు మహాత్మాగాంధీ సత్యాగ్రహాన్నే ప్రశ్నిస్తున్నారని, అందుకే వర్కింగ్ కమిటీ సమావేశానికి 'నవ సత్యాగ్రహ బైఠక్' అని పేరుపెట్టామని చెప్పారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసినవారు అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నవారు అసత్యాల తోడ్పాటుతో కాంగ్రె్‌సపై ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వారి బండారం బయటపెట్టి.. ఓడించాలని పార్టీ శ్రేణులకు పిలుపిచ్చారు. సమావేశంలో వర్కింగ్ కమిటీ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులు, సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సభ్యులు, పీసీసీ సభ్యులు, రాష్ట్రాల సీఎల్పీ నేతలు, పార్లమెంటరీ పార్టీ ఆఫీసు బేరర్లు, మాజీ ముఖ్యమంత్రులు హాజరయ్యారు.

గాంధీ వారసత్వానికి ముప్పు..

సీడబ్ల్యూసీ భేటీకి సోనియా సందేశం

కేంద్రంలో అధికారంలో ఉన్న వాళ్లు, వారిని పెంచి పోషించిన సిద్ధాంతాలు, సంస్థల వల్ల మహాత్మాగాంధీ వారసత్వానికి ముప్పు పొంచి ఉందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చీఫ్ సోనియా గాంధీ అన్నారు. ఈ సంస్థలు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నడూ పోరాడలేదని బీజేపీ, ఆరెస్సె్‌సలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గాంధీని తీవ్రంగా వ్యతిరేకించారని, గాంధీ హత్యకు దారితీసేలా ఒక విషపూరిత వాతావరణాన్ని సృష్టించారని పేర్కొన్నారు. పైగా గాంధీ హంతకులను కీర్తిస్తారని విరుచుకుపడ్డారు. బెళగావిలో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశంలో సోనియా సందేశాన్ని చదివి వినిపించారు. స్ఫూర్తికి ఒక ప్రాథమిక వనరుగా ఉన్న మహాత్మాగాంధీ.. భవిష్యత్తులోనూ కొనసాగుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వం, ఆరెస్సె్‌సపై సోనియా విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా ఉన్న గాంధేయ సంస్థలపై దాడి చేస్తున్నారన్నారు. అందుకే బెళగావి సీడబ్ల్యూసీ సమావేశాన్ని 'నవ సత్యాగ్రహ బైఠక్' అని పేరు పెట్టడం సముచితమని పేర్కొన్నారు.

క్షీణ దశలో ప్రజాస్వామ్యం

రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ అంబేడ్కర్ ఎంతో శ్రద్ధచూపారని.. ఇబ్బందులు ఎదుర్కొన్నారనడంలో ఏ మాత్రం సందేహం లేదని జవహర్‌లాల్ నెహ్రూ స్పష్టం చేశారని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పేర్కొంది. పార్లమెంటులో అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా కేంద్ర హోం మంత్రి పదవికి రాజీనామా చేయడంతో పాటు జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాజకీయ తీర్మానాన్ని ఆమోదించింది. 'రాజ్యాంగం అమల్లోకి వచ్చి మరో నెల రోజుల్లో (జనవరి 26) 75 ఏళ్లు కానుంది. ఈ తరుణంలో దురదృష్టవశాత్తూ రాజ్యాంగం ఇంతకుముందెన్నడూ లేనంత ముప్పును ఎదుర్కొంటోంది. ప్రజాస్వామ్యాన్ని క్షీణింపజేస్తుండడం తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. కార్యనిర్వాహక ఒత్తిడితో న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్, మీడియా వంటి వ్యవస్థలను రాజకీయమయం చేశారు. పార్లమెంటును వక్రీకరించారు. అధికార పార్టీ సభ్యులే సభ కార్యకలాపాలను అడ్డుకున్న చర్యను ఇటీవలి శీతాకాల సమావేశాల్లో చూశాం. సమాఖ్య వ్యవస్థపై దాడి కొనసాగుతోంది. ఆ క్రమంలోనే ఒక దేశం-ఒకే ఎన్నిక బిల్లు తెచ్చారు. కీలకమైన ఎన్నికల డాక్యుమెంట్లను ప్రజలకు అందుబాటులోకి రాకుండా నియంత్రించేందుకు 1961నాటి ఎన్నికల నిర్వహణ నిబంధనలను కేంద్రం సవరించడం.. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలకు మూలమైన పారదర్శకత, జవాబుదారీతనం అనే విలువలను నాశనం చేయడమే. దీనిని వర్కింగ్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ సవరణలను సుప్రీంకోర్టులో సవాల్ చేశాం. మహారాష్ట్ర, హరియాణాల్లో ఎన్నికల నిర్వహణ తీరు ఎన్నికల ప్రక్రియ సమగ్రతనే దెబ్బతీసింది. ప్రభుత్వ ప్రాయోజిత మత, జాతి విద్వేషాలు పెచ్చరిల్లడం.. ముఖ్యంగా మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను 50% సీలింగ్‌కు మించి పెంచాల్సిన అవసరం ఉంది. సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటు ప్రాతిపదికనే రిజర్వేషన్లు కల్పించాలి' అని తీర్మానంలో పేర్కొన్నారు. గాంధీజీపైనా విడిగా తీర్మానం ఆమోదించారు.

బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యాం!

(మొదటిపేజీ తరువాయి)

మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 137 బిలియన్ డాలర్ల వ్యయంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్‌ఫ్రా ప్రాజెక్టుగా ఈ డ్యామ్ నిలుస్తుందని పేర్కొంటున్నారు. ఈ ప్రాజెక్టు విద్యుదుత్పత్తి సామర్థ్యం 300 బిలియన్ కిలోవాట్ అవర్స్ అని 2020లో చైనా పవర్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనా వేసింది. ప్రస్తుతం చైనాలో ఉన్న అతి పెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్ సామర్థ్యం 88.2 బిలియన్ కిలోవాట్ అవర్స్. అంటే కొత్త డ్యామ్ సామర్థ్యం దానికి మూడు రెట్లు అధికం. హిమాలయాల్లో బ్రహ్మపుత్ర నది పెద్ద యూ టర్న్ తీసుకొని అరుణాచల్‌ప్రదేశ్, అసోం గుండా బంగ్లాదేశ్‌లోకి ప్రవహిస్తుంది. యూ టర్న్ తీసుకునే ప్రాంతంలోని భారీ లోయ వద్ద డ్యామ్‌ను నిర్మించాలని చైనా నిర్ణయించడం గమనార్హం. 137 బిలియన్ డాలర్ల (చైనా కరెన్సీలో ట్రిలియన్ యువాన్లు) ఖర్చుతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి ఖరీదైన, భారీ ప్రాజెక్టుగా నిలవనుంది. యార్లంగ్ జాంగ్బో నదిపై ప్రాజెక్టు నిర్మించతలపెట్టిన ప్రాంతం ప్రపంచంలోనే అత్యధిక జలవిద్యుత్తును ఉత్పత్తి చేయగలిగే అవకాశం ఉన్నవాటిలో ఒకటి అని చైనా పవర్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనా వేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. జలవిద్యుదుత్పత్తి కోసం బ్రహ్మపుత్ర నదిలోని సగం నీటిని దారి మళ్లించేందుకు 20 కిలోమీటర్ల పొడవైన సొరంగాలను నాలుగు నుంచి ఆరు వరకు తవ్వాలని పేర్కొంది. నమ్చా బార్వా కొండల్లో తవ్వే ఈ సొరంగాల ద్వారా సెకనుకు 2 వేల క్యూబిక్ మీటర్ల నీరు ప్రవహిస్తుందని వివరించింది. ఈ ప్రాజెక్టు కేవలం జలవిద్యుత్తు డ్యామ్ మాత్రమే కాదని.. పర్యావరణానికి, చైనా జాతీయ భద్రతకు, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు, ఇంధనం, అంతర్జాతీయ సహకారానికి సంబంధించిన ప్రాజెక్టు అని చైనా పవర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ గత చైర్మన్ యాన్ జియాంగ్ పేర్కొనడం గమనార్హం.

బ్రహ్మపుత్ర.. యార్లంగ్ జాంగ్బో

టిబెట్‌లో జన్మించిన బ్రహ్మపుత్ర నది (దీన్ని అక్కడ యార్లంగ్ జాంగ్బోగా పిలుస్తారు) భారత్ గుండా బంగ్లాదేశ్‌లోకి ప్రవహిస్తోంది. మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు ఇది వరదాయిని. ఈ నదీ జలాల ప్రవాహ తీరు, పంపిణీ వంటి అంశాలపై సమాచార మార్పిడి కోసం భారత్-చైనా మధ్య ఒప్పందం ఉంది. వానాకాలంలో ఈ నదికి విపరీతంగా వరదలు వస్తుంటాయి. ఇరుదేశాల మధ్య ఒప్పందం ప్రకారం మే 15 నుంచి అక్టోబరు 15 వరకు బ్రహ్మపుత్ర జలాల సంబంధిత విషయాల్ని చైనా.. భారత్‌తో పంచుకోవాల్సి ఉంది. వరదలొచ్చే అవకాశం ఉన్నప్పుడు నదిలో ప్రవాహ స్థితిగతులను దిగువనున్న దేశాలకు తెలియజేయాలి. కానీ, ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తర్వాత చైనా ఆ సమాచారాన్ని సరిగా ఇవ్వడంలేదు. బ్రహ్మపుత్ర నదీ జలాలపై తొలిసారిగా 2002లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2008, 2013, 2018లో నాటి పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేశారు. చివరి సారిగా కుదిరిన ఒప్పందం 2023తో ముగిసింది. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంకా కొత్త ఒప్పందం జరగలేదు. ఈ తరుణంలో ప్రాజెక్టు నిర్మాణానికి చైనా సిద్ధమవడం కలవరపెడుతోంది. చైనా ప్రతిపాదిత ప్రాజెక్టును పూర్తి చేస్తే భారత్‌కు పక్కలో బల్లెంలా మారే ప్రమాదముంది. బ్రహ్మపుత్ర జలాలపై చైనా నియంత్రణ పెరిగిపోతుంది. ఎండాకాలంలో నీటిని మళ్లించేందుకు చైనాకు అవకాశం ఏర్పడుతుంది. దీంతో అసోం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది. మరోవైపు వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నదికి భారీగా వరద ఉంటుంది. ఒకేసారి పెద్దమొత్తంలో నీటిని విడుదల చేస్తే.. దిగువనున్న ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. ఈ ప్రాజెక్టు భారత్-చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అందువల్ల రక్షణ పరంగానూ భారత్‌కు సమస్యలు పొంచి ఉన్నాయి. ఒకవేళ యుద్ధ పరిస్థితులు తలెత్తితే.. ప్రాజెక్టులో నిల్వ చేసిన నీటిని ఒకేసారి విడుదల చేసి.. చైనా 'వాటర్ బాంబ్'గా ఉపయోగించే ప్రమాదం కూడా ఉంటుంది. అంత ఎత్తు నుంచి నీటిని విడుదల చేస్తే అల్లకల్లోలమే. అసోం, అరుణాచల్ వంటి రాష్ట్రాలు పూర్తిగా జలసమాధి అవయ్యే ప్రమాదం ఉంటుంది. కాగా, ఇరుదేశాల మధ్య ప్రవహించే నదులు సహా పలు అంశాలపై సీమాంతర సహకారం, పరస్పర సమాచార మార్పిడి చేసుకోవాలని ఈ నెల 18న జరిగిన భారత్-చైనా ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో నిర్ణయించినట్లు కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. టిబెట్ ప్రాంతం భూకంప జోన్‌లో ఉందని, అక్కడ తరచూ భూ ప్రకంపనలు సంభవిస్తుంటాయని.. ఇలాంటి చోట భారీ డ్యామ్ కట్టడం ఆందోళనకరమని పేర్కొంది.

'నవ సత్యాగ్రహ'

రెండో రోజు సభ రద్దు

బెళగావి నుంచి హుటాహుటిన ఢిల్లీకి ఖర్గే, రాహుల్

బెంగళూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ మృతితో కాంగ్రెస్ శతాబ్ది ఉత్సవాల్లో విషాదం అలముకుంది. కర్ణాటకలోని బెళగావిలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులందరూ తరలివచ్చారు. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ఎంపీలు బెళగావికి చేరుకున్నారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి వందేళ్లు పూర్తయిన సందర్భంగా 'నవ సత్యాగ్రహ' సభ నిర్వహించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సహా ప్రముఖ కాంగ్రెస్ నేతలంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలిరోజైన గురువారం ఉదయం నుంచి పలు కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం నవ సత్యాగ్రహ పేరిట కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ నిర్వహించి.. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సభ ముగిశాక అగ్రనాయకులంతా రాత్రి విందులో పాల్గొన్నారు. ఆ తర్వాత మన్మోహన్ ఇక లేరనే విషాద సమాచారం అందడంతో నాయకులంతా విషాదంలో మునిగిపోయారు. మన్మోహన్‌సింగ్ కుటుంబ సభ్యులతో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఫోన్‌లో మాట్లాడినట్టు తెలిసింది. ఆ తర్వాత హుటాహుటిన ఇద్దరు అగ్రనేతలు ఢిల్లీకి బయల్దేరారు. బెళగావిలోని సువర్ణసౌధ ప్రాంగణంలో శుక్రవారం గాంధీ విగ్రహావిష్కరణ, బహిరంగసభ జరగాల్సి ఉంది. మన్మోహన్ సింగ్ మృతితో ఆ కార్యక్రమాలు నిలిచిపోయాయి.

పాక్ సరిహద్దుకు కదిలిన 15 వేల మంది తాలిబన్ ఫైటర్లు

కాబుల్, డిసెంబరు 26: పాక్-అఫ్ఘన్ మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగాయి. సరిహద్దుల్లోని బార్మల్ జిల్లాలో పాక్ జరిపిన వైమానిక దాడులపై అఫ్ఘానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం కన్నెర్ర చేసింది. పాక్ వైమానిక దాడుల్లో 46 మంది ముఖ్యంగా మహిళలు, చిన్నారులు చనిపోవడంతో తాలిబన్ల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దాడులను అనాగరిక చర్యగా పేర్కొనడంతో పాటు పాకిస్థాన్‌పై బదులు తీర్చుకుంటామని తాలిబాన్ ప్రభుత్వం హెచ్చరించింది. అఫ్ఘానిస్థాన్‌లోని పాక్ రాయబారిని కూడా పిలిచి తీవ్ర నిరసన తెలిపింది. ఆ వెంటనే సుమారు 15 వేల మంది తాలిబాన్ ఫైటర్లు కాబుల్, కాందహార్, హెరాత్ నుంచి పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఉన్న మీర్ అలీ సరిహద్దు వైపు కదులుతున్నారు. అయితే తాలిబాన్ల శిక్షణ శిబిరాలే లక్ష్యంగా దాడులు జరిపామని పాక్ అంటోంది. అసలే సరిహద్దు వెంబడి ఉన్న తెహ్రీక్ ఎ తాలిబాన్ పాకిస్థాన్(టీటీపీ)తో వేగలేకపోతున్న పాకిస్థాన్‌కు ఇప్పుడు అఫ్ఘానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం కూడా శత్రువుగా మారింది. దీంతో ఇద్దరు శత్రువులను ఎదుర్కోవడం పాకిస్థాన్‌కు సవాలేనని అంతర్జాతీయ పరిశీలకులు చెబుతున్నారు. 15 వేల మంది తాలిబాన్ ఫైటర్లతోనూ అలాగే టీటీపీ ఉగ్ర మూకలతోనూ పాక్ తలపడాల్సి ఉంటుంది.

కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ నేడు

హైదరాబాద్, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-ఆపరేషన్స్ కారు రేసు కేసులో కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరగనుంది. తనపై నమోదైన ఏసీబీ కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ ఈనెల 21న హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తొలుత విచారించిన జస్టిస్ శ్రవణ్ కుమార్ ధర్మాసనం కేటీఆర్‌ను ఈనెల 30వ తేదీ వరకు అరెస్టు చేయవద్దని, దర్యాప్తు మాత్రం కొనసాగించవచ్చని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీ, పురపాలక శాఖ కార్యదర్శి దానకిషోర్‌లకు నోటీసులు జారీ చేసింది. తమది రెగ్యులర్ బెంచ్ కానందున తదుపరి విచారణ రెగ్యులర్ రోస్టర్ కలిగిన ధర్మాసనం ఎదుట లిస్ట్ చేయాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తుపై ఏసీబీ అధికారులు కౌంటర్ దాఖలు చేయనున్నారు. ఈ కేసులో ఫిర్యాదు దారుడైన పురపాలకశాఖ కార్యదర్శి దానకిశోర్ సైతం కౌంటర్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు నమోదు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరగనున్న నేపథ్యంలోనే ఇప్పటివరకు ఏ1 కేటీఆర్, ఏ2 అర్వింద్‌కుమార్, ఏ3 బీఎల్ఎన్ రెడ్డిలకు ఏసీబీ నోటీసులు ఇవ్వలేదని సమాచారం. వీరందరికి నోటీసులు జారీ చేయడానికి కావాల్సిన పూర్తి స్థాయి సమాచారాన్ని మాత్రం అధికారులు సిద్ధం చేసుకున్నారు.

ఆన్‌లైన్‌లో టెట్ హాల్‌టికెట్లు

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లకు సంబంధించిన హాల్‌టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జనవరి 2వ తేదీ నుంచి టెట్ పరీక్షలు ప్రారంభమై 20 వరకు జరగనున్నాయి. జనవరి 8, 9, 10, 18 తేదీల్లో టెట్ పేపర్-1 పరీక్ష, జనవరి 2, 5, 11, 12, 19, 20 తేదీల్లో పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. రెండు సెషన్లుగా పరీక్షలు ఉంటాయి. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. టెట్ కోసం 2,48,172 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

భుజంగరావు బెయిల్‌పై తీర్పు వాయిదా

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్న ఏ-3 ఎన్.భుజంగరావు దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు గురువారం తీర్పు రిజర్వు చేసింది. ఆయన దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ కే. సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ బెయిల్ పిటిషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. అనారోగ్య కారణాలు సాకుగా చూపి, జైల్లో లొంగిపోకుండా నాలుగున్నర నెలలుగా నిందితుడు బయట ఉంటున్నారని ఆరోపించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదిస్తూ ఆయన గుండె, నరాలు, ఎముకలకు సంబంధిత అనేక వ్యాధులతో ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. దర్యాప్తు పూర్తికాకముందే ఛార్జిషీట్‌ను దిగువ కోర్టు స్వీకరించడం చెల్లదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం తీర్పు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

సీఎంఆర్ గడువు పొడిగించిన కేంద్రం

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2023-24 సంవత్సరం యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) గడువును పెంచింది. ఈనెల 15వ తేదీతో సీఎంఆర్ గడువు పూర్తవడంతో అప్పటి నుంచి ఎఫ్‌సీఐ తెలంగాణ నుంచి బియ్యం సేకరణను నిలిపేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేంద్ర ప్రభుత్వానికి గతంలోనే లేఖ రాయగా.. తాజాగా మళ్లీ కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపింది. . దీంతో గతేడాది యాసంగి సీజన్‌కు సంబంధించిన బియ్యం డెలివరీకి నెల రోజుల అదనపు సమయం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు వెలువరించింది. 2025 జనవరి 25తేదీ నాటికి సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తిచేయాలని తుది గడువు విధిస్తూ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి దీపేంద్ర సింగ్ ఉత్తర్వులు జారీచేశారు.

తెగింపు ఉద్యమాలకు సిద్ధం కావాలి

» సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ పిలుపు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తెగింపు ఉద్యమాలకు సిద్ధం కావాలని, ఎర్రజెండా మీకు కొండంత అండగా ఉంటుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి ఆధ్వర్యంలో గురువారం పెద్దఅంబర్‌పేట్‌లో బహిరంగసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సిద్ధాంత పునాదులపై వందేళ్లపాటు నిలబడిన ఏకైనా పార్టీ సీపీఐ అన్నారు. అట్టడుగు వర్గాల ప్రజల్లో వెలుగులు నింపేందుకు పార్టీ ఉద్యమాలు, పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. దున్నేవాడిదే భూమి అంటూ సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన ఏకైక పార్టీ అని అన్నారు. తెలంగాణలో దాదాపు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచామని తెలిపారు. పాలకులు అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయడంలేదని ఆరోపించారు. ఇళ్ల స్థలాల కోసం పోరాటాలు కొనసాగుతున్నాయని, పోలీసుల కేసులు, బెదిరింపులకు బయపడేది లేదన్నారు. సీపీఐ జాతీయ సమితి నాయకుడు పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తే అండగా ఉంటామన్నారు. చీలిన కమ్యూనిస్టు పార్టీలు కలిసి రావాలని, అప్పుడే పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు.

చారిత్రక వాస్తవాలను వెలికి తీయాల్సిందే

» ఆర్ఎస్ఎస్ పత్రిక ది ఆర్గనైజర్ సంపాదకీయం

న్యూఢిల్లీ, డిసెంబరు 26: మసీదు-ఆలయాల వివాదాలకు సంబంధించి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలపై ఆ సంస్థ అనుబంధ పత్రిక 'ది ఆర్గనైజర్' భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. సోమ్‌నాథ్ నుంచి సంభాల్ వరకు, ఇంకా మరెన్నో అంశాలపై చారిత్రక వాస్తవాలను తెలుసుకునేందుకు పోరాటం చేస్తున్నామని, నాగరిక న్యాయం కోరుతున్నామని పేర్కొంది. మసీదు-ఆలయాల రగడ వద్దని, సామరస్యాన్ని కాపాడుకోవడానికి కొత్త వివాదాలకు దూరంగా ఉండాలని భాగవత్ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే. 'నాగరిక న్యాయం కోసం వివాదాస్పదమైన స్థలాలు, కట్టడాల వెనుక వాస్తవ చరిత్ర తెలుసుకోవడం చాలా ముఖ్యం. అన్వేషించాల్సిన సమయం ఆసన్నమైంది. అంబేడ్కర్ కుల ఆధారిత వివక్షకు సంబంధించిన మూలకారణాలను అన్వేషించి, దానిని అంతం చేయడానికి పరిష్కారాలు అందించారు. అలాగే, మతపరమైన అసమానతలకు ముగింపు పలకడానికి మూలాలను గుర్తించాలి' అని పేర్కొంది. యూపీలోని చారిత్రక నగరం సంభాల్‌లో ప్రస్తుతమున్న జామా మసీదు స్థానంలో శ్రీహరిహర మందిరం ఉండేదని, దీన్ని సర్వే చేయాలని పిటిషన్ వేయడంతో వివాదం మొదలైందని వెల్లడించింది. అన్నివర్గాల ప్రజలను భాగస్వామ్యం చేసి వాస్తవిక చరిత్ర ఆధారంగా వివేకవంతమైన సమగ్ర చర్చ జరగాలని ఎడిటర్ ప్రఫుల్ల కేత్కర్ రాసిన సంపాదకీయంలో కోరారు.

ఎస్‌బీఐలో 600పీవో పోస్టులకు నోటిఫికేషన్

600 ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో) పోస్టుల నియామకానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు అభ్యర్థులను ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు. ఆసక్తి కలిగిన వారు 2025 జనవరి 16 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ పూర్తి చేసిన వారితోపాటు చివరి సంవత్సరం పరీక్షలు రాసిన వారు ఈ పోస్టులకు అర్హులు. 2025 మార్చి 8, 15 తేదీల్లో ప్రిలిమినరీ పరీక్షలు, ఏప్రిల్ లేదా మే నెలలో మెయిన్ పరీక్షలు నిర్వహిస్తారు.

గ్రూప్-1 మెయిన్స్ ఎంపిక సబబే

పిటిషన్ దాఖలులో ఆలస్యమైందని ఇది వరకే సింగిల్ బెంచ్ స్పష్టం చేసింది

» ఆ లెక్కన ఇప్పుడు మరింత ఆలస్యమైంది
» అదే అంశంపై మళ్లీ విచారణ సబబు కాదు
» స్పష్టం చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్
» జీవో 29పై దాఖలైన పిటిషన్ల కొట్టివేత



హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసిన విధానం సబబేనని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. జీవో 55 స్థానంలో జీవో 29 అమలును.. మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థుల ఎంపికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. గ్రూప్-1 చుట్టూ అలుముకున్న వివాదాలకు ముగింపు పలికి.. ఎంపిక ప్రక్రియకు అడ్డంకులను తొలగించింది. జీవో 29 అమలు, జీవో 96, తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1996లోని రూల్ 22(2)(ఏ), (బీ) చట్టబద్ధతను సవాల్ చేస్తూ.. దాఖలైన ఎనిమిది వేర్వేరు పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ జి.రాధారాణిల డివిజన్ బెంచ్ గురువారం తుది తీర్పునిచ్చింది. పిటిషన్ దాఖలులో 'ఆలస్యం' కారణంగా హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్, సుప్రీంకోర్టు కొట్టివేసిన అంశంపై మళ్లీ విచారణ జరపడం సబబు కాదని వ్యాఖ్యానించింది. "2024 ఫిబ్రవరి 19న కొత్త నోటిఫికేషన్ జారీ అయ్యాక.. దాదాపు అర్నెల్ల తర్వాత సింగిల్ జడ్జి వద్ద పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని సింగిల్ జడ్జి ధర్మాసనం అక్టోబరు 15న కొట్టివేసింది. వాటిపై అప్పీళ్లను అక్టోబరు 18న డివిజన్ బెంచ్ కొట్టివేసింది. పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఈ నెల 6న కొట్టివేసింది. సింగిల్‌బెంచ్ 'ఆలస్యం' అనే కారణాన్ని స్పష్టంగా పేర్కొన్నాక.. ఇప్పుడు మరింత ఆలస్యం జరిగింది. ఒకసారి తీవ్ర ఆలస్యంపై నిర్ధారణ జరిగాక.. మళ్లీ అదే అంశంపై విచారణ సబబు కాదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పదిరోజుల క్రితం వాదనల సందర్భంగా.. "గతంలో హైకోర్టు ప్రాథమిక పరీక్షను మళ్లీ నిర్వహించాలని చెప్పిందే తప్ప.. పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్ ఇవ్వమని చెప్పలేదు. పాత దాన్ని రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్ ఇవ్వడమే కాకుండా పోస్టులను 503 నుంచి 563కు పెంచారు. గేమ్ రూల్స్‌ను మధ్యలో మారుస్తూ.. చట్టవిరుద్ధంగా జీవో 29ను తీసుకొచ్చారు. గతంలో జీవో 55ని సమర్థించిన ప్రభుత్వం.. ఇప్పుడు జీవో 29ను అమలు చేయడం చెల్లదు. రిజర్వుడ్ కేటగిరీ అభ్యర్థికి ఎక్కువ మార్కులు వస్తే జనరల్ కోటాలో బెర్త్ దక్కాలి. మధ్యలో రూల్స్‌ను మార్చడం వల్ల 1:50 నిష్పత్తికి విరుద్ధంగా ఎక్కువ మంది అభ్యర్థులు మెయిన్స్‌కి ఎంపికయ్యారు" అని పేర్కొన్నారు. ప్రభుత్వం, టీజీపీఎస్సీ తరఫున న్యాయవాదులు తమ వాదనలను వినిపిస్తూ.. కొత్త ప్రభుత్వం ఇచ్చిన కొత్త నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్లను హైకోర్టు సింగిల్, డివిజన్ బెంచ్‌లు, సుప్రీంకోర్టు కొట్టేసిన తర్వాత.. మళ్లీ వివాదానికి తావులేదని పేర్కొన్నారు. "కొత్త ప్రభుత్వం జారీచేసిన జీవో 29.. సుప్రీం కోర్టు 'బాలాజీ బదావత్' కేసులో ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా.. చట్టానికి లోబడి ఉంది. కోర్టు తీర్పులకు అనుగుణంగానే 1967 నుంచి కొత్త జీవోలు వస్తున్నాయి. జనరల్ విభాగంలో ఎంపికైన చిట్టచివరి వ్యక్తి కంటే.. రిజర్వుడు అభ్యర్థికి ఎక్కువ మార్కులు వస్తే.. సదరు అభ్యర్థికి కచ్చితంగా జనరల్ విభాగంలోనే బెర్త్ దక్కుతుంది" అని స్పష్టంచేశారు. వాదనలను విన్న ధర్మాసనం.. "ఇంతకుముందు రౌండ్ లిటిగేషన్‌లో పిటిషన్ల దాఖలులో తీవ్ర ఆలస్యం, అశ్రద్ధ జరిగిందని ఇదే కోర్టు స్పష్టంచేసిన తర్వాత.. అంతకంటే ఆలస్యంగా దాఖలైన ప్రస్తుత పిటిషన్లను అనుమతించడంలో అర్థంలేదు. కొత్త నోటిఫికేషన్‌ను రద్దు చేసి, 2022 నాటి పాత నోటిఫికేషన్‌ను పునరుద్ధరించడం.. అందులో పేర్కొన్న ఎంపిక ప్రక్రియను అనుసరించాలని ఆదేశించడం కుదరనే కుదరదు. ఈ తరహా స్వభావం ఉన్న కేసుల్లో ఒక్క రోజు ఆలస్యం కూడా లెక్కలోకి వస్తుంది. ఎందుకు ఆలస్యం జరిగింది? అనేదానికి పిటిషనర్లు సరైన వివరణ ఇవ్వలేదు" అని వ్యాఖ్యానించింది. పిటిషన్‌లను కొట్టివేస్తూ.. తుది తీర్పు వెలువరించింది.

త్వరలో ఫలితాలు?

కేసులడ్డంకి తొలగిపోయిన నేపథ్యంలో టీజీపీఎస్సీ త్వరలో ఫలితాలను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. భారీ సంఖ్యలో అభ్యర్థుల పరీక్షకు హాజరైన నేపథ్యంలో.. వాల్యుయేషన్‌కు నెలల సమయం పడుతుంది. అయితే.. టీజీపీఎస్సీ ఆగమేఘాల మీద ఆ ప్రక్రియను పూర్తిచేస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి ఫిబ్రవరి లేదా మార్చిలో మెయిన్స్ ఫలితాలు వస్తాయనే అంచనాలున్నా.. త్వరలో వాటిని విడుదల చేసే దిశలో టీజీపీఎస్సీ అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

గ్రూప్-1 కేసు సాగిందిలా..

* బీఆర్ఎస్ హయాంలో 2022 ఏప్రిల్‌లో 503 పోస్టులతో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల
* అదే ఏడాది అక్టోబరు 16న ప్రిలిమ్స్ నిర్వహణ. ఆ తర్వాత లీకేజీ కారణంతో పరీక్షల రద్దు
* 2023 జూన్‌లో రెండోసారి ప్రిలిమ్స్ నిర్వహణ. బయోమెట్రిక్ తీసుకోలేదనే కారణంతో.. రద్దు చేసిన హైకోర్టు. తర్వాత ప్రభుత్వం మార్పు
* 2024 ఫిబ్రవరి 19న ప్రభుత్వం పాత నోటిఫికేషన్‌ను రద్దుచేసి.. మరో 63 పోస్టులను చేరుస్తూ.. 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేసింది
* ఈ ఏడాది జూన్ 9న ప్రిలిమ్స్ నిర్వహణ. మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక. అక్టోబరు 21 నుంచి 27 వరకు మెయిన్స్ షెడ్యూల్ ఖరారు
* కొత్త నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ జూలై 31న హైకోర్టు సింగిల్ బెంచ్ వద్ద పిటిషన్ల దాఖలు. అక్టోబరు 15న ఆ పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం
* ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లను అక్టోబరు 18న కొట్టివేసిన డివిజన్ బెంచ్. డివిజన్ బెంచ్‌లో ఎనిమిది పిటిషన్లు
* సుప్రీంకోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు.. ఈ నెల 6న కొట్టేసిన ధర్మాసనం
* ఈ నెల 26న జీవో 29, ఇతర అంశాలపై దాఖలైన 8 పిటిషన్ల కొట్టివేతతో.. ఫలితాల విడుదలకు మార్గం సుగమం

రూ.10వేల కోట్లు వచ్చినయ్!

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమి టీజీఐఐసీకి బదిలీ చేస్తూ జూన్ 26న జీవో 54ను జారీ చేసింది. కోకాపేట పరిసర గ్రామాల్లో నిర్వహించిన వేలం పాటలో పలికిన ధరలను పరిగణనలోకి తీసుకుని ఎకరాకు రూ.75 కోట్లుగా రేటును నిర్ణయించింది. ఈ భూమిని ఐటీ పరిశ్రమలు, ఇతర అవసరాల కోసం వినియోగించాలని తెలిపింది. ఈ క్రమంలోనే భూమిని బ్యాంకుల వద్ద తనఖా పెట్టి రూ.10వేల కోట్ల రుణాన్ని తీసుకునేందుకు టీజీఐఐసీ.. బ్యాంకులతో సంప్రదింపులు జరిపింది. కరూర్ వైశ్యా బ్యాంకు, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకులురుణాలు ఇవ్వడానికి ముందుకొచ్చాయి. ఐసీఐసీఐ బ్యాంకు వార్షిక వడ్డీ(9.6 శాతం) తక్కువగా ఉండడంతో ఆ బ్యాంకు నుంచి రుణం తీసుకోవడానికి టీజీఐఐసీ సిద్ధమైంది. ఈ మేరకు బ్యాంకుతో ఒప్పందం కూడా పూర్తయింది. దీని ప్రకారం నెలాఖరులోగా అప్పు అందాల్సి ఉంది. అన్నట్లుగానే... ఐసీఐసీఐ నుంచి టీజీఐఐసీకి రుణం సొమ్ము అందింది.

టీజీఐఐసీ ద్వారానే తిరిగి చెల్లింపు...

ప్రస్తుతం తీసుకున్న రూ.10వేల కోట్ల అప్పును తిరిగి టీజీఐఐసీ సొంతంగా చెల్లిస్తుందని అధికార వర్గాలు వివరిస్తున్నాయి. ప్రభుత్వం గచ్చిబౌలిలోని 400ఎకరాల భూమిని టీజీఐఐసీకి కేటాయించింది. ఎకరాకు రూ.75కోట్ల చొప్పున మొత్తం రూ.30వేల కోట్ల విలువైన భూముల్ని బదిలీ చేసింది. అంటే ప్రభుత్వం ఒక రకంగా ఆ భూమిని టీజీఐఐసీకి అమ్మేసినట్లే. దానికి సంబంధించిన మొత్తాన్ని చెల్లించే ప్రక్రియలో భాగంగా టీజీఐఐసీ రూ.10వేల కోట్ల రుణాన్ని తీసుకుంది. ఈ మొత్తాన్ని కొన్ని రోజుల్లోనే ప్రభుత్వానికి బదిలీ చేయనుంది. అయితే, ప్రభుత్వమే ఈ భూమిని నేరుగా కూడా తాకట్టు పెట్టి రుణం తీసుకునే అవకాశం ఉన్నా.. అలా చేస్తే ఆ రుణం కూడా ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి వస్తుంది. అదేజరిగితే.. ఇతరమార్గాల నుంచి ప్రభుత్వం తీసుకునే రుణాలు తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకునే ఆ భూములను టీజీఐఐసీకి బదలాయించి, ఆ సంస్థ రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.



శ్రీనివాస్‌ను అరెస్టు చేసి తీసుకువెళుతున్న పోలీసులు

బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు

» నాంపల్లి కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు
» పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు కేసు

హైదరాబాద్/మారేడుపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు వెస్ట్ మారేడ్‌పల్లిలోని శ్రీనివాస్ నివాసానికి తెల్లవారుజామునే వెళ్లి కాలింగ్ బెల్ కొట్టినా ఆయన చాలాసేపటి వరకు తెరవలేదు. తమ న్యాయవాదులు వచ్చే వరకు ఆగాలని ఆయన అనుచరులు పోలీసులకు సమాచారం అందించారు. 9.30 గంటల సమయంలో న్యాయవాదులు వచ్చి శ్రీనివాస్‌తో మాట్లాడారు. అనంతరం బయటకొచ్చిన ఆయనను పోలీసులు అరెస్టు చేసి.. మసాబ్ ట్యాంక్ పీఎస్‌కు తీసుకొచ్చారు. తర్వాత నాంపల్లిలోని మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా బెయిల్ మంజూరైంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు సమయంలో పోలీసులను అడ్డుకున్నారనే ఆరోపణలపై శ్రీనివాస్‌పై కేసు నమోదైన సంగతి తెలిసిందే. కోర్టు వద్ద శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. కాగా, కాంగ్రెస్ దళిత, బహుజన వర్గాలకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రశ్నిస్తున్నందుకే శ్రీనివాస్‌ను అరెస్టు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి ఆరు గ్యారంటీలను అటకెక్కించి ఏడోదిగా ఎమర్జెన్సీని అమలు చేస్తున్నారని విమర్శించారు. నోటీసులు, కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా శ్రీనివాస్‌ను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుపట్టారు.

ఓయూ ఆర్ట్స్ కళాశాలకు ట్రేడ్ మార్క్ గుర్తింపు

తార్నాక, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల భవనానికి అరుదైన గౌరవం దక్కింది. నిజాం హయాంలో నిర్మించిన ఈ భవనానికి ప్రతిష్ఠాత్మక భారత ప్రభుత్వ ట్రేడ్ మార్క్ గుర్తింపు లభించింది. కాగా ఇప్పటి వరకు దేశంలో ముంబైలోని తాజ్ మహల్ హోటల్, స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనాలు ట్రేడ్ మార్క్ కలిగి ఉన్నాయి. ట్రేడ్ మార్క్ పొందిన మూడో భవనంగా ఆర్ట్స్ కాలేజీ భవనం నిలిచింది.

సీనియారిటీ దైవాధీనం..!

ఖరారుపై దేవాదాయశాఖలో మీనమేషాలు.. 9 నెలలుగా హైకోర్టు ఆదేశాలూ బేఖాతరు!

» ఆర్జేసీ, డీసీ, ఏసీ క్యాడర్లలో ఖాళీలు
» ఈవోలకు అదనపు బాధ్యతలతో అవస్థలు
» సీఎం, ఏసీబీకి ఆకాశరామన్న లేఖలు
» అక్రమాలపై విజిలెన్స్ నిఘా.. ఫైళ్ల స్వాధీనం

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో సీనియారిటీ వ్యవహారం దైవాధీనంగా మారింది. ఈ విషయమై హైకోర్టు ఆదేశాలిచ్చి 9 నెలలైనా.. సీనియారిటీని ఖరారు చేసేవారే కరువయ్యారు. ఏడాది కాలంగా పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో ఈ శాఖలోని సమస్యలు శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు. సాధారణంగా ప్రభుత్వ శాఖల్లో పదవీ విరమణలతో ఏర్పడే ఖాళీల ఆధారంగా.. అర్హత ఉన్నవారికి పదోన్నతులు కల్పిస్తారు. దేవాదాయ శాఖలో మాత్రం ఈ విధానాన్ని అవలంభించడం లేదు. దీంతో కొందరు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించగా.. సీనియారిటీని ఖరారు చేయాలంటూ ఉత్తర్వులిచ్చింది. ఈ 9నెలల్లో సీనియారిటీ ఖరారుపై ఒక్కటంటే ఒక్కసమీక్ష కూడా జరగకపోవడం గమనార్హం.! ఏడాది కాలంగా ఇన్‌చార్జి కమిషనర్లు మాత్రమే పనిచేయడం ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.

ఈవో, ఏసీ, డీసీ.. అంతా ఇన్‌చార్జులే

ఆదాయ పరంగా అత్యంత కీలకమైన భద్రాచలంతోపాటు.. ధర్మపురి, వేములవాడ, కొమురవెల్లి, బాసర, సికింద్రాబాద్ గణేశ్ ఆలయం.. ఇలా పలు దేవస్థానాల్లో ఖాళీలు ఎక్కువగా ఉండడంతో అన్ని స్థాయుల్లో ఇన్‌చార్జి అధికారులు కొనసాగుతున్నారు. నిజానికి ఈ ఆలయాల్లో డిప్యూటీ కమిషనర్(డీసీ) స్థాయి అధికారి ఈవోగా ఉండాలి. సీనియారిటీ ఖరారు కాకపోవడంతో ఖాళీలు భర్తీ కావడం లేదు. దీంతో.. ఇన్‌చార్జులతో నెట్టుకొస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) స్థాయి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కీలకమైన హైదరాబాద్, రంగారెడ్డి, సికింద్రాబాద్, మహబూబ్‌నగర్‌లోనూ ఇదే పరిస్థితి. దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో.. రీజనల్ జాయింట్ కమిషనర్(ఆర్జేసీ) పోస్టులో కూడా ఇన్‌చార్జి అధికారే ఉంటున్నారు. నిజానికి రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండు ఆర్జేసీ పోస్టులను ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. పదేళ్లుగా ఈ అంశంపై ప్రభుత్వంలో ఉలుకూపలుకూ లేదు.

యాదగిరిగుట్ట ఈవోగా రెవెన్యూ అధికారి

తెలంగాణకే వన్నె తెచ్చేలా పునరుద్ధరించిన యాదగిరిగుట్టతోపాటు.. భద్రాచలం ఆలయాల్లో ఆర్జేసీ స్థాయి అధికారి ఈవోగా ఉండాలి. కానీ, పదోన్నతులు లేక.. ఆ క్యాడర్‌లో అధికారులెవరూ లేరు. దీంతో రెవెన్యూ విభాగం నుంచి డిప్యూటీ కలెక్టర్/ఆర్డీవో స్థాయి అధికారిని డిప్యూటేషన్‌పై తీసుకువచ్చి, ఈవోలుగా నియమించారు. సొంత శాఖ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాల్సిన చోట.. రెవెన్యూ అధికారులను నియమించి, తమపై పెత్తనానికి నియమించడాన్ని దేవాదాయ శాఖ అధికారులు తప్పుబడుతున్నారు. హైకోర్టు ఆదేశాలున్నా.. సీనియారిటీని ఖరారు చేసి, పదోన్నతులు కల్పించడంలో ప్రభుత్వం శ్రద్ధ వహించడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో సమీక్ష నిర్వహించాలని ఈవోల సంఘం విజ్ఞప్తి చేసినా.. ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు.

పదోన్నతి ఎదురుచూపుల్లోనే మృతి..!

ఇటీవల కొందరు ఈవోలకు పదోన్నతులు కల్పించేందుకు ఉన్నతాధికారులు జాబితా సిద్ధం చేశారు. అయితే.. ఆలస్యంగా జీవో విడుదలైందని అప్పటికే జాబితాలో పేరున్న నారాయణ అనే అధికారి చనిపోయారని ఉద్యోగులు చెబుతున్నారు.

బదిలీ అయినా అదనపు దూరాభారం


ఒకవేళ ఈవోలను బదిలీ చేస్తున్నా.. వారికి అదనపు/ఇన్‌చార్జి బాధ్యతల నుంచి విముక్తి మాత్రం కల్పించడం లేదు. ఇటీవల హైదరాబాద్ నుంచి బదిలీ అయిన ఈవో.. వందల కిలోమీటర్ల దూరంలో ఉండే వేర్వేరు జిల్లాల్లోని ఆలయాలకూ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోంది. ఇలాంటి బదిలీలతో తాము మానసికంగా, శారీరకంగా కుంగిపోతున్నామని ఉద్యోగులు చెబుతున్నారు. ఇక పోస్టింగ్‌లు, 'ప్రత్యేక' పదోన్నతుల విషయంలో ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక కింది స్థాయిలో బదిలీలు, పదోన్నతుల గురించి పట్టించుకుంటున్న దాఖలాలే కనిపించడం లేదని వాపోతున్నారు. అక్రమ బదిలీలు, పదోన్నతులు, నకిలీ విద్యార్హత సర్టిఫికెట్ల విషయంలో ఇప్పటికే విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో పలు ఫైళ్లను తీసుకెళ్లారు.

రాజధానిని కమ్మేసిన ముసురు

హైదరాబాద్‌లో రోజంతా చిరుజల్లులు

మరో 2 రోజుల పాటు ఇదే పరిస్థితి!.. బంగాళాఖాతంలో బలహీన పడిన అల్పపీడనం

హైదరాబాద్ సిటీ, రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం రాష్ట్ర రాజధానిలో తీవ్రంగా కనిపించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు హైదరాబాద్ నగరాన్ని ముసురు కమ్మేసింది. చిరుజల్లులు, వానతో వర్షాకాలం నాటి వాతావరణం కనిపించింది. రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. మేడ్చల్‌లో గురువారం 4.8 మిల్లీమీటర్ల వర్షం కురవగా అల్వాల్‌లో 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక, రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులతో హైదరాబాద్‌లో చలి తీవ్రత తగ్గి రాత్రిళ్లు 20 డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్‌లో గురువారం 23 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవ్వగా 20.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. హైదరాబాద్ పరిసరాల్లో మరో రెండు రోజుల పాటు చిరుజల్లులు కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఇక, పశ్చిమ మధ్య నైరుతి బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం బలహీనపడిందని, ఉపరితల ఆవర్తనం మాత్రం కొనసాగుతోందని విశాపట్నంలోని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.



ఖైరతాబాద్‌లో గురువారం కురుస్తున్న వర్షం

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.